జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

కృష్ణ | ఆదివారం 19 ఏప్రిల్ 2026 | సంపుటి : 01 | సంచిక : 286 | పేజీలు : 12 | వెల : 4/- | PRGI No. APTEL/26/A0119,

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్ణిమాంత - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989694528

## మహిళా రిజర్వేషన్ల సవరణ బిల్లును

# ఓడించడం దుర్మార్గం




- మహిళలను మోసం చేయడం కాంగ్రెస్‌కు అలవాటే!
- మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుపడి జాతికి ద్రోహం చేశారు
- మహిళల్ని ఓటు అడిగే పార్టీలు వారి సాధికారతను ఎలా అడ్డుకుంటాయి
- నిడదవోలులో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల నిరసన ర్యాలీలో పాల్గొన్న సీఎం చంద్రబాబు

**నిడదవోలు**

పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకుని కాంగ్రెస్ నేతత్వంలోని విపక్ష పార్టీలు జాతికి ప్రత్యేకించి మహిళలకు ద్రోహం, అన్యాయం చేశాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఈ బిల్లును అడ్డుకున్నందుకు నిరసనగా నిడదవోలులో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు నిర్వహించిన ర్యాలీలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ నేతలతో కలిసి సీఎం ఈ నిరసన ర్యాలీలో ప్లకార్డులు చేతపట్టుకుని నడిచారు. మహిళా బిల్లును అడ్డుకున్న రోజును ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి రోజని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నేతత్వంలోని ప్రతిపక్షాలు మహిళా ద్రోహులని పేర్కొన్నారు. మహిళా సమాజానికి ప్రతిపక్షంలో ఉన్న రాజకీయ పార్టీలు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళల్ని ఓటు బ్యాంకుగా చూసే

- మిగతా3లో



## కేంద్రం ఆదుకుంది.. శనగ రైతులకు

# ప్రయోజనం కలిగింది

- కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో మాట్లాడిన మంత్రి అచ్చెన్న
- క్రాప్ డైవర్షన్ వల్ల మొక్కజొన్న సాగు, దిగుబడి పెరిగిందని కేంద్రానికి వివరించిన మంత్రి అచ్చెన్న

## దక్షిణాది రాష్ట్రాలను బలహీనపర్చే ప్రయత్నం

- భారత్ అనే భావనను పరిరక్షించడానికే బిల్లును ఓడించాం
- డీలిమిటేషన్‌పై రాహుల్ గాంధీ
- పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు కలిసి బిల్లును అడ్డుకున్నామన్న రాహుల్
- దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాల బలం తగ్గించడమే కేంద్ర లక్ష్యమని విమర్శ
- తమిళనాడు సంస్కృతి, భాషపై బీజేపీ-ఆర్ఎస్ఎస్ దాడి చేస్తున్నాయన్న ఆరోపణ



## 2శాతం డీఏ పెంపు, గ్రామాలకు రూ.83వేల కోట్లు, కొత్త రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం



- కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు
- కేంద్ర ఉద్యోగులు, పెన్షనర్లకు 2%డీఏ పెంపు
- జనవరి 2026 నుంచి అమలు
- గ్రామీణ రహదారులకు రూ.83,977 కోట్లతో పీఎంసీజీఎస్‌పై పొడిగింపు
- ఏపీలో రాజమండ్రి, విశాఖ మధ్య కొత్త రైల్వే లైన్లు



## విపక్షాలు భారీ మూల్యం

# చెల్లించుకుంటాయ్

- జీవితాంతం ఆ విషయంలో చింతిస్తాయ్
- విపక్షాలు జీవితాంతం పశ్చాత్తాపపడతాయని ప్రధాని మోదీ వ్యాఖ్యలు
- మహిళల హక్కులను అడ్డుకున్నారని కిరణ్ రిజిజు ఆరోపణలు
- మహిళల ఆశలను తుంగలో తొక్కినట్లయింది

## ప్రజాస్వామ్యానికి అతిపెద్ద విజయం



- ప్రభుత్వానికి చీకటిరోజు
- మహిళా రిజర్వేషన్ల బిల్లుపై ప్రియాంక గాంధీ
- మహిళా రిజర్వేషన్ల బిల్లుపై ప్రియాంక గాంధీ కీలక వ్యాఖ్యలు
- రాజకీయ ప్రయోజనాల కోసమే బిల్లును తీసుకొచ్చినట్లు వ్యాఖ్య
- కేంద్రంపై విమర్శలు

## ఈ నెల 30వ తేదీ వరకు

# స్వీయ జనగణన

- మీ స్మార్ట్ ఫోన్ ద్వారా ఇలా నమోదు చేసుకోండి
- స్మార్ట్ ఫోన్ ద్వారా సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియ
- అధికారిక వెబ్‌సైట్ సాయంతో ప్రజలు స్వయంగా వివరాలన్నీ నమోదు చేసుకునే అవకాశం
- ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించేందుకు ప్రత్యేక స్టాల్ ఏర్పాటు




**అమరావతి**

డిజిటల్ విప్లవం కొత్త పుంతలు తొక్కడంతో విప్లవాత్మక మార్పులు జరుగుతున్నాయి. ప్రభుత్వ పాలన, సేవల్లో సైతం వీటి ప్రభావం ఎంతో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ఈ కోవలోనే ప్రభుత్వ గణాంకాల సేకరణ పద్ధతులు కూడా మారుతుండటం ఇప్పుడు గమనించాల్సిన విషయం. గతంలో ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వచ్చి వివరాలను సేకరించేవారు. కానీ ఇప్పుడు ఆ శ్రమ లేదు. కేవలం మీ స్మార్ట్ ఫోన్ లేదా కంప్యూటర్ ద్వారా మీరే స్వయంగా మీ మీ వ్యక్తిగత వివరాలన్నింటినీ నమోదు చేసుకునే సెల్ఫ్ ఎన్యుమరేషన్ విధానం ప్రస్తుతం అందుబాటులోనికి వచ్చింది. ఇది ఏ విధంగా పని చేస్తుందో, వాటి వల్ల కలిగే ప్రయోజనాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం. ప్రభుత్వాలు నిర్వహించేటటువంటి జనాభా

- మిగతా3లో

## 2 వేల మంది

# హజ్ యాత్ర



- ఒక్కొక్కరికి ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సాయం
- గన్నవరం విమానాశ్రయం నుంచి నేడు, రేపు మక్కాకు వెళ్లనున్న హజ్ యాత్రికులు
- ఈ ఏడాది రాష్ట్రం నుంచి 2 వేల మంది హజ్ యాత్రకు వెళ్లనున్నట్లు తెలిపిన మంత్రి ఫరూక్

**అమరావతి**

గన్నవరం విమానాశ్రయం నుంచి శని, ఆది వారాల్లో రెండు విడతలుగా రాష్ట్రానికి చెందిన హజ్ యాత్రికులు బయలుదేర నున్నారని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. కృష్ణా జిల్లా గన్నవరం మండలం చిన అవుటపల్లిలోని కన్వెన్షన్‌లో

- మిగతా3లో



## హోర్ముజ్ వద్ద ఉద్రిక్తత.. రెండు నౌకలపై కాల్పులు

### జలసంధి దాటిన భారత నౌకలు

## పార్లమెంటు ఉభయసభల నిరవధిక వాయిదా

- మహిళా రిజర్వేషన్లపై రాజ్యసభలో ప్రైవేటు బిల్లు
- ముగిసిన పార్లమెంటు బడ్జెట్ సెషన్
- 3 రోజుల ప్రత్యేక సెషన్‌లో ఆమోదానికి నోచుకోని బిల్లులు
- స్పీకర్ ఓం బిర్లాను కలిసిన ప్రధాని, కేంద్ర మంత్రులు, ఎంపీలు



# విపక్షాలు భారీ మూల్యం చెల్లించుకుంటాయ్

పార్లమెంటులో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు తీసుకొచ్చిన కీలక రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందకపోవడంపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విపక్షాల వైఖరి దేశ మహిళలకు అన్యాయం చేసిందని, ఈ విషయంలో వారు జీవితాంతం చింతించాల్సి వస్తుందని మండిపడ్డారు. కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై మోదీ స్పష్టంగా స్పందించినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. శనివారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశానికి అధ్యక్షత వహించిన మోదీ, మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడం ద్వారా విపక్షాలు తమ అసలు స్వరూపాన్ని బయటపెట్టాయని అన్నారు. దేశంలోని ప్రతి గ్రామానికి ఈ విషయాన్ని తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. మహిళల ఆశలను తుంగలో తొక్కినట్లయిందని, ఈ నిర్ణయం రాజకీయంగా కూడా విపక్షాలకు భారీ మూల్యం చెల్లింపజేస్తుందని హెచ్చరించారు.

**బిల్లును అడ్డుకోవడం ఘోర పాపం: రిజిజు**

ఇదే విషయంపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు కూడా తీవ్రంగా స్పందించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడం ఘోర పాపమని ఆయన విమర్శించారు. మహిళలకు హక్కులు కల్పించే చట్టాన్ని అడ్డుకోవడం దుర్మార్గమని, దానిపై సంబరాలు చేసుకోవడం మరింత దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లును అడ్డుకున్న విపక్ష నేతలు మహిళా వ్యతిరేకులుగా నిలిచిపోయారని అన్నారు.



**రాహుల్ సమాధానం చెప్పాలని డిమాండ్**

లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఈ బిల్లును ఎలా అప్రజాస్వామికమని చెబుతున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని రిజిజు డిమాండ్ చేశారు. కేంద్రానికి మహిళా రిజర్వేషన్ అమలు చేయాలనే స్పష్టమైన సంకల్పం ఉన్నప్పటికీ, విపక్షాలు అడ్డంకులు సృష్టించాయని ఆరోపించారు. డీలిమిటేషన్ అంశాన్ని సాకుగా చూపిస్తూ బిల్లును అడ్డుకోవడం సరైన విధానం కాదని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు సంబంధించిన ఓటింగ్ లోక్‌సభలో తీవ్ర ఉద్రిక్తతల మధ్య జరిగింది. మొత్తం 528 మంది సభ్యులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. అందులో 298 మంది బిల్లుకు అనుకూలంగా ఓటు వేయగా, 230 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. అయితే రాజ్యాంగ సవరణ బిల్లుకు అవసరమైన రెండు మూడవ వంతు మెజారిటీ (352 ఓట్లు) రాకపోవడంతో బిల్లు తిరస్కరణకు గురైంది. బిల్లు ద్వారా లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలనే లక్ష్యంతో పాటు, డీలిమిటేషన్ ప్రక్రియ అనంతరం స్థానాల సంఖ్యను పెంచే ప్రతిపాదన కూడా ఉంది. 2029 ఎన్నికల నాటికి ఈ రిజర్వేషన్ అమల్లోకి తీసుకురావాలని కేంద్రం భావించింది. అయితే విపక్షాలు ఈ విధానంపై అనేక అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. ప్రధానంగా, డీలిమిటేషన్ తర్వాత దక్షిణ రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గే అవకాశం ఉందని విపక్షాలు ఆందోళన వ్యక్తం చేశాయి. అలాగే, కేంద్రం రాజకీయ లాభం కోసం ఈ బిల్లును ఉపయోగించుకుంటోందని కూడా ఆరోపించాయి. మహిళా రిజర్వేషన్‌కు తమ మద్దతు ఉన్నప్పటికీ, అమలు విధానం పట్ల అభ్యంతరాలు ఉన్నాయని విపక్షాలు స్పష్టం చేశాయి. ఇక కేంద్రం మాత్రం ఈ ఆరోపణలను ఖండించిం ది. మహిళల సాధికారత కోసం తీసుకొచ్చిన చట్టాన్ని అడ్డుకోవడం ద్వారా విపక్షాలు తమ నిజ స్వరూపాన్ని చూపించాయని పేర్కొంది. మహిళల ఆగ్రహాన్ని వారు తప్పక ఎదుర్కోవాల్సి వస్తుందని కిరణ్ రిజిజు హెచ్చరించారు. ఈ పరిణామం దేశ రాజకీయాల్లో పెద్ద చర్చకు దారితీసింది. మహిళా రిజర్వేషన్ అంశం మరోసారి జాతీయ రాజకీయాల్లో ప్రధాన అజెండాగా మారింది. ముందున్న రోజుల్లో ఈ అంశంపై కేంద్రం, విపక్షాల మధ్య మరింత రాజకీయ పోరు కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# దక్షిణాది రాష్ట్రాలను బలహీనపర్చే ప్రయత్నం

తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల వేడి పెరుగుతున్న వేళ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు పేరుతో పార్లమెంట్‌లో తీసుకొచ్చిన తాజా రాజ్యాంగ సవరణ వెనుక అసలు ఉద్దేశం నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అని ఆయన విమర్శించారు. దేశం అనే భావనను, రాష్ట్రాల సమాఖ్య వ్యవస్థను రక్షించడానికే ప్రతిపక్షాలు ఏకమై ఆ బిల్లును ఓడించాయని స్పష్టం చేశారు. తిరువల్లూరు జిల్లా పొన్నేరిలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న రాహుల్ గాంధీ, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లుపై విస్తృతంగా మాట్లాడారు. 2023లోనే మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం లభించినప్పటికీ, మళ్లీ అదే పేరుతో బిల్లు తీసుకురావడం వెనుక దాగి ఉన్నది డీలిమిటేషన్ అని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రక్రియ ద్వారా రాష్ట్రాల వారీగా లోక్‌సభ స్థానాల సంఖ్యలో మార్పులు చేసి దక్షిణాది రాష్ట్రాలను బలహీనపర్చే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.

**దేశ సమాఖ్య వ్యవస్థకు విరుద్ధం**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా దేశ ప్రజలకు అసలు నిజం చెప్పలేదని రాహుల్ గాంధీ అన్నారు. మహిళల ప్రాతినిధ్యం పెంచడమే లక్ష్యమని చెప్పినా, ఆ బిల్లులో "దురుద్దేశపూరిత ఆలోచన" దాగి ఉందని విమర్శించారు. దేశ ఎన్నికల మ్యాప్‌ను మార్చి కొన్ని రాష్ట్రాల ప్రభావాన్ని తగ్గించాలనే ప్రయత్నమని పేర్కొన్నారు. అసోం, జమ్మూకశ్మీర్ రాష్ట్రాల్లో ఇప్పటికే ఎన్నికల నియోజకవర్గాల



పునర్విభజన చేసి రాజకీయ సమీకరణాలను మార్చారని, అదే నమూనాను దేశమంతటా అమలు చేయాలని కేంద్రం చూస్తోందని ఆయన ఆరోపించారు. ఇది దేశ సమాఖ్య వ్యవస్థకు విరుద్ధమని, రాష్ట్రాల స్వరాన్ని అణగదొక్కే చర్యగా ఆయన అభివర్ణించారు. భారతదేశం ఒక రాష్ట్రాల సమాఖ్య అని రాజ్యాంగంలో స్పష్టంగా ఉందని రాహుల్ గాంధీ గుర్తు చేశారు. ప్రతి రాష్ట్రానికి తనకంటూ ప్రత్యేక గుర్తింపు, సంస్కృతి, భాష, సంప్రదాయాలు ఉన్నాయని చెప్పారు. వాటిని రక్షించుకోవడం ప్రతి రాష్ట్ర హక్కు అని అన్నారు. ప్రతి రాష్ట్రం స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేయగలగాలి అని ఆయన అభిప్రాయపడ్డారు. తమిళనాడుతో తనకు ఉన్న అనుబంధాన్ని కూడా ఈ సందర్భంగా రాహుల్ గాంధీ ప్రస్తావించారు. తమిళనాడు ప్రజలతో తనకు ప్రత్యేకమైన బంధం ఉందని, ఇక్కడికి వచ్చినప్పుడు సొంత ఇంటికి వచ్చిన భావన కలుగుతుందని చెప్పారు. జమ్మూకశ్మీర్‌కు వెళ్లినప్పుడు కలిగే అనుభూతి ఇక్కడ కూడా ఉంటుందని ఆయన అన్నారు. అయితే, గత కొన్ని సంవత్సరాలుగా బీజేపీ, ఆర్ఎస్ఎస్ కలిసి తమిళ భాష, సంస్కృతి, సంప్రదాయాలపై దాడి చేస్తున్నాయని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఇది రాష్ట్ర గుర్తింపును దెబ్బతీసే ప్రయత్నమని అన్నారు. తమిళనాడును దిల్లీ నుంచి నియంత్రించాలని బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. పార్లమెంట్‌లో జరిగిన పరిణామాలపై మాట్లాడిన ఆయన, ప్రతిపక్షాలు ఒక పెద్ద రాయిలా నిలబడి ఆ బిల్లును అడ్డుకున్నాయని చెప్పారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడడంలో ఇది కీలక ఘట్టమని అన్నారు. డీలిమిటేషన్‌ను రాజకీయ ఆయుధంగా ఉపయోగించాలనే ప్రయత్నాన్ని విఫలపరిచామని పేర్కొన్నారు. ఇక తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల విషయానికొస్తే, ఏప్రిల్ 23న ఒకే దశలో పోలింగ్ జరగనుంది. మే 4న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఈ ఎన్నికల్లో డీఎంకే నేతృత్వంలోని కూటమి, ఎన్‌డీఏ మధ్య ప్రధాన పోటీ ఉండనుంది. కాంగ్రెస్ పార్టీ డీఎంకే కూటమిలో భాగంగా 28 స్థానాల్లో పోటీ చేస్తోంది. రాహుల్ గాంధీ ఈ ఎన్నికలను కేవలం ప్రభుత్వ మార్పు కోసం కాకుండా, రాష్ట్ర హక్కులను రక్షించే పోరాటంగా అభివర్ణించారు. తమిళనాడు భవిష్యత్తును తమిళ ప్రజలే నిర్ణయించాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. బీజేపీ-ఆర్ఎస్ఎస్ శక్తులు రాష్ట్రంపై ఆధిపత్యం సాధించకుండా అడ్డుకోవడమే తమ లక్ష్యమని తెలిపారు.

## 2శాతం డీఏ పెంపు, గ్రామాలకు రూ.83వేల కోట్లు,

# కొత్త రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం

కేంద్ర కేబినెట్ శనివారం పలు కీలక నిర్ణయాలను ఆమోదించింది. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఉపశమనం కలిగించే విధంగా కరవు భత్యం (డీఏ), డియర్‌నెస్ రిలీఫ్ (డీఆర్) ను 2 శాతం పెంచింది. ప్రస్తుతం ఉన్న 58 శాతం డీఏను 60 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ పెంపు 2026 జనవరి 1 నుంచి అమల్లోకి రానుంది. ఈ నిర్ణయం వల్ల దేశవ్యాప్తంగా సుమారు 50 లక్షల కేంద్ర ఉద్యోగులు, 68 లక్షల పెన్షనర్లు లాభపడనున్నారు. ధరల పెరుగుదల నేపథ్యంలో ఉద్యోగులపై పడుతున్న భారం తగ్గించేందుకు 7వ కేంద్ర వేతన సంఘం సిఫార్సుల ప్రకారం ఈ పెంపు అమలు చేస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. డీఏ పెంపు కారణంగా కేంద్ర ఖజానాపై సంవత్సరానికి రూ.6,791 కోట్ల అదనపు భారం పడనుంది.

**రహదారుల అభివృద్ధికి నిధులు**

ఇక గ్రామీణాభివృద్ధి దిశగా మరో కీలక నిర్ణయం తీసుకున్న కేబినెట్, ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై)ను 2028 వరకు పొడిగించింది. గ్రామీణ ప్రాంతాల్లో రహదారి కనెక్టివిటీని మెరుగుపర్చేందుకు వచ్చే మూడు సంవత్సరాల్లో రూ.83,977 కోట్లను ఖర్చు చేయనున్నారు. ముఖ్యంగా వ్యవసాయ మార్కెట్లు, పాఠశాలలు, ఆసుపత్రులకు గ్రామాల నుంచి రాకపోకలు సులభతరం చేసే రహదారుల అభివృద్ధిపై ఈ నిధులు వినియోగించనున్నారు. రైల్వే రంగంలో కూడా కేంద్రం భారీ ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లో రాజమండ్రి నుంచి విశాఖపట్నం వరకు మరో రెండు రైల్వే లైన్ల నిర్మాణానికి రూ.9,889 కోట్లతో గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మొత్తం 198 కిలోమీటర్ల మేర ఈ ప్రాజెక్టు అమలవుతుంది. నిడదవోలు-- దువ్వాడ మధ్య కొత్త లైన్లు నిర్మించడంతో చెన్నై-- హౌరా ప్రధాన మార్గంలో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టు తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలను కవర్ చేయనుంది. ప్రస్తుతం ఈ మార్గంలో రైల్వే సామర్థ్యం 130 శాతానికి చేరుకోవడంతో తరచూ ఆలస్యాలు, రద్దీ సమస్యలు ఎదురవుతున్నాయి. కొత్త లైన్ల నిర్మాణంతో ఈ సమస్యలకు పరిష్కారం లభించనుంది. ఇంకా గోదావరి నదిపై 4.3 కిలోమీటర్ల పొడవైన రైల్వే వంతెన, 2.67




కిలోమీటర్ల వయాడక్ట్, మూడు బైపాస్ మార్గాలు ఈ ప్రాజెక్టులో భాగంగా నిర్మించనున్నారు. ఈ లైన్లు పూర్తయితే సరకు రవాణా వేగవంతం కావడంతో పాటు ప్రయాణికులకు కూడా సౌకర్యం పెరుగుతుంది.

అదేవిధంగా గాజియాబాద్--సీతాపూర్ మధ్య మూడో, నాలుగో రైల్వే లైన్ల నిర్మాణానికి కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. దేశవ్యాప్తంగా రైల్వే మౌలిక సదుపాయాలను విస్తరించడమే లక్ష్యంగా ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. తూర్పు తీర ప్రాంతంలో ఉన్న విశాఖపట్నం, గంగవరం, మచిలీపట్నం, కాకినాడ పోర్టులకు రైల్వే కనెక్టివిటీ మరింత మెరుగుపడనుంది. ఈ మార్గం దేశంలో అత్యంత రద్దీగా ఉండే సరకు రవాణా మార్గాల్లో ఒకటిగా ఉండటంతో, పరిశ్రమల అభివృద్ధికి ఇది కీలకంగా మారనుంది.

**ప్రత్యేక నిధి ఏర్పాటు**

ఇక అంతర్జాతీయ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని సముద్ర రవాణా భద్రతకు సంబంధించి కూడా కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. భారత్ మారిటైమ్ ఇన్సూరెన్స్ పూల్ అనే ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలని కేబినెట్ ఆమోదించింది. దీనికి సుమారు రూ.13,000 కోట్ల సావరిన్ గ్యారంటీ ఇవ్వనున్నారు. పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తతలు, ముఖ్యంగా హర్మూజ్ జలసంధిలో జరుగుతున్న దాడుల కారణంగా సముద్ర రవాణాపై ప్రమాదాలు పెరిగాయి. ఈ నేపథ్యంలో భారత నౌకలు, అలాగే భారతదేశానికి వస్తున్న లేదా ఇక్కడి నుంచి వెళ్లే సరకు నౌకలకు బీమా రక్షణ కల్పించేందుకు ఈ నిధి ఉపయోగపడనుంది. ఈ ఇన్సూరెన్స్ పూల్ ద్వారా నౌకలు, సరుకు, యంత్రాంగం, యుద్ధ సంబంధిత ప్రమాదాలు సహా అన్ని రకాల రిస్క్‌లకు కవరేజీ అందించనున్నారు. అంతర్జాతీయ బీమా సంస్థలపై ఆధారాన్ని తగ్గిస్తూ, దేశీయంగా బీమా వ్యవస్థను బలోపేతం చేయడమే దీని ముఖ్య ఉద్దేశం. మొత్తంగా చూస్తే, ఉద్యోగులకు ఆర్థిక ఉపశమనం, గ్రామీణాభివృద్ధికి ప్రోత్సాహం, రైల్వే మౌలిక సదుపాయాల విస్తరణ, సముద్ర రవాణా భద్రత వంటి కీలక రంగాల్లో కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాలు దేశ ఆర్థిక వ్యవస్థకు దోహదం చేసేలా ఉన్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## పార్లమెంటు ఉభయసభల నిరవధిక వాయిదా

పార్లమెంటు ఉభయసభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. శనివారం ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభంకాగానే సభ్యులు జాతీయ గేయాన్ని ఆలపించారు. అనంతరం ఎటువంటి ఇతర చర్చలు, బిల్లుల ప్రక్రియలు లేకుండానే సభను స్పీకర్ ఓం బిర్లా నిరవధిక వాయిదా వేశారు. సభ ప్రారంభం కాగానే బడ్జెట్ సమావేశాలకు సంబంధించిన ముగింపు వ్యాఖ్యలను స్పీకర్ చదివారు. సభ వాయిదా పడే సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తదితరులు సభలో ఉన్నారు. జనవరి 28న ప్రారంభమైన పార్లమెంటు బడ్జెట్ సెషన్ ముగిసిన సందర్భంగా స్పీకర్ ఓం బిర్లాను గౌరవపూర్వకంగా కలిసిన వారిలో ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అమిత్‌షా, కిరణ్ రిజిజు, కాంగ్రెస్ ఎంపీలు కుమారి సెల్జా, కేసీ వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

**రాజ్యసభ సైతం**

ఇక శనివారం ఉదయం రాజ్యసభ ప్రారంభమైన కొద్దిసేపటికే ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ సభను నిరవధికంగా వాయిదా వేశారు. బడ్జెట్ సమావేశాలు, ప్రత్యేక సమావేశాలు ముగియడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈసారి పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో రాజ్యసభ సుమారు 157 గంటల 40 నిమిషాల పాటు పనిచేసిందని, 109.87 శాతం ఉత్పాదకతను సాధించిందని ఛైర్మన్ వెల్లడించారు. బడ్జెట్ సెషన్‌లో 117 ప్రశ్నలు, 446 జీరో అవర్ అభ్యర్థనలు, 207 స్పెషల్ మెన్షన్లకు అవకాశాన్ని ఇచ్చామన్నారు. ప్రస్తుతం రాజ్యసభలో 245 మంది సభ్యులు ఉన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై నాలుగు రోజుల చర్చలో 79 మంది ఎంపీలు, బడ్జెట్‌పై నాలుగు రోజుల చర్చలో 97 మంది ఎంపీలు పాల్గొన్నారని రాజ్యసభ ఛైర్మన్ తెలిపారు. ఈ సెషన్‌లోనే ఏప్రిల్ 17న రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా హరివంశ్ నారాయణ్ సింగ్ వరుసగా మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. రాజ్యసభ చరిత్రలో ఒక నామినేటెడ్ సభ్యుడు ఈ పదవిని చేపట్టడం ఇదే తొలిసారి.

**వీగిపోయిన రాజ్యాంగ సవరణ బిల్లు**

మొత్తం మీద మూడు రోజుల పాటు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు జరిగాయి. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల కోసం తెచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు గురువారం రోజు లోక్‌సభలో వీగిపోయింది. మూడింట రెండు వంతుల మెజారిటీ లేకపోవడంతో బిల్లు ఆమోదానికి నోచుకోలేదు. రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడంతో దానికి అనుబంధంగా ఉన్న యూటీ చట్ట సవరణ సహా డీలిమిటేషన్ బిల్లులను కేంద్రం వెనక్కి తీసుకుంది.

**మహిళా రిజర్వేషన్లపై ప్రైవేటు బిల్లు**

చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించే ప్రైవేటు మెంబర్ బిల్లును డీఎంకే ఎంపీ పీ విల్సన్ శనివారం రాజ్యసభలో ప్రవేశపెట్టారు. దేశంలోని 543 లోక్‌సభ నియోజకవర్గాలను పునర్విభజన చేయకుండా, జనగణనతోనూ సంబంధం లేకుండా వచ్చే ఎన్నికల నుంచే మహిళా కోటాను అమలు చేయాలని ఈ బిల్లులో ప్రతిపాదించారు. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, దిల్లీలలో అసెంబ్లీ సీట్ల సంఖ్యను పెంచకుండా, నియోజకవర్గాలను పునర్విభజన చేయకుండా, జనగణనతో సంబంధం లేకుండా మహిళా కోటాను అమలు చేయాలని ప్రపోజ్ చేశారు. మహిళలకు చట్టసభల్లో శాశ్వతంగా 33 శాతం రిజర్వేషన్లు అమల్లో ఉంటాయని ప్రైవేటు మెంబర్ బిల్లులో పేర్కొన్నారు. శనివారం రోజు సభకు సంబంధించిన మిగతా కార్యకలాపాలన్నీ ఆపేసి, ఈ బిల్లుపైనే చర్చకు అవకాశాన్ని ఇవ్వాలంటూ రూల్ 267 ప్రకారం రాజ్యసభ ఛైర్మన్‌కు డీఎంకే ఎంపీ పీ విల్సన్ నోటీసు ఇచ్చారు.

**బీజేపీ జం విపక్షాలు**

విపక్షాల మొండి వైఖరి వల్లే మహిళలకు లోక్‌సభ, అసెంబ్లీల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించే చారిత్రక బిల్లు ఆమోదానికి నోచుకోలేదని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా విమర్శించారు. ఆ బిల్లుకు నియోజకవర్గాల పునర్విభజన, జనగణనలతో లింక్ పెట్టినందు వల్లే తాము మద్దతు ఇవ్వలేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తేల్చి చెప్పారు. మహిళా కోటా ముసుగులో భారతదేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చేందుకు బీజేపీ యత్నించిందని ఆయన ఆరోపించారు. తమిళనాడు, కేరళ, బంగాల్, అసోం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న వేళ నిర్వహించిన మూడు రోజుల ప్రత్యేక పార్లమెంటు సెషన్ రాజకీయ ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.

## ప్రజాస్వామ్యానికి అతిపెద్ద విజయం

మహిళల రిజర్వేషన్ల కోసం కేంద్ర ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడంపై ప్రియాంక గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. డీలిమిటేషన్, మహిళల హక్కుల కోసం తీసుకొచ్చిన బిల్లు కాదని పేర్కొన్నారు. విపక్షాలన్నీ ఏకతాటిపైకి వచ్చి ప్రభుత్వాన్ని ఓడించాయని తెలిపారు. ఇది ప్రజాస్వామ్యానికి అతిపెద్ద విజయమని పేర్కొన్నారు. మహిళలకు తక్షణమే హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. శనివారం దిల్లీలో నిర్వహించిన మీడియాలో సమావేశంలో ప్రియాంక గాంధీ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. 'అన్ని పార్టీల మద్దతుతో 2023లో ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ బిల్లును తిరిగి తీసుకురావాలి. అమలు కోసం చిన్న మార్పులు అవసరమైతే చేయండి. కానీ ఆలస్యం చేయకుండా మహిళలకు హక్కులు వెంటనే ఇవ్వండి. మహిళా రిజర్వేషన్‌కు మేం వ్యతిరేకం కాదు. అయితే దానిని జనగణన, డీలిమిటేషన్ ప్రక్రియలతో అనుసంధానం చేయడానికే వ్యతిరేకం. ఇతర అంశాలతో కలిపి ప్రజలను తప్పుదోవ పట్టించకండి. వెంటనే అమలు చేయండి' అని ప్రియాంక గాంధీ అన్నారు.

**ప్రభుత్వంపై ఘాటు విమర్శలు**

కేంద్రంపై ప్రియాంక గాంధీ విమర్శలు గుప్పించారు. బిల్లు వీగిపోవడం ప్రజాస్వామ్యానికి అతిపెద్ద విజయమని, విపక్షాలన్నీ ఏకతాటిపైకి వచ్చి ప్రభుత్వాన్ని ఓడించాయని ప్రియాంకగాంధీ వ్యాఖ్యానించారు. ఫెడరల్ వ్యవస్థను బలహీనపరచే ప్రభుత్వ ప్రయత్నం విఫలమైందని అన్నారు. ఇది రాజ్యాంగానికి, దేశానికి, ప్రతిపక్ష ఐక్యతకు విజయమని తెలిపారు. మహిళా మెస్సయ్య కావాలని ప్రధాని నరేంద్ర మోదీ భావించారని విమర్శించారు. ఇది వారికి బ్లాక్? డే అని అన్నారు. మహిళల సమస్యలు రోజురోజుకీ పెరుగుతున్నాయని, ఏం జరుగుతుందో వారు అర్థం చేసుకుంటున్నారని తెలిపారు. ప్రచారం, మీడియా హైప్ ఇక పనిచేయదని పేర్కొన్నారు.

## హోర్ముజ్ వద్ద ఉద్రిక్తత..

## రెండు నౌకలపై కాల్పులు..

హోర్ముజ్ జలసంధి వద్ద మళ్లీ ఉద్రిక్త పరిస్తితులు నెలకొంటున్నాయి. తాజాగా హోర్ముజ్ జలసంధిని దాటేందుకు ప్రయత్నిస్తున్న రెండు నౌకలపై ఇరాన్‌లోని ఐఆర్‌జీసీకి చెందిన గన్ బోట్స్ కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. ఎలాంటి హెచ్చరిక, సమాచారం లేకుండానే ఈ కాల్పులు జరిగినట్లు నౌకలోని కెప్టెన్లు తెలిపినట్లు బ్రిటన్‌కు చెందిన మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ సంస్థ వెల్లడించింది. అయితే, ఈ కాల్పుల్లో ఎవరికీ ఎలాంటి హానీ జరగలేదని వివరించింది. మరోవైపు ఇండియాకు చెందిన చమురు నౌక ఒకటి శనివారం హోర్ముజ్ జలసంధిని దాటింది. దేశ్ గరిమ అనే నౌక ఈ జలసంధిని దాటినట్లు అక్కడి ట్రాఫిక్ డాటా ద్వారా తెలిసింది. యుద్ధం ప్రారంభమైన తర్వాత జలసంధిని దాటిన పదో భారత నౌక ఇది. ఖతార్‌లోని రస్ లాఫ్ఫాన్ పోర్టు నుంచి ఈ నౌక ఇండియాకు వస్తోంది. ప్రస్తుతం గల్ఫ్ ఆఫ్ ఒమన్ వద్ద ఈ నౌక ఉన్నట్లు తెలుస్తోంది. మొత్తంగా ఈ రోజు హోర్ముజ్ నుంచి వివిధ దేశాలకు చెందిన ఎనిమిది నౌకలు దాటినట్లు అంచనా. హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసేస్తున్నట్లు ప్రకటించడానికి ముందే ఈ నౌకలు ఈ ప్రదేశాన్ని దాటి ఉండొచ్చు. ప్రస్తుతం హోర్ముజ్‌ను ఇరాన్ మూసేసిన నేపథ్యంలో మళ్లీ నౌకల రవాణా నిలిచిపోనుంది. హోర్ముజ్ ప్రస్తుతం ఇరాన్ మిలిటరీ నియంత్రణలో ఉంది. ఇంకోపక్క లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తోంది. ఆ దేశంతో ఇరాన్ పది రోజులపాటు కాల్పుల ఒప్పందం కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. ఒక పక్క ఈ ఒప్పందం ఉన్నప్పటికీ లెబనాన్‌లోని హెజ్బొల్లా తీవ్రవాద సంస్థపై దాడి చేసినట్లు ఇజ్రాయెల్‌కు చెందిన ఐడీఎఫ్ (ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్) తెలిపింది. దక్షిణ లెబనాన్‌లోని యెల్లో లైన్ వద్ద ఉన్న తీవ్రవాదులు కాల్పుల విరమణ నిబంధనలు ఉల్లంఘించడంతో తాము దాడులు చేశామని ఇజ్రాయెల్ తెలిపింది. మరోవైపు ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజా హెచ్చరిక జారీ చేశారు. ఈ రెండు దేశాల మధ్య పాకిస్తాన్ వేదికగా సోమవారం రెండో దశ చర్చలు జరగనున్న నేపథ్యంలో ట్రంప్ వార్నింగ్ ఇచ్చారు. బుధవారం లోపు ఇరాన్ తమతో ఒప్పందం కుదుర్చుకోకపోతే.. మళ్లీ దాడులు చేస్తామని హెచ్చరించారు.

# 2 వేల మంది హజ్ యాత్ర

-మొదటిపేజీ తరువాయి

హజ్ క్యాంపు కార్యాలయం వద్ద యాత్రికుల బస్సును మంత్రి కొల్లు రవీంద్ర జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విజయవాడ గన్నవరం విమానాశ్రయం నుంచి నేడు, రేపు (ఏప్రిల్? 18, 19 తేదీల్లో) రెండు విడతలుగా రాష్ట్రానికి చెందిన హజ్ యాత్రికులు మక్కా యాత్రకు బయలుదేరనున్నట్లు తెలిపారు. మొదటి విడత హజ్? యాత్రికులు ప్రయాణం ప్రారంభమయ్యింది. మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ ఈ ఏడాది రాష్ట్రం నుంచి 2 వేల మంది హజ్ యాత్రకు వెళ్లనున్నట్లు తెలిపారు. వీరిలో గన్నవరం విమానాశ్రయం నుంచి ఈ నెల 18న 156 మంది, 19న 177 మంది హజ్? వెళ్లనున్నారు. గన్నవరం నుంచి బయల్దేరే వారికి రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ. లక్ష ఆర్థిక సాయం ప్రకటించిందని మంత్రి వెల్లడించారు. కార్యక్రమంలో ఏపీ హజ్ కమిటీ చైర్మన్ హాజీ షేక్ హసన్ బాషా, మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శి సీహెచ్ శ్రీధర్, ఏపీ ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫరూక్ షబ్లీ పాల్గొన్నారు. ప్రత్యేక వసతులతో శిబిరాలు: హజ్ యాత్రికులకు ఆర్థిక సాయాన్ని అందించేందుకు 6 కోట్ల 40 లక్షల రూపాయల విడుదలకు ప్రభుత్వం అనుమతులిచ్చిందని తెలిపారు. విజయవాడ, హైదరాబాద్, బెంగళూరు విమానాశ్రయాల నుంచి హజ్ యాత్రకు వెళ్లే రాష్ట్రానికి చెందిన వారికి ప్రత్యేక వసతులతో శిబిరాలు నిర్వహించేందుకు ఈ నిధులు వినియోగించనున్నట్లు చెప్పారు.

'హజ్ యాత్ర కోసం మొదటి సారిగా విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్? ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ఏర్పాట్లు చాలా బాగా చేశారు. అన్ని సదుపాయాలు బాగున్నాయి. మేము ఊహించిన దాని కంటే హజ్? కమిటీ అద్భుతమైన సేవలందించింది. అల్లా దగ్గరకు వెళ్లే మా ప్రయాణం కూటమి ప్రభుత్వ కల్పించిన సౌకర్యాలతో ఎంతో సాఫీగా ఆనందంగా ప్రారంభమయ్యింది.' హజ్? యాత్రికులకు కూటమి సాయం: విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి హజ్ యాత్రకు వెళ్లేందుకు దరఖాస్తు చేసుకున్న యాత్రికుల ఖాతాల్లో రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయాన్ని జమ చేసినట్లు రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్ హసన్ బాషా గతంలోనే తెలిపారు. విజయవాడ నుంచి హజ్ యాత్రకు వెళ్లే వారు ఎక్కువమంది లేకపోవడంతో 2025లో ఎంబార్కేషన్ పాయింట్‌ను కేంద్రం రద్దు చేయగా, ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ తీసుకుని కేంద్రానికి లేఖ రాయడంతో దానిని పునరుద్ధరించిన సంగతి తెలిసిందే.



# నత్తనడకన దిండి- చించినాడ పనులు

**రాజమండ్రి :** ఉభయ గోదావరి జిల్లాలను కలుపుతూ దిండి–చించినాడ గ్రామాల వద్ద వశిష్ట నదీపాయపై నిర్మించిన వంతెన మరమ్మత్తుల పేరుతో భారీవాహనాలను నిషేదించి ఇప్పటికి 8నెలలు పూర్తి కావస్తుంది.. అయినప్పటికీ మరమ్మత్తు పనులు నత్తనడకన సాగుతుండడం ప్రజలకు తీవ్ర ఆగ్రహాన్ని కలిగిస్తోంది. అటు పశ్చిమగోదావరి జిల్లా, నర్సాపురం జిల్లాలు ఇటు అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో ఉన్న విద్యాసంస్థలకు అధిక సంఖ్యలో విద్యార్థులు ప్రతీరోజూ రాకపోకలు సాగిస్తుంటారు. ఈ వంతెన మరమ్మత్తులతో అటుగా విద్యార్థులు నడిచి వచ్చి వెళుతుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.. ఇదే తరహాలో ఉద్యోగులు కూడా అనేక సమస్యలు లేవనెత్తుతున్నారు. ముఖ్యంగా మహిళలు ఇబ్బందులు అయితే వర్ణణాతీతం అంటున్నారు.. బస్సు ఎక్కి దిండి వద్ద దిగాల్సి వస్తుందని, మళ్లీ వంతెన పొడవునా నడిచి చించినాడ వెళ్లి అక్కడ బస్సు ఎక్కి వెళ్లాల్సి వస్తోందని, అదేవిధంగా సాయంత్రం తిరిగి ఇళ్లకు వస్తున్నప్పుడు చించినాడ వరకు బస్సులో వచ్చి అక్కడి నుంచి వంతెన పక్క నుంచి నడిచి మళ్లీ దిండి వద్ద బస్సు ఎక్కాల్సి వస్తోందని తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.. ఇదే తరహాలో కళాశాల బస్సులు వంతెనకు ఇరువైపులా ఉంచి విద్యార్థులను తరలిస్తున్నాయి. ఈమధ్యలో వంతెన పొడవునా నడుచుకుంటూ వెళ్లడం వల్ల రెండు గంటల సమయం వృథా అవుతుందంటున్నారు విద్యార్థులు.. దీని వల్ల అలసిపోవడం, కాలేజీలకు లేట్ అవ్వడం జరుగుతుందని వివరిస్తున్నారు. ఈప్రభావం చదువుపై పడుతుందంటున్నారు...దిండి – చించినాడ వద్ద 216 జాతీయ రహదారిని కలుపుతూ ఉన్న ఈ వంతెన ప్రాధాన్యత అంతా ఇంతా కాదు.. కేవలం పశ్చిమగోదావరి జిల్లాల ప్రజలే కాదు విశాఖపట్నం నుంచి వచ్చిన వారు నర్సాపురం, మచిలీపట్నం, విజయవాడ వెళ్లేవారు ఎక్కువగా ఈ రహదారి ద్వారా ప్రయాణాలు సాగిస్తుంటారు.. ట్రక్కులు, గూడ్స్ వెహికల్స్ కూడా ఈ రోడ్డు ద్వారా ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటాయి.. ఈ వంతెన మమ్మత్తులతో భారీ వాహనాలకు బ్రేక్ వేశామని చెబుతున్నా రాత్రి వేళల్లో అయితే లైట్ మోటారు వెహికల్స్‌కు కూడా అనుమతులు నిలిపివేయడం ప్రజల ఆగ్రహానికి కారణం అవుతుంది..2025 ఆగస్టు 25 నుంచి మరమ్మత్తుల నిమిత్తం ఈ వంతెనపై నిషేధం విధించారు. అప్పటి నుంచి బస్సులు, లారీలు, ఐషర్ వేన్‌లు ఇలా కొంచెం పెద్ద వాహనాలు ఏవీ రాకుండా నిషేదించారు. కార్లు, ఆటోలు, బైక్‌లకు మాత్రమే వెళ్లేందుకు అవకాశం కల్పించడగా వాటికి కూడా రాత్రివేళల్లో నిలిపివేయడంతో ఈ వంతెనపై ఏ సమయంలో ఎటువంటి ఆటంకం కలుగుతుందో తెలియని ప్రజలు ఈ మార్గంలో ప్రయాణాలు విరమించుకుంటున్నారు.. ఇప్పటివరకు వంతెన బేరింగ్ పనులు చేస్తోన్న సదరు కాంట్రాక్ట్ సంస్థ ఈ పనులను కూడా నత్తనడకన చేస్తుందని విమర్శిస్తున్నారు. మరో నెల రోజులు పైబడి వంతెన మరమ్మత్తులు జరుగుతాయని అధికారులు చెబుతున్నప్పటికీ మరో మూడు నెలల వరకు ఇదే పరిస్థితి కొనసాగేలా ఉందని ప్రజలు పెదవి విరుస్తున్నారువంతెన బేరింగ్ మరమ్మత్తు పనులు నిర్వహించే క్రమంలో వంతెన పిల్లర్ల వద్ద ఉన్న జాయింట్‌పై ఒత్తిడి పడకుండా పైన ఒక తాత్కాలిక ఇనుప వంతెన అమర్చుతున్నారు. ఇది ర్యాంప్ లు కలిగి ఎత్తుగా ఉండడంతో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయంటున్నారు. తాత్కాలిక వంతెన ర్యాంపు ఎక్కించే క్రమంలో కార్లు వేగాన్ని పెంచి వెళ్లడం వల్ల పలు ప్రమాదాలు జరిగాయని చెబుతున్నారు. 2025 ఆగస్టు 25 నుంచి ప్రారంభమైన ఈ మరమ్మత్తు పనులు పొడిగిస్తూ వస్తున్నారు.. ఇప్పటికే మూడు సార్ల వంతెనపై నిషేదాజ్ఞలు పొడిగిస్తూ వచ్చిన సదరు కాంట్రాక్టు సంస్థకు ఇచ్చిన గడువు పూర్తి అయినా ఇప్పటికీ మరమ్మత్తులు పూర్తి చేయలేని దుస్థితి కనిపిస్తోంది. కొన్ని రోజుల్లోనే పూర్తి స్థాయిలో వంతెన మరమ్మత్తులు పూర్తిచేస్తామని చెప్పుకొస్తున్నా అక్కడ పరిస్థితులను బట్టి మరో మూడు నెలలు పాటు కాలయాపన చేసేలా ఉన్నారని ప్రజలు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.



# కిలారు రాజేష్‌కు ఎందుకంత ప్రాధాన్యం

**విజయవాడ :** రాజకీయాలలో అవసరాలు మాత్రమే ఉంటాయి. ఎప్పటికీ అయ్యేది ప్రస్తుతమో అనే సామెత తీరుగానే అవి సాగిపోతుంటాయి. కానీ కొంతమంది వీటికి విరుద్ధంగా ఉంటారు. అవసరాలు కాకుండా ఆత్మీయత అనే ధోరణిలో పని చేస్తుంటారు. నాది అని కాకుండా.. మనది అనే కోణంలో అడుగులు వేస్తుంటారు. స్నేహం కోసం చివరికి తమను తాము కూడా లెక్క చేయరు. అటువంటివారు ఎటువంటి గుర్తింపును కోరుకోరు. ఎక్కడో మూలన ఉండిపోతారు. కానీ వెలుగులోకి వస్తే మాత్రం ఉదయించే సూర్యుడు కంటే ఎక్కువగా ప్రజ్వలిస్తుంటారు. ఈ ఉపమానం ఈ నాయకుడికి నూటికి నూరు శాతం సరిపోతుంది. ఆయన ఎవరు.. ఎందుకింత చర్చ జరుగుతోంది.. అనే ప్రశ్నలకు సమాధానం ఈ కథనం.ఆయన పేరు కిలారు రాజేష్. తెలుగుదేశం పార్టీలో జనరల్ సెక్రెటరీగా నియమితుల య్యారు. సాధారణంగా ఈ స్థాయికి రావాలంటే తెలుగుదేశం పార్టీలో చాలా కష్టపడాలి. చిన్న వయసులోనే ఆయనకు ఈ పదవి రావడం ఒకరకంగా వరమైతే.. ఆయన పడిన కష్టానికి లభించిన గౌరవం. నారా లోకేష్, కిలారు రాజేష్ మధ్య బలమైన స్నేహం ఉంది. వీరిద్దరూ ఒకే స్కూల్లో చదువుకు న్నారు. అలా ఏర్పడిన స్నేహం చివరికి రాజకీయాలకు దారితీసింది. రాజకీయాలలో కూడా నాలా లోకేష్ కు నమ్మిన బంటుగా కిలారు రాజేష్ ను ఆవిర్భవించేలా చేసింది. 2012లో తెలుగుదేశం పార్టీలో చేరారు రాజేష్. అప్పటికి ఇంకా తెలుగుదేశం పార్టీ అధికారం లో లేదు. తెలంగాణ



ఉద్యమం వల్ల ప్రత్యేకమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నది. ఇలాంటి స్థితిలో పార్టీలో ప్రవేశించిన రాజేష్.. నారా లోకేష్ కు నమ్మిన బంటుగా మారిపోయారు. 2014లో ఏపీలో తెలుగుదేశం అధికారంలోకి రావడంలో రాజేష్ కీలకపాత్ర పోషించారు. ముఖ్యంగా యువతను పార్టీకి దగ్గరగా చేశారు. నారా లోకేష్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత కిలారు రాజేష్ కీలకంగా వ్యవహరించారు. 2019లో పార్టీ ఓడిపోయిన తర్వాత రాజేష్ మరింత పట్టుదలతో పనిచేయడం మొదలు పెట్టారు. చంద్రబాబు జైలుకు వెళ్లడం తో లోకేష్ మీద ఒత్తిడి పెరిగిపోయింది.. ఈ నేపథ్యంలో నారా లోకేష్ కు అండగా నిలబడ్డారు రాజేష్. పార్టీ పెద్దలతో మంతనాలు జరిపారు. ఏపీలో జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు నారా లోకేష్ కు వివరించారు. వైసిపి చేస్తున్న కుట్రలను ఎప్పటికప్పుడు ఎండగట్టారు. తెర ముందుకు రాకపోయినప్పటికీ.. తెర వెనుక ఎంత చేయాలో అంతచేశారు రాజేష్. నారా లోకేష్ యువ గళం పేరుతో చేసిన పాదయాత్రకు కర్త కర్మ క్రియ రాజేష్ అంటే అతడి స్థాయి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. 3000 కిలోమీటర్ల పాటు లోకేష్ పాదయాత్ర జరిగితే.. ప్రారంభం నుంచి చివరి వరకు రాజేష్ ఆయన వెంట ఉన్నారు. ప్రజా సమస్యలను గుర్తించడంలో.. ప్రజలకు నారా లోకేష్ ను మరింత చేరువ చేయడంలో రాజేష్ కీలక పాత్ర పోషించారు. పార్టీ అధికారంలోకి వచ్చినప్పటికీ రాజేష్ ఎటువంటి పదవిని కోరుకోలేదు. అధికారంలో లేనప్పుడు ఎలా అయితే ఉన్నారో.. ఇప్పుడు కూడా అలానే ఉన్నారు.అతడి నిరాడంబరతను గుర్తించిన పార్టీ సుప్రీమ్ చంద్రబాబు నాయుడు.. జనరల్ సెక్రటరీ పదవితో అతడి సేవలను గుర్తించారు.. దీంతో రాజేష్ సేవలను మరింత ఉపయోగించుకోవాలని చంద్రబాబు భావించి ఈ పదవి కట్టబెట్టారు. జనరల్ సెక్రెటరీ పదవి వచ్చినప్పటికీ రాజేష్ డౌన్ టు ఎర్త్ లాగానే ఉన్నారు. నారా లోకేష్ కు నమ్మిన బంటు లాగానే సాగుతున్నారు..విలువలు పాటించే వారికి పదవి అవసరం లేదు. పార్టీ మాత్రమే ముఖ్యం అనుకునే వారికి ఎటువంటి హోదా అవసరం లేదు. కొంతమంది ముందు గౌరవం కూడా తగ్గిపోతుంది. పదవి కూడా తన స్థాయి తగ్గించుకుంటుంది. ఎందుకంటే మహోన్నతమైన వ్యక్తిత్వం ముందు మిగతావన్నీ చిన్న ఇసుక రేణువుల మాదిరి లాంటివే కదా.. ఈ ఉపమానం నూటికి నూరు శాతం కాదు కోటి శాతం కిలారు రాజేష్ కు వర్తిస్తుంది.

## మహిళా రిజర్వేషన్ల సవరణ బిల్లును ఓడించడం దుర్మార్గం

-మొదటిపేజీ తరువాయి

రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని సీఎం అన్నారు. మూడు దశాబ్దాల మహిళా రిజర్వేషన్ కలను ప్రతిపక్ష పార్టీలు చెరిపేశాయని పేర్కొన్న ముఖ్యమంత్రి మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవటం మహిళలకు ద్రోహం చేయడమేనని అన్నారు. ఎన్డీఏ పక్షాలతో కలిసి నిరసన ర్యాలీ అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ ..' భారత దేశ ప్రజాస్వామ్య చరిత్రలో నిన్నటి రోజు ఓ బ్లాక్ డే. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు వస్తాయని సుదీర్ఘ కల సాకారం అవుతుందని భావించాం. పార్లమెంటు, అసెంబ్లీలోనూ 33 శాతం మంది మహిళల్ని ప్రజాప్రతినిధులుగా చూస్తామని అనుకున్నాం. మహిళల్ని గౌరవించటం భారత సంస్కృతి లో భాగం. నిన్న పార్లమెంటులో దీనికి భిన్నంగా జరిగింది. విపక్షాల వైఖరికి నిడదవోలులో ఎన్డీఏ పక్షాలు నిరసన ర్యాలీ నిర్వహించాం.మహిళలంతా బయటకు వచ్చి వారికి నిరసన తెలియాలని పిలుపు ఇస్తున్నాను. దక్షిణాదికి, చిన్న రాష్ట్రాలకు అన్యాయం జరగదని ప్రధాని, హోం మంత్రి పార్లమెంటు సాక్షిగా హామీ ఇచ్చారు. 50 శాతం మేర సీట్లు పెరుగుతాయని స్పష్టంగా చెప్పారు. ఏపీలో కూడా 50 శాతం మేర సీట్లు పెరుగుతాయి. ప్రతిపక్ష పార్టీలు తమ రాజకీయ అజెండా కోసం ఈ దుర్మార్గం చేశాయి. దశాబ్దాలుగా మహిళా రిజర్వేషన్ కోసం పోరాడుతున్నాం.దీనిని అడ్డుకోవటం క్షమించరాని నేరం. ఆడబిడ్డలంటే కాంగ్రెస్ నేతత్వంలోని విపక్షాలకు ఇంత చులకనా.?' అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ఎన్డీఏ పక్షాలు నిర్వహించిన నిరసన ర్యాలీలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, జనసేన తరపున మంత్రి కందుల దుర్గేష్, నిమ్మల రామానాయుడు, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలకు చెందిన నేతలు పాల్గొన్నారు.

## కేంద్రం ఆదుకుంది.. శనగ రైతులకు ప్రయోజనం కలిగింది

**అమరావతి** రాష్ట్రంలోని రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం దఢసంకల్పంతో పనిచేస్తోందని, రైతులకు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టం కలగనీయబోమని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుత వ్యవసాయ పరిస్థితులను దష్టిలో ఉంచుకుని, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా మంత్రి అచ్చెన్నాయుడు చొరవ చూపి, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తో శనివారం విజయవాడలోని క్యాంప్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో శనగలు, మొక్కజొన్న పంటల పరిస్థితిని సమగ్రంగా వివరించి, రైతులకు న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, ఈ ఏడాది రాష్ట్రంలో శనగల సాగు గణనీయంగా పెరిగి, మొత్తం సుమారు 7,13,000 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి నమోదైందని తెలిపారు. ఇప్పటివరకు 94,500 మెట్రిక్ టన్నుల శనగలు కొనుగోలు పూర్తయిందని, మిగిలిన పంటను రైతులకు నష్టం కలగకుండా కొనుగోలు చేయాల్సిన అవసరం ఉందని కేంద్రానికి వివరించారు. అదనంగా 1,78,250 మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యాన్ని పెంచాలని కేంద్రాన్ని కోరారు. మంత్రి విజ్ఞప్తికి స్పందించిన కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, పీఎస్ఎస్ స్కీం కింద అదనంగా 15,000 మెట్రిక్ టన్నుల శనగలు తక్షణమే కొనుగోలు చేయడానికి అనుమతి ఇస్తూ సానుకూల నిర్ణయం తీసుకున్నారు. మిగిలిన 68,750 మెట్రిక్ టన్నుల శనగలను కూడా త్వరలోనే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు.

## ఈ నెల 30వ తేదీ వరకు స్వీయ జనగణన

-మొదటిపేజీ తరువాయి

గణన లేదా ఇతర రకాలైన సర్వేల్లో, ప్రజలు ఎన్యుమరేట్?ల సాయం లేకుండా అధికారిక పోర్టల్ ద్వారానే తమ కుటుంబ వివరాలను నమోదు చేయడాన్ని సెల్ఫ్ ఎన్యుమరేషన్ అంటారు. ఇది గోప్యతను కాపాడటమే కాకుండా, సమయాన్ని సైతం ఆదా చేసేందుకు ఎంతగానో దోహదపడుతుందనడంలో ఏ మాత్రం సందేహం లేదు.

నమోదు ప్రక్రియ: ముందుగా https://se.cen-sus.gov.in అని అధికారిక వెబ్‌సైట్‌ని ఓపెన్ చేసి సందర్శించాలి. ఇక్కడ ఉన్న లాగిన్ ప్రక్రియలో భాగంగా రాష్ట్రం, క్యాప్చాను నమోదు చేసి వెరిఫై చేయాలి. ఆ తర్వాత యజమాని పేరు, ఫోన్ నంబర్, ఈ–మెయిల్ ఐడీ నమోదు చేస్తే ఫోన్‌కు ఆరు అంకెల సందేశం వస్తుంది. వీటిని నమోదు చేసిన అనంతరం ప్రక్రియ అనేది ప్రారంభమవుతుంది. శాటిలైట్ మ్యాప్ కనిపిస్తూనే మీ చిరునామా, పిన్‌కోడ్ నమోదు చేయమని అడుగుతుంది. మీరిచ్చే సమాచారం ఆధారంగా అక్షాంశాలు, రేఖాంశాల వివరాలను తీసుకుని ఆపై మీ ఇంటిని మ్యాపులో నమోదు చేస్తుంది. అనంతరం ప్రశ్నావళి అనేది మొదలవుతుంది.

మీ ఇల్లు మట్టితో నిర్మించారా లేక సిమెంటుతో నిర్మితమైనదా? వీటి గోడల పరిస్థితి ఏ విధంగా ఉంది? అదే విధంగా ప్రస్తుతం మీ ఇల్లు ప్రస్తుతం ఏ స్థితిలో ఉంది. ఇలా దాదాపు 30 ప్రశ్నల వరకు సమాధానాలను ఇవ్వాల్సి ఉంటుంది. అంతేకాకుండా కుటుంబ సభ్యుల పేర్లు, వయసు, వారి వారి విద్యార్హతలు అలా అన్నీ నమోదు చేసుకుని సేవ్ చేసుకుంటూ వెళ్లినట్లయితే చివరకు ప్రివ్యూ చూసుకుని సబ్మిట్ చేయమని అడుగుతుంది. ఆపై సబ్మిట్ చేయగానే ఓ రెఫరెన్స్ నంబర్ వస్తుంది.

దానిని ఆ తర్వాత క్రమంలో ఎన్యుమరేటర్ మన ఇంటికి వచ్చినప్పుడు ఆ నెంబర్? ఇస్తే సరిపోతుంది. మళ్లీ మన వివరాలను వారికి చెప్పాల్సిన అవసరం ఏ మాత్రం ఉండదు. ఈ నెల ఏప్రిల్ 16 నుంచి 30 వరకు స్వీయ లెక్కింపునకు అవకాశం కల్పించినట్లు అధికారులు వెల్లడించగా, పోర్టల్‌లో తెలుగు సహా అన్ని ప్రాంతీయ భాషల్లో వివరాలను నింపేటటువంటి సౌకర్యాలను కల్పించడం విశేషం. ఈ పోర్టల్ ద్వారా ప్రజలు స్వయంగా వివరాలన్నీ నమోదు చేసుకునే అవకాశం ఉండటం గమనార్హం.

**ఈ నెల 30వ తేదీ వరకు అవకాశం**

ఏపీలో స్వీయ జన గణనకు ఏప్రిల్ 16వ తేదీ గురువారం నుంచి మొదలై ఈ నెల 30వ తేదీ వరకు ఉండనుందని అధికారులు ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఇందులో భాగంగా మొదటిసారి డిజిటల్ సాధనాల ద్వారా వివరాలను సేకరించనున్నారు. అందుకే కాబోలు ప్రతి ఒక్కరికీ పూర్తి అవగాహన కల్పించేందుకు విజయవాడలోని ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేశారు. అదే విధంగా స్వీయ గణన చేసుకునేందుకు ఓ క్యూఆర్ కోడ్‌ను సైతం అందుబాటులో ఉంచారు. ఈ కోడ్‌ను స్కాన్ చేసి లేదా అందుకు కేటాయించిన ప్రత్యేక వెబ్ పోర్టల్‌లోకి వెళ్లి వివరాలను నమోదు చేసుకోవచ్చు. అనంతరం 11 అంకెల విశిష్ట సంఖ్య (ఎస్ఈ ఐడీ) వస్తుంది. మే 1వ తేదీ నుంచి జన గణన సిబ్బంది ఇంటికి వచ్చినప్పుడు వారికి ఐడీని చూపించినట్లయితే వారే నమోదు ప్రక్రియను పూర్తి చేస్తారు.

## యువనాయకత్వం...

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఇటీవల వేగంగా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. కూటమికి నాయకత్వం వహిస్తున్న తెలుగుదేశం పార్టీ తన వ్యూహాలను క్రమబద్ధంగా అమలు చేస్తూ ముందుకు సాగుతోంది. చాలా కాలంగా ఎదురుచూస్తున్న పార్టీ జాతీయ ,రాష్ట్ర కమిటీలను తాజాగా ప్రకటించడం ద్వారా కీలక నిర్ణయాన్ని తీసుకుంది. ఈ ప్రక్రియలో నారా లోకేష్ కి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతలు ఇవ్వడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.ఇప్పటికే గత మహానాడు సమయంలో లోకేష్‌కు ఈ బాధ్యతలు ఇవ్వవచ్చని చర్చలు జరిగినా, ఈసారి మహానాడు ముందుగానే అధికారికంగా ప్రకటించడం గమనార్హం. దీంతో పార్టీ వ్యవహారాలపై లోకేష్‌కు మరింత పట్టు వచ్చినట్లు స్పష్టమవుతోంది. ఈసారి మహానాడు సమావేశంలో ఆయన కొత్త హోదాలో పాల్గొనడం ద్వారా పార్టీపై తన ప్రభావాన్ని మరింత పెంచుకునే అవకాశముంది.ఇక జూన్ నెలలో టీడీపీ కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకోనుండటం కూడా కీలక అంశంగా మారింది. ఈ నేపథ్యంలో మంత్రి వర్గ విస్తరణ పై పెద్ద ఎత్తున చర్చలు జరుగుతున్నాయి. సరైన సమయం చూసుకుని ఈ మార్పులు చేపట్టే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. పార్టీ కమిటీలలో చేసిన మార్పుల మాదిరిగానే, ప్రభుత్వం లో కూడా కొత్త వారికి ప్రాధాన్యత ఇవ్వాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది.ప్రస్తుతం కూటమి మంత్రివర్గంలో ఇప్పటికే కొత్తవారికి కొంత ప్రాధాన్యత ఉన్నప్పటికీ, రాబోయే మార్పుల్లో మరింత చురుకుగా పనిచేసే నాయకులను తీసుకునే అవకాశం ఉందని అంటున్నారు. ప్రజల్లో ప్రభుత్వ కార్యక్రమాలను బలంగా ప్రచారం చేయగలిగే నాయకులను ఎంపిక చేయడం ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. పనితీరు ఆధారంగా కొంతమంది సీనియర్ మంత్రులకు మార్పులు జరిగే అవకాశమూ ఉన్నట్లు సమాచారం.

# కాంటూర్ సాకులు వద్దు.. నిర్వాసితులందరికీ న్యాయం చేయాల్సిందే!

### కూనవరం మండల ముంపు గ్రామాలను ఒకే యూనిట్‌గా గుర్తించాలి

### సీపీఎం నేత మేకల నాగేశ్వరరావు డిమాండ్ ప్రభుత్వ మొండి వైఖరిపై ఉద్యమిస్తామని హెచ్చరిక



**కూనవరం, ఏప్రిల్ 18 (ప్రజాజ్యోతి):** పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పేరుతో వేలాది కుటుంబాలను రోడ్డున పడేయడం అమానుషమని, కాంటూర్ లెక్కలతో సంబంధం లేకుండా కూనవరం మండలంలోని ముంపు గ్రామాలన్నింటికీ తక్షణమే పూర్తిస్థాయి పరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మేకల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం టేకులబోరులోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సున్నం రాజులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైఖరిపై తీవ్రంగా ధ్వజమెత్తారు.

**కాంటూర్ లెక్కలు అశాస్త్రీయం**

కాంటూర్ లెక్కలు అశాస్త్రీయమని, వరదలు కాంటూర్ పరిమితులు చూసి రావని మేకల నాగేశ్వరరావు పేర్కొన్నారు. పక్కపక్కనే ఉన్న గ్రామాల్లో ఒకరికి పరిహారం ఇచ్చి మరొకరిని విస్మరించడం వివక్షాపూరితమని విమర్శించారు. కూనవరం మండలంలోని ముంపు గ్రామాలన్నింటినీ ఒకే యూనిట్‌గా పరిగణించాలని డిమాండ్ చేశారు.

**యువతకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలి**

18 ఏళ్లు నిండిన ప్రతి యువతీ యువకుడిని ప్రత్యేక యూనిట్‌గా గుర్తించి, ఎటువంటి కట్ ఆఫ్ డేట్ నిబంధనలు లేకుండా పరిహారం అందించాలన్నారు. నిర్వాసితులకు మెరుగైన పునరావాసం, పూర్తి నష్టపరిహారం అందించిన తర్వాతే ప్రాజెక్టు పనులు కొనసాగించాలని స్పష్టం చేశారు.

**త్యాగధనులను భిక్షగాళ్లలా చూడొద్దు**

"దేశాభివృద్ధి కోసం భూములిచ్చిన త్యాగధనులను భిక్షగాళ్లలా చూడవద్దు. వారి హక్కులను కాపాడటం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కనీస బాధ్యత" అని ఆయన పేర్కొన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం నిర్వాసితుల జీవితాలతో ఆడుకోవద్దని హెచ్చరించారు.

**సిపిఎం భారీ ఉద్యమానికి సిద్ధం**


ప్రభుత్వాలు తమ మొండి వైఖరిని వీడకుంటే నిర్వాసితులందరినీ ఏకం చేసి భారీ ఎత్తున ఉద్యమిస్తామని సిపిఎం నాయకులు హెచ్చరించారు. కాంటూర్ సాకులు చెప్పి పరిహారంలో కోత విధిస్తే సహించబోమని, మానవీయ కోణంలో నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో పాయం సీతారామయ్య, మండల కార్యదర్శి బాబు బోర్రయ్య, కర్నాటి శ్రీనివాసరావు, మడకం నాగమణి, బొగ్గ రామారావు, బొగ్గ వెంకమ్మ, అమ్మాజీ, జయసుధ, నానుపల్లి వెంకటేశ్వరరావు, తాళ్లూరి శ్రీనివాసరావు, మడెం బాబురావు, ఆవుల ఉపేంద్ర, మురళి, కొండ ఈశ్వర్, తెలగాని నాగరాజు, బొగ్గ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణాలతో ఆటలాడుతున్న డాక్టర్ చర్యలు తీసుకోకపోతే ప్రమాదం

**ప్రజా జ్యోతి జిల్లా బ్యూరో** అనంతపురం జిల్లా పామిడి పట్టణంలో ప్రైవేట్ వైద్య సేవలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొద్దిరోజుల క్రితం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందిన వ్యక్తికి వైద్యులు అందించిన చికిత్స వికటించడంతో అతను ప్రాణాపాయ స్థితికి చేరుకున్నాడు. పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు అతన్ని బెంగళూరుకు తరలించగా, అక్కడి వైద్యులు అత్యవసర చికిత్స అందించి ప్రాణాలను కాపాడినట్టు సమాచారం. ఈ చికిత్స కోసం బాధితుడు దాదాపు రూ.13 లక్షలు ఖర్చు చేసినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై బాధితులు జిల్లా వైద్య ఆరోగ్య అధికారులకు ఫిర్యాదు చేయడంతో, సంబంధిత ఆసుపత్రిని అధికారులు సీజ్ చేసినట్టు సమాచారం. అయితే, అదే ఆసుపత్రిని నడిపిన డాక్టర్ మళ్లీ పేరు మార్చి, అదే ప్రాంతంలో మరో పేరుతో ఆసుపత్రిని ప్రారంభించినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇంతలో మరో ఘటన కూడా వెలుగులోకి వచ్చింది. అదే వైద్యుని వద్ద చికిత్స పొందిన ఓ మహిళకు ఇచ్చిన ఇంజక్షన్ వికటించడంతో ఆమె పరిస్థితి విషమించి, అనంతపురంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకోవాల్సి వచ్చినట్టు తెలిసింది. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం విషయంలో కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనలతో పామిడి పట్టణ ప్రజల్లో తీవ్ర ఆగ్రహం నెలకొంది. "పేర్లు మారవచ్చు కానీ డాక్టర్ అదే కదా... ఇలాంటి వైద్యులు ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్నారు" అంటూ స్థానికులు మండిపడుతున్నారు. సీజ్ చేసిన ఆసుపత్రి మళ్లీ కొత్త పేరుతో కొనసాగుతున్నా అధికారులు కఠిన చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైద్యరంగంలో ఇలాంటి నిర్లక్ష్యం కొనసాగితే మరెంతమంది ప్రాణాలు ప్రమాదంలో పడతాయోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత వైద్యునిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఉన్నతాధికారులను కోరుతున్నారు.

**ప్రజల డిమాండ్:**

సంబంధిత డాక్టర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలి మళ్లీ ఆసుపత్రి నిర్వహణను నిలిపివేయాలి బాధితులకు న్యాయం చేయాలి ప్రైవేట్ ఆసుపత్రులపై కఠిన తనిఖీలు చేపట్టాలి.




ఇప్పటికైనా చర్యలు తీసుకోకపోతే... మరిన్ని ప్రాణాలు బలి కావడం ఖాయం అని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

## మీ మొబైల్ మీ ఇంటి వద్దకే అనే కార్యక్రమంలో భాగంగా బాధితుల ఇంటి వద్దకే వెళ్లి మొబైల్ ఫోన్లను అందజేసిన కంబదూరు పోలీసులు..




**కంబదూరు ఏప్రిల్18 (ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్,** ప్రజలు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను గుర్తించి నేరుగా యజమానులకు చేరవేయాలనే లక్ష్యంతో రూపొందించిన "మీ మొబైల్ -- మీ ఇంటికి" అనే ప్రత్యేక ప్రజాహిత కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ జగదీష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం కంబదూరు మండలం పోలీస్ స్టేషన్ పరిధిలోని గూళ్యం, అండేపల్లి, ములకనూరు, గుద్దెళ్ళ గ్రామాల్లో మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితుల ఇళ్ల వద్దకే పోలీసులు వెళ్లి వాటిని అందజేశారు. జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు ఎస్ఐ లోకేష్ సిబ్బందితో కలిసి ఈ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీసులు నేరుగా ఇంటి వద్దకే వచ్చి పోగొట్టుకున్న ఫోన్లను అందజేయడంతో బాధితులు ఆనందం వ్యక్తం చేశారు. జిల్లా ఎస్పీ జగదీష్‌తో పాటు పోలీసు సిబ్బంది సేవలను అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో పోలీసులపై నమ్మకం మరింత పెరుగుతుందని అధికారులు పేర్కొన్నారు.

## మహిళా భద్రతపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు



**సి.కె. దిన్నె సి ఐ బాల మధిలేటి**

**జిల్లా పోలీస్ యంత్రాంగం మహిళా**

భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు పాఠశాలలు, కళాశాలలు, వర్కింగ్ విమెన్స్ హాస్టళ్లు, మహిళలు పనిచేస్తున్న సంస్థలు మరియు గ్రామాల్లో మహిళా భద్రతపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో సి.కె. దిన్నె పోలీస్ స్టేషన్ పరిధిలోని బయనపల్లి గ్రామంలో మహిళల భద్రత మరియు రక్షణపై అవగాహన కార్యక్రమాన్ని సి.ఐ బాల మద్దిలేటి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా సి.ఐ బాల మద్దిలేటి మాట్లాడుతూ 'శక్తి' యాప్ మహిళలు మరియు బాలికల రక్షణకు అత్యవసర పరిస్థితుల్లో ఎంతో ఉపయోగకరమని తెలిపారు. అపాయం లేదా అనుకోని ఘటనలు ఎదురైనప్పుడు 'శక్తి' యాప్‌లోని ఎస్ఓఎస్ బటన్ లేదా డయల్ 112 ద్వారా సమాచారమిస్తే, కేవలం 10 నిమిషాల్లో పోలీసులు స్పందించి సహాయం అందిస్తారని చెప్పారు.

అలాగే మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు.

అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడే ముఖ్యమైన హెల్ప్‌లైన్ నంబర్లను తెలియజేశారు:

డయల్ 100 / 112 -- అత్యవసర సహాయం
చైల్డ్ లైన్ 1098 -- పిల్లల రక్షణ
గృహ హింస -- 181
మహిళ వేధింపులు -- 1091
సైబర్ నేరాలు -- 1930
సైబర్ మిత్ర

ప్రతి మహిళ తమ భద్రత కోసం ప్రభుత్వం కల్పించిన చట్టాలను తెలుసుకోవడం ఎంత ముఖ్యమో వివరించి, వారిలో చైతన్యం కలిగించారు.

## మల్కాం గ్రామంలో ఊరికి వృక్ష వందనం కార్యక్రమం

**– పర్యావరణ పరిరక్షణ పై గ్రామస్తులకు అవగాహన కల్పించిన హరిత సమగ్ర గ్రామీణా అభివృద్ధి సంస్థ**



**పొందూరు ,ప్రజాజ్యోతి న్యూస్:** పొందూరు మండలం మల్కాం గ్రామంలో హరిత సమగ్ర గ్రామీణా అభివృద్ధి సంస్థ వ్యవస్థాపకులు ఆర్ హరిబాబు ఆధ్వర్యంలో ఊరికి వృక్ష వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో వివిధ ప్రాంతాల్లో మొక్కలు నాటి , మొక్కలు నాటడం ,పర్యావరణ పరిరక్షణ పై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని అన్నారు. మొక్కలు నాటడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని రక్షించుగోలమని తెలిపారు. చెట్ల పెంపకం ద్వారా భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన పర్యావరణాన్ని అందించగలుగుతామని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరూ విధిగా మొక్కలు నాటి సరక్షించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మలకాం సర్పంచ్ జాడ శ్రీనివాస రావు మాజీ సర్పంచ్ జాడ శ్రీనివాస రావు ఎంపీటీసీ ప్రతినిధి వడగా మోహన్,మదుపాం సర్పంచ్ బగాది అప్పలనాయుడు తండ్యాం సర్పంచ్ కిలారి భాస్కర రావు దేవరవలస సర్పంచ్ తిరుమరెడ్డి వెంకట రమణ బాతువ సర్పంచ్ దబ్బాడ ఆదినారాయణ హరిత సమగ్ర గ్రామీణ అభివృద్ధి సంస్థ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ నాగబాబుకు ప్రోటోకాల్ వర్తింపజేయాలి

**– ప్రభుత్వ కార్యకలాపాలకు నాగబాబుకు అందని ఆహ్వానం**
**– అలసత్వం వహిస్తున్న అధికార యంత్రాంగం**
**– ప్రోటోకాల్ ను విస్మరిస్తూ ప్రక్కదారి పట్టిస్తున్న అధికారులు**
**– తూర్పు కాపు రాష్ట్ర అధ్యక్షులు మక్కా సాయిబాబు నాయుడు**



**ఎచ్చెర్ల ,ప్రజాజ్యోతి న్యూస్ :**రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సోదరుడు ఎమ్మెల్సీ కె నాగేంద్రబాబు కు ఎచ్చెర్ల నియోజకవర్గంలో ప్రోటోకాల్ వర్తింపజేయాలని రాష్ట్ర తూర్పు కాపు అద్యక్షులు,జనసేన పార్టీ నాయకులు మక్కా సాయిబాబు నాయుడు డిమాండ్ చేశారు. జనసేన పార్టీలో కీలక పాత్ర పోషిస్తున్న నాగబాబు విషయంలో ప్రోటోకాల్ పాటించాలని కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను విస్మరించి ,అధికారులు ప్రోటోకాల్ ను ఉల్లంఘిస్తూ ప్రక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. ఇటీవల సుడా చైర్మెన్ కొరికాన రవికుమార్ విషయంలో ఇదే జరిగిందని అన్నారు. కొన్ని ప్రభుత్వ కార్యకలాపాలకు నాగబాబుకు ఆహ్వానం అందడం లేదన్న పిర్యాదులు ఇటీవల శాసనమండలికి కూడా వెళ్లడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నాగబాబుకు ఖచ్చితంగా ప్రోటోకాల్ అమలు చేయాలని సాయిబాబు నాయుడు కోరారు.

## మండల స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



**బాపట్ల ఏప్రిల్ 18 ( ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**మండల స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు అధికారుల సంఘం బాపట్ల జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక శనివారం బాపట్ల డిడివో కార్యాలయ మీటింగ్ హాల్‌లో ఏకగ్రీవంగా నిర్వహించబడింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 20 మండలాలు, 3 మునిసిపాలిటీలకు చెందిన ఎస్.జి.ఎస్.డబ్ల్యూ మండల స్థాయి అధికారులు సమావేశమై ఈ ఎన్నికను నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా పల్నాటి శ్రీరాములు (బాపట్ల) ఎంపిక కాగా, అధ్యక్షులుగా బి. మల్లికార్జునరావు (భట్టిప్రోలు) బాధ్యతలు స్వీకరించారు. ఉపాధ్యక్షులుగా జున్ను మరియమ్మ (వేటపాలెం), ప్రధాన కార్యదర్శిగా అబ్దుల్ ఖాదర్ జిలాని (పర్చూరు) ఎన్నికయ్యారు. అలాగే సహాయ కార్యదర్శులుగా ఏ. రాధ (బాపట్ల అర్బన్), దాసరి పుష్ప కుమారి (రేపల్లె), కోశాధికారిగా ఎం. అబ్దుల్ రహమాన్ (చెరుకుపల్లి) ఎంపికయ్యారు. సభ్యులుగా ఎస్. సునీత (యద్దనపూడి), శివకుమార్ (నిజాంపట్నం) నియమితులయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు ఈ సందర్భంగా పలువురు అధికారులు, సహచరులు శుభాకాంక్షలు తెలియజేశారు. సంఘం బలోపేతానికి, స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు పథకాల సమర్థవంతమైన అమలుకు కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

## నారా లోకేష్ గారిని మర్యాదపూర్వకంగా కలిసిన డిసిసి బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి



**బద్వేల్ స్టాప్ రిపోర్టర్ ఏప్రిల్ 18 (ప్రజా జ్యోతి)** తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమితులైన గౌరవ మంత్రివర్యులు నారా లోకేష్ గారిని ఈరోజు ఉండవల్లిలోని ఆయన స్వగృహంలో ఉమ్మడి కడప జిల్లా డిసిసి బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంచూరు సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, క్రమశిక్షణ, అంకితభావం మరియు నిరంతర శ్రమకు ప్రతీకగా నిలిచే నారా లోకేష్ గారి నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

# ఘనంగా వైకుంఠం శివప్రసాద్ జన్మదిన వేడుకలు





**హోళగుండ, ఏప్రిల్ 18, ప్రజా జ్యోతి న్యూస్:** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యవర్గ నిర్వహణ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ జన్మదిన వేడుకలు హోళగుంద మండల కేంద్రంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఆయన పుట్టినరోజును పురస్కరించుకుని టీడీపీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు భారీ ఎత్తున తరలివచ్చి సంబరాలు నిర్వహించారు. మండల నాయకులు అందరూ కలిసి కేక్ కట్ చేసి, తమ ప్రియతమ నాయకుడు శివప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకులు మాట్లాడుతూ.. వైకుంఠం శివప్రసాద్ నిబద్ధత, నిజాయితీ కలిగిన నాయకుడని కొనియాడారు. ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఆలూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో ఆయన పాత్ర చిరస్మరణీయమని ప్రశంసించారు., ఆలూరు టీడీపీ ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి బాధ్యతలు చేపట్టిన నాటి నుండి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయని వారు వెల్లడించారు. ఈ వేడుకల్లో తెలుగు యువత మాజీ రాష్ట్ర కార్యదర్శి శేషగిరి, మండల కన్వీనర్ డాక్టర్ తిప్పయ్య, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ అబ్దుల్ సుబాన్, సింగల్ విండో చైర్మన్ విష్ణు రెడ్డి, డైరెక్టర్ దుర్గయ్య, సీనియర్ నాయకులు తోక వెంకటేష్, హనుమప్ప, ఎల్లార్తి మల్లికార్జున, చిదానంద, ల్యాబ్ గిరి, వలి బాషా, ఖాదర్, తాహెర్, పక్కిరప్ప, తెలుగు యువత అధ్యక్షుడు బకాడి వీరేష్‌తో పాటు భారీ సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# కంబదూరు లో జనసంచార రద్దీగల ప్రదేశాలలో చలివేంద్రాలు ఏర్పాటు





**కంబదూరు ఏప్రిల్18 (ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్,** ఈ వేసవిలో రోజు రోజుకు ఎండలు తీవ్రతరం కానుండటంతో , కంబదూరు మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం విచ్చేస్తున్న ప్రజల దాహార్తి తీర్చడానికి, జన సంచార రద్దీ గల ప్రదేశాలైన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం నందు, పాత పోస్ట్ ఆఫీస్ సర్కిల్, ఎస్ బి ఐ బ్యాంకు నందు కంబదూరు గ్రామ పంచాయతి ఆధ్వర్యంలో చలివేంద్రాల ను ఏర్పాటు చేశారు. చలి వేంద్ర కేంద్రాలను ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన టిడిపి నాయకులు మాజీ జడ్పీ విపక్ష నేత, కరణం రామ్మోహన్ చౌదరి, మాజీ సర్పంచ్ గాజుల శ్రీరాములు, దండా వెంకటేశులు, చెరువు సంఘం చైర్మన్ సురేష్ బాబు, మాజీ ఉపసర్పంచ్ షఫీ, యంగ్ ఇండియా భాష, ఎర్రి స్వామి, మారుతి కార్పెంట్ సురేంద్ర, బోర్ల మల్లికార్జున, డీలర్ల సంఘం అధ్యక్షుడు రఫీ, గ్రామ కమిటీ అధ్యక్షుడు గాజుల మారుతి, గంగిరెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బాగేపల్లిరాజా, మాజీ వార్డ్ మెంబర్ నాగరాజు, విజయ్, డీలర్ రవి, పంచాయితి సెక్రెటరీ మహేష్, లక్ష్మీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారత కేవలం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కే సాధ్యం




**ప్రజా జ్యోతి రిపోర్టర్ :-యం. నరేష్. పాతపట్నం** మహిళా సాధికారతకు నిలువెత్తు రూపం.. మన జగనన్న- మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి మహిళా పక్షపాతిగా, వారి ఆర్థిక స్వావలంబన మరియు సామాజిక గౌరవం కోసం నిరంతరం తపించే ఏకైక నాయకుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ని వైఎస్ఆర్సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి స్పష్టం చేశారు. గత ఐదేళ్ల జగన్ పాలనలో మహిళల ఆర్థిక స్థితిగతులు పూర్తిగా మారిపోయాయి. వైఎస్ఆర్ ఆసరా, చేయూత, సున్నా వడ్డీ వంటి పథకాల ద్వారా అక్కచెల్లెమ్మల చేతుల్లోకి నేరుగా నగదు చేరడం వల్ల వారు నేడు సొంతంగా వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థికంగా నిలబడ్డారు. నామినేటెడ్ పదవుల్లోనూ, పదవుల కేటాయింపులోనూ మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించి, రాజకీయంగా మహిళలను జగన్ ఉన్నత స్థానాల్లో నిలబెట్టారు. ఇది కేవలం మాటలకే పరిమితం కాకుండా చేతల్లో చూపించిన ఘనత ఆయనది. అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాల ద్వారా పిల్లల చదువుల భారాన్ని తల్లుల భుజాల మీద నుంచి దించి, వారిని ఆత్మగౌరవంతో జీవించేలా చేశారు. ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ కూడా మహిళల పేరు మీదనే చేసి, రాష్ట్రంలోని ప్రతి అక్కచెల్లెమ్మకు ఇంటి యజమాని హోదాను కల్పించారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో మహిళా సాధికారత మరియు సంక్షేమం కోసం నవరత్నాలు పథకాల ద్వారా అనేక కీలక పథకాలను అమలు చేశారు. జగనన్న అమ్మ ఒడితో ?తమ పిల్లలను బడికి పంపే ప్రతి తల్లికి ఆర్థిక చేయూతనిచ్చే అద్భుతమైన పథకం. తల్లులు తమ పిల్లలను ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువు మాన్పించకుండా ప్రోత్సహించారు. ?వైఎస్సార్ ఆసరాతో ?డ్వాక్రా మహిళల పేరుతో ఉన్న బ్యాంకు అప్పులను ప్రభుత్వం నాలుగు విడతల్లో నేరుగా వారి ఖాతాల్లో జమ చేసింది. సుమారు 80 లక్షల మంది మహిళలకు ఈ పథకం ద్వారా రుణ విముక్తి కలిగింది. వైఎస్సార్ సున్నా వడ్డీతో పొదుపు సంఘాల మహిళలు తీసుకున్న రుణాలపై వడ్డీ భారాన్ని తగ్గించే పథకం ద్వారా సకాలంలో రుణాలు చెల్లించే మహిళా సంఘాల వడ్డీ మొత్తాన్ని ప్రభుత్వమే భరించింది.వైఎస్సార్ చేయూతతో ?ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు మైనార్టీ వర్గాలకు చెందిన 45 నుండి 60 ఏళ్ల లోపు మహిళలకు ఆర్థిక స్వయంప్రతిపత్తి కల్పించారు. ఈ నిధులతో మహిళలు చిన్నపాటి వ్యాపారాలు కిరాణా కొట్టు, పాడి పరిశ్రమ మొదలైనవి చేసుకునేలా ప్రోత్సాహం కల్పించారు. ?వైఎస్సార్ కాపు నేస్తం ఓ ఈబీసీ నేస్తంతో ?కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలతో పాటు అగ్రవర్ణ పేద ఈ బీసీ మహిళల కోసం ప్రత్యేక పథకాలు అందించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 30 లక్షలకు పైగా ఇళ్ల పట్టాలను మహిళల పేరు మీదనే రిజిస్ట్రేషన్ చేసి పంపిణీ చేశారు. మహిళల రక్షణ కోసం 'దిశా' పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేసి, ఆపదలో ఉన్న మహిళలకు తక్షణ సాయం అందించేలా దిశా యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. మహిళా సాధికారతకు జగన్ మోహన్ రెడ్డి గారు ఒక కొత్త అర్థాన్ని ఇచ్చారు. మహిళల సంక్షేమమే ధ్యేయంగా సాగుతున్న జగన్ నాయకత్వం రాష్ట్రానికి ఎంతో అవసరమని, మహిళా లోకమంతా ఆయన వెంటే ఉంటుందని రెడ్డి శాంతి ధీమా వ్యక్తం చేశారు.

# పనితీరు మెరుగైతేనే ప్రజలకు న్యాయం... ప్రతిభ కనబరిచిన పోలీసులకు ఎస్పీ ప్రశంసలు



**బాపట్ల ఏప్రిల్ 18 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** విధి నిర్వహణలో నిబద్ధత, నైపుణ్యం పెంపొందించుకోవడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించవచ్చని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్, ఐపీఎస్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. శనివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో భాగంగా, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న మహిళా మిస్సింగ్ కేసులను ఛేదించిన శక్తి బృందం సభ్యులను ఎస్పీ ప్రత్యేకంగా ప్రశంసించారు. రేపల్లె, చీరాల సబ్‌డివిజన్‌లకు చెందిన కానిస్టేబుళ్లు వై. గోపీనాథ్, కె. సుబ్బారావు తమ కృషితో మూడు పాత కేసులను పరిష్కరించారు. కొల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో 2008లో నమోదైన కేసును వై. గోపీనాథ్ ఛేదించగా, వేటపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో 2013, 2015 సంవత్సరాలకు చెందిన రెండు వేర్వేరు కేసులను కె. సుబ్బారావు ట్రేస్ చేసి బాధితుల ఆచూకీ కనుగొన్నారు. అదేవిధంగా .ఐ గాట్. కర్మయోగి కార్యక్రమంలో భాగంగా అత్యధిక శిక్షణ తరగతులు పూర్తి చేసి ప్రతిభ కనబరిచిన సిబ్బందిని కూడా ఈ సందర్భంగా గుర్తించారు. ప్రశంసా పత్రాలు అందుకున్న వారిలో సి.సి.ఎస్ ఇన్‌స్పెక్టర్ పెర్లి ప్రేమయ్య, ఐటి-కోర్ సబ్‌ఇన్‌స్పెక్టర్ అందేల నాగేశ్వరరావు, కర్లపాలెం హెడ్ కానిస్టేబుల్ కుమ్మరగుంట మాణిక్యరావు, చీరాల 1 టౌన్ హెడ్ కానిస్టేబుల్ పిట్టు రామారావు, కానిస్టేబుల్ దాసరి రవి, జిల్లా పోలీస్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ బొల్లా కనికరమ్మ, డీఏఆర్ విభాగం హెడ్ కానిస్టేబుళ్లు గోపారపు శ్రీనివాసరెడ్డి, లుక్కా శ్రీనివాసరావు, కానిస్టేబుల్ కట్టా టైసన్ ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో పాటు, సిబ్బంది నిరంతరం శిక్షణ పొందుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఉత్తమ పనితీరు కనబరిచిన వారికి గుర్తింపు, ప్రోత్సాహం ఎప్పటికీ ఉంటుందని తెలిపారు.

# ప్రజా సమాచారం లేని గ్రామ సభ నిర్వహణపై తెలుగుదేశం పార్టీమండల క్లస్టర్ ఇంచార్జి

**బాబి ఆగ్రహం. సచివాలయ. పంచాయతీ సిబ్బంది తీరుపై ఫిర్యాదు.**



**అనంతగిరి మండలం. ఏప్రిల్ 18. ప్రజా జ్యోతి న్యూస్.రిపోర్టర్ శంకర్.** రాష్ట్రంలో కూటమిప్రభుత్వం ఉన్న వై.సి.పి ప్రభుత్వం ఉన్నట్లు భావించి ఎగువ శోభ గ్రామపంచాయతీ సచివాలయ. పంచాయతీ సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు స్పష్టంగా కనబడుతుంది. అల్లూరి సీతారామరాజు జిల్లా.అనంతగిరి మండలం. ఎగువ శోభగ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం నాడు గ్రామ సభ నిర్వహణ కార్యక్రమం జరిగింది. సభ నిర్వహణ కార్యక్రమం జరిగే ముందు గ్రామాల్లో దండోరా ద్వారా సభ యొక్క ముఖ్య వివరాలు ప్రజలకు ప్రజాప్రతినిధులకు కూటమి నాయకులకు తెలియపరచవలసిన బాధ్యత సచివాలయ. పంచాయతీ సిబ్బందికి ఉంది కానీ సభ నిర్వహణపై దండోరా గాని కనీస సమాచారముగాని ఏ ఒక్కరికి సక్రమంగా తెలియపరచలేదని అనంతగిరి మండల తెలుగుదేశం పార్టీ మండల క్లస్టర్ ఇంచార్జి పాంగి బాబి సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కూటమిప్రభుత్వం పాలనలో ఉన్న సంగతి సిబ్బంది మరచి వై.సీ.పీ ప్రభుత్వం ఇంకా పాలనలో ఉన్నట్లు భ్రమలో ఉండి విధులు నిర్వహిస్తున్నారని వైసిపి నాయకులకు ఆహ్వానం పలుకుతూ కూటమి నాయకులను విమర్శిస్తున్నారని. ఇది ఎంతవరకు తగునని బాబీ ప్రశ్నించారు. ఎగువ శోభ పంచాయతీ సిబ్బంది తీరుపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తానని ఆయన అన్నారు. ఈ విషయంలో అరకు ఇంచార్జ్ దోన్ను దొర చొరవ చూపి తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఐదు సంవత్సరాలు కాలంలో పంచాయతీ నిధులతో గ్రామాలలో ఎటువంటి అభివృద్ధి పనులు జరిగాయి ఎంత మేర నిధులు ఖర్చు పెట్టారు అనే అంశాలు తెలుసుకునేందుకు ప్రజలు ఎంతో ఆసక్తిగా ఉన్న తరుణంలో సంబంధిత సిబ్బంది ప్రజలకు సమాచారం అందించకుండా నీరుకార్చారని ఆవేదన వ్యక్తం చేశారు.

# సయ్యద్ షాలం పీరం ఖాద్రి వారి ఉరుసు మహోత్సవాలు



మైలవరం మండలం దొడియం గ్రామ సమీపంలోని మోతకల్ బుగ్గ వద్ద మషాయక్ హజరత్ సయ్యద్ షాలం పీరం ఖాద్రి వారి ఉరుసు మహోత్సవాలు మే 8వ తేదీ శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆహ్వాన పత్రికను విడుదల చేశారు.మే 7వ తేదీ గురువారం గంధం కార్యక్రమం, మే 9వ తేదీ శనివారం జియారత్ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉరుసు సందర్భంగా వేలాది మంది భక్తులు వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చి స్వామివారి దర్శనం చేసుకుంటారని తెలిపారు.గంధం రోజు రాత్రి 7 గంటల నుండి అన్నదాన కార్యక్రమం, రాత్రి 9 గంటలకు పూలచాందిని నిర్వహించనున్నారు. 8 ఉరుసు రోజు మధ్యాహ్నం 1 గంటల నుండి దొడియం కొత్త కొట్టాల గణేష్ యూత్ వారిచే అన్నదాన కార్యక్రమం ఉండనుండగా, ఉదయం 7 గంటలకు బండలాగుడు పందెం కూడా ఏర్పాటు చేశారు.ఈ మహోత్సవాలు ఎమ్మెల్యే చదిపిరాళ్ళ ఆదినారాయణరెడ్డి,చదిపిరాళ్ళ భూపేష్ రెడ్డి, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో జరగనున్నాయి. దర్గాలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నందున భక్తులు తమ వంతు సహకారం అందించాలని నిర్వాహకులు కోరారు.దొడియం గ్రామ పెద్దలు, హిందూ-మహమ్మదీయ సోదరులు కలిసి ఉరుసు మహోత్సవాలను విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# ఇంటర్ ఫలితాల్లో "విశ్వకవి"కి స్టేట్ ర్యాంకులు అభినందించిన ఆధ్యాత్మిక వేత్త జేజే గురువు

**--జి రోషిణికి 450/455 (బైపీసీ) మార్కులతో స్టేట్ మూడో ర్యాంకు**

**-- మంగాదేవికి 987/1000 (ఎంపీసీ) మార్కులతో స్టేట్ ఆరో ర్యాంకు**



**కాకినాడ జిల్లా ఏప్రిల్ 18(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** ఇటీవల విడుదల అయిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో చంద్రమాంపల్లి (దివిలి) విశ్వకవి జూనియర్ కాలేజ్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రతిభను చాటారు.అద్భుతమైన మార్కులతో ర్యాంకులు సాధించి కాలేజ్ ప్రతిష్టను మరింత పెంచారు.ప్రథమ సంవత్సరం బైపీసీ విభాగంలో గౌరోజు రోషిని 455కి 450 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో మూడవ ర్యాంకు,కాకినాడ జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంకును కైవసం చేసుకుంది.ఎంపీసీ విభాగంలో బాలిశెట్టి దుర్గ 470కి 458 మార్కులు సాధించగా,సీఈసీ విభాగంలో కల్లూరి విజయ నాగ దుర్గ దేవి 500కి 451 మార్కులు సాధించి ప్రతిభ చూపింది.ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో మల్లిడ్డి మంగాదేవి 1000కి 987 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ఆరవ స్థానాన్ని,అలాగే డివిజన్ స్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించింది.బైపీసీ విభాగంలో ఎడవెల్లి నాగలక్ష్మి 1000కి 958 మార్కులు సాధించగా,సీఈసీ విభాగంలో ఆనాలా గీతా శైలజ 1000కి 848 మార్కులు సాధించింది.ఈ ఘన విజయాలతో రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను కాలేజ్ చైర్మన్ కంటిబోయిన నూకరాజు,కాలేజ్ అడ్వైజర్ జేజే గురువు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 400 మార్కులకు పైగా సాధించిన 32 మంది విద్యార్థులు,ద్వితీయ సంవత్సరంలో 900 మార్కులకు పైగా సాధించిన 16 మంది విద్యార్థులను డైరెక్టర్లు శ్రీనుబాబు,నాగ చక్రధర్ అభినందించారు.ఈ అద్భుత విజయానికి కృషి చేసిన అధ్యాపక బృందం హరిత,ప్రకాష్,రామం,చిన్నిబాబు,రామచంద్రరావు,పాల్ రాజు,రాంబాబు,రాజేష్ లను ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మరియు ఏవో వీరేంద్ర కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

# కూనవరం పోలీస్ గ్రౌండ్‌లో కుమ్మూరు వారియర్స్ విజయం.. మెగా టోర్నమెంట్‌కు ఘన ముగింపు







**కూనవరం ఏప్రిల్ 18( ప్రజా జ్యోతి )** కూనవరం మండలం పోలీస్ గ్రౌండ్‌లోని ఉమేష్ చంద్ర ఐపీఎస్ మెమోరియల్ మెగా టోర్నమెంట్‌కు ఆదివారం ఘన ముగింపు లభించింది. ఛత్రపతి శివాజీ మహారాజ్ మినీ స్టేడియంలో గత రెండు నెలలుగా నాలుగు మండలాల పరిధిలోని పది జట్లు పోటీపడగా, ఫైనల్ మ్యాచ్‌లో కూనవరం కింగ్స్ 11పై కుమ్మూరు వారియర్స్ అద్భుత విజయం సాధించి విజేతగా నిలిచింది. ఈ మెగా గ్రాండ్ ఫైనల్‌కు ముఖ్య అతిథులుగా సీఐ అప్పలరాజు, కూనవరం, విఆర్ పురం, ఎటపాక సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ఎడవల్లి భాస్కర్, బీజేపీ రాష్ట్ర రామసేన అధ్యక్షురాలు కడ బాల సుధారాణి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షురాలు, జడ్పీటీసీ గుజ్జ విజయ, జనసేన పార్టీ వైస్ ఎంపీపీ బండారు సాంబశివరావు, జనసేన మండల అధ్యక్షుడు దాసరి నరేంద్ర, ఆదివాసి సంక్షేమ నాయకుడు కుంజా అనిల్, చింతూరు మండల అధ్యక్షుడు మడివి రాజు తదితరులు పాల్గొన్నారు. మొదటి బహుమతిగా చదలవాడ శివకృష్ణ వారి అన్నయ్య జ్ఞాపకార్థం రూ.50 వేల నగదు అందించగా, రెండో బహుమతిగా యాలం రామకృష్ణ వారి అమ్మవారి జ్ఞాపకార్థం రూ.30 వేల నగదు బహుమతి అందించారు. అలాగే ఫైనల్ మ్యాచ్ సందర్భంగా దాసరి ప్రసాద్ జయమ్మ వారి జ్ఞాపకార్థం తరపున వారి కుమారులు దాసరి కాశి విశ్వనాథ్, దాసరి ఏసుబాబు ఇరు జట్ల ఆటగాళు ప్రేక్షకులు, పార్టీ నాయకులు, మీడియా మిత్రులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కేపీఎల్ సీజన్-1 కమిటీ, కూనవరం టీం, పార్టీ నాయకులు, మీడియా ప్రతినిధులు, క్రీడాభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ మెగా టోర్నమెంట్‌ను విజయవంతం చేశారు.

# జాతీయ ఉపాధి హామీ పథకం గ్రామీణ కార్మికులు సద్వినియోగం చేసుకోవాలి

**పెనుమదంలో పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**





**పాలకొల్లు. ప్రజాజ్యోతి ఏప్రియల్ 18.** జాతీయ ఉపాధి హామీ పథకం గ్రామీణ ప్రాంతాల ఆర్థిక స్థితిని బలోపేతం చేసే ముఖ్యమైన సాధనమని తెలిపారు. గ్రామీణ కార్మికులు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకొని తమ జీవనోపాధిని మెరుగుపరచుకోవాలని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. పాలకొల్లు నియోజకవర్గం పరిధిలోని పోడూరు మండలం నందలి పెనుమదం గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం లో " జలధార – జలహారతి" పేరిట అప్పి చెరువు వద్ద శనివారం చేపట్టిన మంచినీటి చెరువు త్రవ్వకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అప్పీ చెరువు వద్ద జరుగుతున్న చెర్వు పూడికతీత పనులను పరిశీలించిన కలెక్టర్, పనుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. చెరువులో పేరుకుపోయిన మట్టిని తొలగించడం ద్వారా నీటి నిల్వ సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని, దీని వల్ల భవిష్యత్తులో త్రాగునీటి అవసరాలు తీర్చడంలో సహకారం లభించడమే కాకుండా భూగర్భ జలాల స్థాయి కూడా మెరుగుపడుతుందని అధికారులు కలెక్టర్ కు వివరించారు. చెర్వు తవ్వకం, పూడిక తీత పనులు చేపట్టటం వలన తమ త్రాగునీటి పరిస్థితులు మెరుగుపడతాయని స్థానికులు కలెక్టర్ వద్ద హర్షం వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక సంపద తయారీ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి అక్కడ కొనసాగుతున్న వర్మీ కంపోస్ట్ తయారీ కార్యకలాపాలను పరిశీలించారు. సహజ ఎరువుల తయారీకి వినియోగించే యంత్రాన్ని ప్రారంభించి, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. గుర్రపు డెక్కను వినియోగిస్తూ వర్మీ కంపోస్ట్ తయారు చేయడం ఒక నవీన విధానంగా నిలుస్తోందని, కటింగ్ మిషన్ ద్వారా డెక్కను చిన్న ముక్కలుగా చేసి వర్మీ ప్రక్రియలో ఉపయోగించడం వల్ల నాణ్యమైన సేంద్రియ ఎరువులు ఉత్పత్తి అవుతున్నాయని కలెక్టర్ తెలిపారు. డ్వాక్రా మహిళలు ఈ వర్మీ కంపోస్ట్ తయారీలో చురుకుగా పాల్గొనడం వలన వారికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని, ఇది గ్రామీణ ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతున్నదని క జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పేర్కొన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం గ్రామీణ ప్రాంతాల ఆర్థిక స్థితిని బలోపేతం చేసే ముఖ్యమైన పథకమని తెలిపారు. పెనుమదం గ్రామంలో చేపడుతున్న పనులు గ్రామాభివృద్ధికి దోహదపడటంతో పాటు, ప్రజలకు స్థిరమైన ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నాయని అన్నారు. ఉపాధి హామీ పనులను నాణ్యతతో, నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పనుల అమలులో పారదర్శకత, సమర్థత పాటించాలని, ప్రతి కార్యక్రమం ప్రజలకు దీర్ఘకాల ప్రయోజనం కలిగేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. చెరువు పూడికతీత, వర్మీ కంపోస్ట్ తయారీ వంటి కార్యక్రమాలు పర్యావరణ పరిరక్షణతో పాటు సేంద్రియ వ్యవసాయానికి ప్రోత్సాహాన్ని అందిస్తున్నాయని తెలిపారు. ఉపాధి హామీ కూలీలను ప్రోత్సహిస్తూ జిల్లా కలెక్టర్ స్వయంగా పలుగు పట్టి త్రవ్వడంతోపాటు, మట్టి తట్టలను కార్మికుల తలపైకి ఎత్తారు. ఉపాధి కూలీలతో కొద్ది సమయం ముచ్చటిస్తూ అర్హులందరికీ పని లభిస్తుందని, పనులకు లోటు లేదని, నాణ్యమైన పనులు చేపట్టాలని సూచించారు. అనంతరం కూలీలకు స్వయంగా మజ్జిగను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో దాసిరాజు, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ డా. కెసిహెచ్ అప్పారావు, ఏపీడీ జీవికే మల్లికార్జునరావు, తహసిల్దార్ ఎస్.ఎం.ఫాజిల్, ఎంపీడీవో బి. మంగ కుమారి, సర్పంచ్ తానేటి బాబురావు, నీటి సంఘం అధ్యక్షులు దేవరపు దొరబాబు, మండల స్వర్ణ గ్రామం అధికారి డి. శ్రీనివాసరావు, పంచాయతీ సెక్రటరీ ఎన్. సుధారాణి, సొసైటీ అధ్యక్షులు కడలి ఆంజనేయులు, స్థానిక దేవాలయం కమిటీ చైర్మన్ తంగేళ్ల సత్యనారాయణ సీనియర్ టీడీపీ నాయకులు కొల్లు రామారావు మండల, గ్రామ స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు.

# జల సంరక్షణకు బాటలు వేసిన జలధారా జలహారతి

**స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా బాపట్లలో విశేష స్పందన**




**బాపట్ల ఏప్రిల్ 18 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** నీటి వనరుల పరిరక్షణ, భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా బాపట్ల పురపాలక సంఘం పరిధిలో స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర (సాస) కార్యక్రమం కింద జలధారా,జలహారతి కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్, బాపట్ల పురపాలక సంఘం ప్రత్యేక అధికారి డాక్టర్ వినోద్ కుమార్ వాసుదేవ ఐఏఎస్ ఆదేశాల మేరకు కమిషనర్ జి. రఘునాధ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ప్యాడిసన్‌పేట సచివాలయం పరిధిలోని మునిసిపల్ ఫిల్ట్రేషన్ ప్లాంట్ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా నీటి వనరుల పరిసరాలను శుభ్రపరిచే పనులు నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన 100 రోజుల ప్రత్యేక కార్యాచరణకు అనుగుణంగా భూగర్భ జలాల నిల్వ పెంపుపై ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షపు నీటి నిల్వ, నీటి వృథా నియంత్రణ వంటి అంశాలపై ప్రజలకు ప్రత్యక్షంగా వివరించారు. ఈ సందర్భంగా అధికారులు, మునిసిపల్ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, మెప్మా సిబ్బంది, స్థానిక ప్రజలు కలిసి (సాస) ప్రతిజ్ఞ చేసి నీటి సంరక్షణకు కట్టుబడి పనిచేయాలని సంకల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బాపట్ల ఆర్డీవో పి. గ్లోరియా మాట్లాడుతూ నీరు ప్రతి జీవికి ప్రాణాధారం అని, దాన్ని సంరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు నీటి కొరత సమస్యలు రాకుండా ఉండాలంటే వర్షపు నీటి నిల్వ విధానాలను ప్రతి ఇంటిలో అమలు చేయాలని, నీటి వృథాను తగ్గించాలని సూచించారు. మునిసిపల్ కమిషనర్ జి. రఘునాధ రెడ్డి మాట్లాడుతూ జలధారా జలహారతి కార్యక్రమం ప్రజల్లో నీటి విలువపై అవగాహన పెంచడమే ప్రధాన ఉద్దేశమని తెలిపారు. చెరువులు, కాలువలు, ఇతర నీటి వనరులను శుభ్రంగా ఉంచడం ద్వారా భూగర్భ జలాల స్థాయిని పెంచవచ్చని, ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ తరహా కార్యక్రమాలతో బాపట్లను స్వచ్ఛ సర్వేక్షణ 2025--26లో టాప్--10 స్థానంలో నిలిపే దిశగా కృషి కొనసాగుతోందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ షేక్ సలీమా, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ఎస్ఆర్ కృష్ణారెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ చల్లా శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారి అబ్దుల్ జబ్బార్, శానిటరీ ఇన్స్పెక్టర్లు సయ్యద్ నజీర్, చేవూరి కరుణా, పురపాలక సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

## రెండు సీసీ కెమెరాలు వితరణ



**రామాపురం ఏప్రిల్ 18 ప్రజా జ్యోతి** అన్నమయ్య జిల్లా రామాపురం మండలంలోని కుమ్మర పల్లిపంచాయతీ సూరక వాండ్ల పల్లెకు చెందిన సాఫ్ట్వేర్ ఇంజనీర్ గ్రామ టిడిపి నాయకులు నందలూరు కోటిరెడ్డి స్థానిక రామాపురం పోలీస్ స్టేషన్ లో శనివారం ఎస్సై శివకుమార్ కు రెండు సీసీ కెమెరా అందజేశారు. సందర్భంగా ఎస్ఐ శివకుమార్ నందలూరు కోటిరెడ్డి ని అభినందించారు. మండలంలోని గ్రామాల వద్ద సీ సీ కెమెరాలు ఏర్పాటుకు గ్రామస్తులు కోటిరెడ్డి ని ఆదర్శంగా తీసుకొని ముందుకు రావాలని అన్నారు. గ్రామంలో ఎలాంటి అసాంఘిక సంఘటనలు. ప్రమాదాలు జరిగిన కేసు విచారణలో పోలీసులకు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. కోటిరెడ్డి అందజేసిన రెండు కెమెరాలును వారి ఊరి వద్దనే ఏర్పాటు చేస్తామని ఎస్ఐ అన్నారు. ఈసీసీ కెమెరాలను రాయచోటి- వేంపల్లి ప్రధాన రహదారిలోని సురక వాండ్లపల్లి బస్సు స్టేజి వద్ద మరొకటి సురకవాండ్ల పల్లెలోఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి నాయకుడు ప్రదీప్ కుమార్ రెడ్డి. రామాంజులరెడ్డి. కానిస్టేబుల్ శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నెల్లిపాక పిహెచ్‌సి పరిధిలో ఐఆర్ఎస్ స్ప్రేయింగ్ ప్రారంభం

**బాల్య వివాహాల నిరోధంపై అవగాహన సదస్సు**





**ఎటపాక, ఏప్రిల్ 18 (ప్రజా జ్యోతి):** ఎటపాక మండలం నెల్లిపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల లో మొదటి విడత ఇండోర్ రెసిడ్యుయల్ స్ప్రేయింగ్ (ఐఆర్ఎస్) కార్యక్రమాన్ని శనివారం పాండు ంగాపురం గ్రామంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమం డాక్టర్ దురా ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా పాండురంగా పురం అంగన్వాడీ కేంద్రంలో బాల్య వివాహాల నివారణ, టీనేజ్ గర్భధారణ సమస్యలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ బాల్య వివాహాలు అమ్మాయిల ఆరోగ్యానికి, భవిష్యత్తుకు తీవ్ర హానికరమని పేర్కొన్నారు. టీనేజ్ వయసులో గర్భధారణ వల్ల తల్లి, శిశువు ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో ప్రజలకు ఆరోగ్య పరిరక్షణ, పరిశుభ్రత, దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధుల నివారణపై సూచనలు ఇచ్చారు. ఐఆర్ఎస్ స్ప్రేయింగ్ ద్వారా మలేరియా వంటి వ్యాధులను నియంత్రించవచ్చని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో పిహెచ్ఎన్ జి. సీతమ్మ, ఎఎన్ఎంలు రమణ, శ్రీలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ భాస్కర్, సీతయ్య, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్త జయలక్ష్మి పాల్గొన్నారు. గర్భిణీలు మరియు కిశోర బాలికలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కార్యక్రమం గ్రామ ప్రజల్లో మంచి స్పందనను పొందింది.

## 20న జగత్ జ్యోతి శ్రీ గురు బసవేశ్వర జయంతి



**గుంతకల్లు ఏప్రిల్ 18 (ప్రజా జ్యోతి):** సోమవారం ఏప్రిల్ 20వ తేదీన గుంతకల్లు పట్టణంలో జగత్ జ్యోతి శ్రీ గురు బసవేశ్వర జయంతి ఘనంగా నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో ఉరవకొండగవి మఠం ఉత్తరాధికారి కర్రి బసవ రాజేంద్ర ప్రసాద్ స్వాముల పాల్గొంటున్నారు. కావున ఈ కార్యక్రమంలో సమస్త వీరశైవు లు అందరూ పాల్గొనాలని వీరేశైవ సంఘ అధ్యక్షుడు విరుపాక్షిగా రెడ్డి తెలియజేశారు.

## ఉచిత మజ్జిగ పంపిని చేశారు



**బనగానపల్లె ఎప్రిల్= 18 ప్రజాజ్యోతి ప్రతినిది** శ్రీ మద్దిలేటి నరసింహ స్వామి దేవస్థానం కు వచ్చి వెళ్ళే భక్తుల కు శ్రీ యాగంటి ఉమా మహేశ్వర స్వామీ దేవాలయం వెళ్ళే దారిలో ఉన్న పత్తే నగరం గ్రామం మెట్ట దగ్గర బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి శివ క్రిష్ణ యాదవ్ ఆద్వర్యంలో ఈ హరికృష్ణ గౌడ్ బిజెపి మండల అధ్యక్షులు ఉచిత మజ్జిగ పంపిణి కార్యక్రమం ఏర్పాటు చేశారు దాదాపు 500 మంది భక్తులు మజ్జిగ తీసుకున్నారు విపరీతం గా ఎండలు ఉన్న సందర్భంగా పలువురు భక్తులు సంతోషం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గోపాల్ రాజు బాల స్వామీ వినోద్ పరమేష్ నవీన్ శివ క్రిష్ణ యాదవ్ కుమార్తె దివ్య వర్ష నడిపి మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు

## పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలకు వేలంపాట మద్యం నాటుసారా ధ్వంసం..





**కంబదూరు ఏప్రిల్18 (ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్,** కంబదూరు మండలంలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ లో ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్ రెడ్డి, ఆధ్వర్యంలో శనివారం గతంలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాల కు బహిరంగ వేలంపాట నిర్వహించారు. వేలంపాటలో ప్రభుత్వానికి జీఎస్టీతో కలిపి 59 వేల రూపాయలు ఆదాయం వచ్చిందని తెలిపారు. అనంతరం (39) కేసుల్లో పట్టుబడిన కర్ణాటక మద్యం, ఆంధ్ర మద్యం, నాటు సారా ను పోలీస్ వాహనంతో కొత్తపల్లి బ్రిడ్జి వద్ద ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో జయనాథ్ రెడ్డి ఇన్స్పెక్టర్ సునీల్ కుమార్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ కంబదూరు బాలకృష్ణ ఇన్స్పెక్టర్ హెడ్ కానిస్టేబుల్ రాజు, కానిస్టేబుల్ శ్రీనివాసులు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల మధ్యలో శిల్పా రవి రెడ్డి.. పూల పండ్ల వ్యాపారులతో ఆత్మీయ కలయిక...



**నంద్యాల ఎప్రిల్ = 18 ప్రజాజ్యోతి** నంద్యాల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న పూల పండ్లవ్యాపారస్తులతో ఈరోజు కాసేపు ఆత్మీయంగా మాట్లాడుతూ అందరితో కలిసి టీ తాగారు ప్రజల మధ్యలో తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకుంటూ వారికి అండగా నిలుస్తున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి అక్కడికి రావడంతో అక్కడ ఉన్న వారందరూ సంతోషంగా ఆప్యాయంగా పలకరిస్తూ వారి షాపుల దగ్గరకు తీసుకువెళ్లి వారి సమస్యలను వివరించడం జరిగింది... ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, నంద్యాల జిల్లా వైసీపీ అధికార ప్రతినిధి అనిల్ అమృతరాజ్, నంద్యాల జిల్లా వైసీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు టివి రమణ, మాజీ కౌన్సిలర్ లక్ష్మీనారాయణ, మునయ్య, జాకీర్ హుస్సేన్,కిరణ్ కుమార్, వైసీపీ నాయకులు పూల శీను, దండే సుధాకర్, దాదా, మరియు వైసీపీ నాయకులు పాల్గొన్నారు

## మాదకద్రవ్యాల అక్రమ రవాణా చట్టరీత్యా నేరం

- అక్రమ రవాణా పై పోలీసుల ఉక్కు పాదం
- డ్రోన్ సహాయంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిన ఎస్. ఐ సత్యన్నారాయణ



**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్:** మాదక ద్రవ్యాల వినియోగం ,అక్రమ రవాణా చట్టరీత్యా నేరమని స్థానిక ఎస్. ఐ సత్యన్నారాయణ అన్నారు. పొందూరు మండలం లోలుగు కొండ ,రైల్వే స్టేషన్ ,లుట్టపేట ,కింతలి ,కనిమెట్ట గ్రామాల్లో డ్రోన్ సహాయంతో గంజాయి వంటి మాదక ద్రవ్యాల పై,జూదం పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు వినియోగించిన అక్రమ రవాణా చేసిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మాదకద్రవ్యాల నివారణే ద్యేయంగా పోలీస్ యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. జీవితాలను నాశనం చేసే మాదక ద్రవ్యాలకు ప్రతీ ఒక్కరూ దూరంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు సంచరించి న మత్తు పదార్థాలు విక్రయించిన తమకు సమాచారం అందించాలని సూచించారు.

## పాతపట్నంలో మూడవ విడత జనగణన సర్వే సమావేశం.



**ప్రజా జ్యోతి రిపోర్టర్ :- యం. నరేష్.** పాతపట్నం మండలం నకు సంబంధించితే 01.05.2026దీ నుండి తే. 30.05.2026దీ వరకు జనాభా గణన -2027 కి సంబంధించి ఇండ్ల గణన చేయబడును. దీనికి గాను పాతపట్నం మండలం లో 144 హెచ్ ఎల్ బి గలవు. దీనికి గాను 136 ఎన్యూమరేటర్ లుని మరియు 22 మంది సూపర్ వైజర్ లు ను నియమించడం జరిగినది. వీరికి 4 బ్యాచ్ లలో శిక్షణ కార్యక్రమం జరుగుతున్నాయి మొదటి బ్యాచ్ : ఏప్రిల్ 9-11 2 బ్యాచ్ : 15-17 3 బ్యాచ్ :18-21 4 బ్యాచ్ :23-25 సమయం :9.30ఖఎ్శీ 5.30ౄాఎ, పాతపట్నం దీనికి సెన్సెస్ ఛార్జ్ అధికారి గా తహసీల్దార్ ఎన్ ప్రసాద్ రావు ఉప తహసిల్దార్ బి వెంకటరమణ, ఏఎస్ఓ పి. బాలరాజు మాస్టర్ ట్రైనీస్ దుంగ రమేష్, పి కామేశ్వరరావు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# పని గంటల పెంపుపై కేంద్రంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఏఐటీయూసీ నాయకులు



**గుంతకల్లు:** దేశవ్యాప్తంగా కార్మిక రంగ సమస్యల పరిష్కారం కోసం మరియు హక్కుల రక్షణ కోసం అఖిల భారత కార్మిక సంఘం కాంగ్రెస్ (ఏఐటీయూసీ) రాజీలేని పోరాటాలు చేస్తుందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బ య్య, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి. జగదీష్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జె. రాజా రెడ్డి, జిల్లా అధ్యక్షులు ఎస్.రాజేష్ గౌడ్ అన్నారు. శనివారం గుంతకల్లు పట్టణంలోని పాత బస్టాండ్ లో జరిగిన ఏఐటీయూసీ 12 వ జిల్లా మహాసభలో కార్మిక నేతలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా ల విధానాలపై నిప్పులు చెరిగారు. ముందుగా పట్టణంలోని బీరప్ప గుడి సర్కిల్ నుండి పాత బస్టాండ్ వరకు ఏఐటీయూసీ జెండాలు చేత పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాత బస్టాండ్ లో ఏఐటియు సి జిల్లా అధ్యక్షులు రాజారెడ్డి సభ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో ఏఐటీయూ సీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి. జగదీష్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జె. రాజా రెడ్డి మాట్లాడుతూ కార్మికులు సుదీర్ఘ పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం కేవలం నాలుగు లేబర్ కోడ్స్ గా మార్చడం అత్యంత అన్యాయమని, వేతనాలు, పారిశ్రామిక సంబంధాలు, సామాజిక భద్రత మరియు వృత్తి భద్రత పేరుతో తెచ్చిన ఈ కొత్త చట్టాలు కార్పొరేట్ సంస్థలకు లాభం చేకూర్చేలా ఉన్నాయని ఆరోపించారు.

**పని గంటల పెంపుపై ఆగ్రహం**

పని గంటలను 8 నుంచి 12 గంటలకు పెంచడాన్ని ఏఐటీయూసీ తీవ్రంగా వ్యతిరే కిస్తోంది. సమ్మె చేసే హక్కును కాలరాయడంతో పాటు, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సామా జిక భద్రతలను కార్మికులు కోల్పోయే ప్రమాదం ఉందని నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక హక్కుల పరిరక్షణ వందేళ్ల కిందట సాధించుకున్న హక్కులను కార్పొరేట్ శక్తుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తు న్నాయని, వాటిని రక్షించు కోవడానికి కార్మికులంతా ఏకమై కేంద్ర ప్రభుత్వం మెడలు వంచుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి.నారాయణ స్వామి, ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వి.కృష్ణుడు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు పి.గోవిందు, పీ.ఎస్.ఖాన్, జిల్లా కార్యదర్శులు సి.రాజు, జి.చిరంజీవి,కే. ఇబ్రహీం, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి ఎస్ఎండి గౌస్, హమాలీ వర్కర్స్ యూనియ న్ జిల్లా అధ్యక్షులు ఎం.మహేష్, ఏఐటీయూసీ మండల ప్రధాన కార్యదర్శి కే. ఈశ్వరయ్య, మండల అధ్యక్షులు టి. సురేష్ మరియు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ నాయకులు, ఏఐటీయూసీ ఆటో యూనియన్ నాయకులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అన్నవరంలో సిడిపివో వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో పోషణ పక్వాడ

## అక్షయ తృతీయ సందర్భంగా బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాలు




**కాకినాడ జిల్లా ఏప్రిల్ 18( ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** శంఖవరం మండలం అన్నవరంలో 8వ పోషణ పక్వాడ కార్యక్రమం సిడిపివో పర్వత వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఏప్రిల్ 9వ తేదీ నుండి 23వ తేదీ వరకు పోషణ పక్షోత్సవాల్లో భాగంగా శనివారం గర్భవతులు మరియు బాలింతల కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.అదేవిధంగా అక్షయ తృతీయ సందర్భంగా బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని కూడా శంఖవరం సీడీపీఓ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో అన్నవరం దేవాలయ పరిసరాల్లో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆమె గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన ఆహారపు జాగ్రత్తలు, గర్భిణీ స్త్రీలకు తప్పనిసరి వైద్య పరీక్షల ప్రాముఖ్యతపై వివరించారు.ప్రసవం తరువాత ముర్రిపాలు తక్షణమే పట్టించడం,ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వడం,ఆ తర్వాత అదనపు ఆహారంతో పాటు తల్లిపాలు కొనసాగించడం వల్ల శిశువుల ఆరోగ్యకరమైన ఎదుగుదల సాధ్యమవుతుందని తెలిపారు.0 నుండి 2 సంవత్సరాల మధ్య పిల్లల మెదడు అభివృద్ధి అత్యంత వేగంగా జరుగుతుందని పేర్కొంటూ,చిన్నారులను మొబైల్ ఫోన్లు, టీవీలు వంటి స్క్రీన్‌లకు దూరంగా ఉంచాలని సూచించారు. "నో స్క్రీన్ అవర్" విధానాన్ని పాటిస్తూ కుటుంబ సభ్యులతో ఆటలు, క్రీడలు,యోగా,శారీరక వ్యాయామాలు చేయించడం ద్వారా పిల్లల మానసిక,శారీరక అభివృద్ధి మెరుగవుతుందని తెలిపారు.అలాగే జంక్ ఫుడ్ దూరంగా ఉంచి ఇంట్లో తయారుచేసిన ఆహారం,పండ్లు, రోగ్యకరమైన స్నాక్స్ ఇవ్వాలని సూచించారు. ఉప్పు, పంచదార,నూనె వినియోగాన్ని తగ్గించాలని కూడా సీడీపీఓ పర్వత వెంకటలక్ష్మి సూచించారు.వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాలింతల ఆరోగ్య సంరక్షణపై కూడా అవగాహన కల్పించారు.అక్షయ తృతీయ సందర్భంగా, శ్రీ శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం, అన్నవరం పరిసరాల్లో బాల్య వివాహాల నిర్మూలనపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని,బాలికల విద్య, ఆరోగ్యం,భవిష్యత్తుకు అవి పెద్ద అడ్డంకిగా మారతాయని అధికారులు వివరించారు.ఈ కార్యక్రమాల్లో సెక్టార్ సూపర్వైజర్ బీవీ రజని,అంగన్వాడీ కార్యకర్తలు తల్లిదండ్రులు,గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఏలేశ్వరం గురుకులంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం

--జల ధార-జల హారతి"పై ర్యాలీ

--పాల్గొన్న నగర పంచాయతీ కమిషనర్,ప్రిన్సిపాల్ శారద






**కాకినాడ జిల్లా ఏప్రిల్ 18( ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** ఏలేశ్వరం నగర పంచాయతీలో గల అంబేద్కర్ గురుకుల పాఠశాలలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా "జల ధారా-జల హారతి" అనే అంశాన్ని ఘనంగా నిర్వహించారు.ఏలేశ్వరం నగర పంచాయతీ కమిషనర్, కళాశాల ప్రిన్సిపాల్ శారద సిబ్బందితో కలిసి చేపట్టిన ఈ కార్యక్రమంలో పాఠశాల,కళాశాల,విద్యార్థినీలు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు.అనంతరం పాఠశాల పరిసర ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు.నీటి సంరక్షణ మరియు పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులు, ప్రజలలో అవగాహన కల్పించారు.సేవ్ వాటర్ సేవ్ లైఫ్ అంటూ నినాదాలు చేపట్టారు.విద్యార్థులు,ఉపాధ్యాయులు చురుకుగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు,తదితరులు పాల్గొన్నారు.

# లింగ నిర్ధారణ నేరం : ఆర్డీఓ శ్రీనివాస్ హెచ్చరిక



**గుంతకల్లు ఏప్రిల్ 18 (ప్రజా జ్యోతి):** గర్భస్థ శిశువు లింగాన్ని నిర్ధారించడం చట్టరీత్యా నేరమని ఆర్డీఓ శ్రీనివాస్ స్పష్టం చేశారు. శనివారం గుంతకల్లు పట్టణం లోని ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావే శంలో ఆర్డీవో శ్రీనివాస్ మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు సమాజానికి హానికర మని, దీనిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం ప్రకారం ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినా, ప్రోత్సహించి నా లేదా సహకరించినా చట్ట పరమైన చర్యలు తీసుకుంటా మని అన్నారు. స్కానింగ్ సెంటర్లు, ఆసుపత్రులు ఈ చట్టాన్ని కచ్చితంగా పాటించాల్సిన బాధ్యత ఉందన్నారు. నియమావళిని ఉల్లంఘిస్తే లైసెన్సులు రద్దు చేసి కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. సమాజంలో ఆడ పిల్లలపై వివక్ష, మూఢనమ్మకాల వల్లే ఇటువంటి అక్రమాలు జరుగుతున్నాయని, వాటిని నిర్మూలించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపా రు. గర్భిణీల వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని, అనుమానాస్పద కార్యక లాపాలపై వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గ్రామ స్థాయిలో ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు ప్రజలకు అవగాహన కల్పించాలని, లింగ నిర్ధారణ కు పాల్పడే కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశించారు. అవసరమైతే ఆకస్మిక తనిఖీ లు నిర్వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, ఐసీడీఎస్ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ జయవర్ధన్ రెడ్డి, డాక్టర్ సుజాత రామాంజనేయులు, గంగాధర్, అరుణ, సిడిపిఓ ఎల్లమ్మ, డిప్యూటీ హెచ్. ఈ. ఓ లు వేణుగోపాల్, సత్య నారాయణ, టి పి ఆర్ ఓ మోహన్, అంగన్వాడి సూపర్వైజర్ పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటకులకు బాపట్ల నుంచి కొత్త పిలుపు..!

**అడ్వెంచర్ స్పోర్ట్స్‌తో బీచ్‌ల అందం రెట్టింపు**

**యువతకు ఆకర్షణగా పారా సైలింగ్, జెట్ స్పోర్ట్స్ ప్రారంభం**

**బాపట్ల ఏప్రిల్ 18 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** బాపట్ల జిల్లాలో పర్యాటక రంగానికి కొత్త దిశగా అడుగులు పడుతున్నాయి. వేటపాలెం మండలం రామాపురం మరియు వాడరేవు బీచ్‌లలో అడ్వెంచర్ టూరిజం స్పోర్ట్స్‌ను ప్రారంభించేందుకు జిల్లా యంత్రాంగం సన్నాహాలు పూర్తి చేసింది. జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వాసుదేవ ఐఏఎస్. శనివారం రామాపురం బీచ్‌లో ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా చీరాల శాసనసభ్యులు ఎం.ఎం.కొండయ్యతో కలిసి బీచ్ ప్రాంతంలో సందర్శించారు. ముందుగా జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి కె.వినయ్ పారా గ్లైడింగ్ ట్రయల్ రన్ నిర్వహించగా, అనంతరం ఎమ్మెల్యే కొండయ్య పారా గ్లైడింగ్ ద్వారా ఆకాశంలో విహరించి యువతలో ఉత్సాహాన్ని నింపారు. విహంగ్ అడ్వెంచర్స్ కెప్టెన్ సూర్య, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ డివిజనల్ మేనేజర్ కృష్ణ చైతన్యతో కలెక్టర్ ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రామాపురం, వాడరేవు బీచ్‌ల ఖ్యాతిని మరింత పెంచేలా అడ్వెంచర్ స్పోర్ట్స్ కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. పారా గ్లైడింగ్, పారా సైలింగ్, జెట్ స్పోర్ట్స్‌ను జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి ఆదివారం ప్రారంభించనున్నట్లు చెప్పారు. చీరాల ప్రాంతంలో ఈ తరహా స్పోర్ట్స్ ప్రారంభం ఇదే తొలిసారి కావడం విశేషమని, దీనివల్ల పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని తెలిపారు.



హైదరాబాద్ నుండి జాతీయ రహదారి ద్వారా కేవలం ఐదు గంటల్లోనే వాడరేవు చేరుకునే సౌకర్యం ఉండడం పర్యాటకులకు మరింత ఆకర్షణగా మారుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏపీ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా నూతన విధానాలతో బీచ్‌ల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అడ్వెంచర్ స్పోర్ట్స్ నిర్వహణకు అన్ని అనుమతులు పొందినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం ద్వారా స్థానిక మత్స్యకార యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు టూరిజం శాఖ ముందుకు వచ్చినట్లు చెప్పారు. త్వరలోనే బ్లూఫ్లాగ్ బృందం జిల్లాకు రానుందని తెలిపారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధి నేపథ్యంలో ఆక్రమణలు, అనుమతి లేకుండా వ్యాపారాలు నిర్వహించడాన్ని సహించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి అలీఅస్గర్, చీరాల ఆర్డీవో చంద్రశేఖర్, ల్యాండ్ సర్వే రికార్డ్స్ ఏడి శేషగిరిరావు, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ రావు, చీరాల మున్సిపల్ కమిషనర్ డానియల్, చీరాల, వేటపాలెం మండలాల తహసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిపక్షాల ఐక్యతలో అఖిలేష్ యాదవ్ పాత్ర కీలకం

**: సమాజవాది పార్టీ**

**బాపట్ల ఏప్రిల్ 18 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** మహిళా రిజర్వేషన్ల అంశంపై దేశంలోని ప్రతిపక్ష పార్టీలు ఏకాభిప్రాయంతో ఉన్నాయని, అయితే అందులో బీసీలకు ప్రత్యేక సబ్‌కోటా ఉండాలని సమాజవాది పార్టీ స్పష్టం చేసింది. బాపట్లలో జరిగిన విలేకర్ల సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మేధ శ్రీనివాసరావు ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న లోక్‌సభలోని 545 స్థానాల్లోనే మహిళా రిజర్వేషన్లు తక్షణం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమాజవాది పార్టీ జాతీయ నాయకత్వం కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తోందని, మహిళా రిజర్వేషన్లను వాయిదా వేయడం సమంజసం కాదన్నారు. ఇదే సమయంలో, బీజేపీ మాత్రం రాజకీయ లాభాల కోసం మహిళా రిజర్వేషన్ల అమలును జనాభా లెక్కలు మరియు డిలిమిటేషన్ ప్రక్రియ తర్వాతికి వాయిదా వేయాలని చూస్తోందని ఆరోపించారు. 2034 లేదా 2039 ప్రాంతంలో జరిగే ఎన్నికల నాటికి అమలు చేయాలనే వ్యూహం ద్వారా ఉత్తరాది రాష్ట్రాలకు అనుకూల పరిస్థితులు సృష్టించాలని ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. జనాభా ప్రాతిపదికన సీట్ల పునర్విభజన జరిగితే, కుటుంబ నియంత్రణ కార్యక్రమాలను సమర్థంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలకు నష్టం కలిగే అవకాశం ఉందని, అదే సమయంలో ఉత్తరాది



రాష్ట్రాలకు సీట్లు పెరిగే అవకాశం ఉందని ఆయన వివరించారు. దీనివల్ల లోక్‌సభలో ప్రాంతీయ అసమానతలు పెరిగే ప్రమాదం ఉందన్నారు. ఈ అంశంపై దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రతిపక్ష పార్టీల మధ్య సమన్వయం సాధించడంలో సమాజవాది పార్టీ జాతీయ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. భవిష్యత్తులో డిలిమిటేషన్ ప్రక్రియ న్యాయంగా, సమతుల్యంగా ఉండేలా ప్రతిపక్షాల ఐక్యత కొనసాగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా వార్షికోత్సవం

**హొళగుంద, ఏప్రిల్ 18,ప్రజా జ్యోతి న్యూస్ –** మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో శనివారం వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమం ప్రారంభంలో విద్యా దేవత సరస్వతి దేవికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారులు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు మరియు ఎం ఆర్ సి సిబ్బంది ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారులు మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నతనం నుండే క్రమశిక్షణ, ఉత్తమ విలువలను అలవర్చుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలనీ,విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరుకావాలని అన్నారు.




ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అన్ని రకాల ఉచిత సదుపాయాలు పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం వంటివి అందుబాటులో ఉన్నాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమం ముగింపులో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయ బృందం కలిసి మండల విద్యాశాఖ అధికారులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన అతిథులకు, తోడ్పాటు అందించిన తల్లిదండ్రులకు పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ వేడుకలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోం

**మహబూబ్ నగర్** మహబూబ్ నగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి ,ఎమ్మెల్యేలు మధుసూదన్ రెడ్డి, వంశీ కృష్ణ తదితరులు మీడియా సమావేశం నిర్వహించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ భారతదేశ ప్రజాస్వామిక వ్యవస్థలో నియంతృత్వానికి తావులేదని లోకసభ లో నిరూపితమైంది. ప్రజాస్వామ్యాన్ని బలహీనపర్చాలనే వారికి నిన్నటి బిల్లు వీగిపోవడం చెంపపెట్టు లాంటిది. 44 సంవత్సరాలుగా వాళ్ళ పార్టీకి ఒక్క బీజేపీ మహిళా అధ్యక్షురాలు లేదు. కాంగ్రెస్ పార్టీ పురుషులతో సమానంగా మహిళలకు ఓటు హక్కు కల్పించింది. రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ యాక్ట్. స్థానిక సంస్థలు ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లు తెచ్చింది కాంగ్రెస్ పార్టీ.. మహబూబ్ నగర్ మేయర్ మహిళా అయింది అంటే కాంగ్రెస్ పార్టీ . రాజకీయ పరమైన నియంతృత్వం. డిలిమిటేషన్ ద్వారా దక్షిణ భారతదేశానికి అన్యాయం జరిగే విధంగా సీట్లు పెంచడంతో పాటు దానికి మహిళా బిల్లు జోడించడం అంటే వారికి చిత్తశుద్ధి లేదు. మా పార్టీ అధ్యక్షురాలు, ప్రధాని,రాష్ట్రపతి లోకసభ స్పీకర్ ను మహిళలను చేసిన చరిత్ర కాంగ్రెస్ దని అన్నారు. ఇప్పటికే ఆమోదం పొందిన మహిళా బిల్లు వచ్చే ఎన్నికల్లో రిజర్వేషన్లు వచ్చేలా పెట్టండి. మహిళా బిల్లులో ఎస్సీ ఎస్టీ బీసీ సబ్ కోటా ఉండాలని కాంగ్రెస్ పార్టీ స్టాండ్. సంఖ్యా బలం ఉందని ఇష్టారీతిన వ్యవహరించారు ప్రజాస్వామ్యాన్ని కాలరాసే విధంగా చట్టాన్ని నిర్వీర్యం చేసే విధంగా వ్యవహరించడం వల్లే బిల్లు వీగిపోయింది..హ్యాట్సాఫ్ ఇండియా కూటమి ఎంపీలకు 2/3 శాతంలో 54 ఓట్లు తక్కువ వచ్చాయి. మహిళలకు సంబంధిం చి మొసలి కన్నీరు కారుస్తూ డీలిమిటేషన్ తో లేకగడుతూ ఇండివిజువల్ కాకుండా బిల్లు పెట్టారు ప్రజాస్వామ్యాన్ని నిరంకుశత్వంగా కూని చేశారు. కాంగ్రెస్ పార్టీ మహిళా రిజర్వేషన్లకీ కట్టుబడి ఉందని అన్నారు. మహిళా సాధికారతగా వెళ్తున్న తెలంగాణ మహిళలు బీజేపీ కుట్రలు తిప్పికొట్టాలి. తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష దశాబ్దాలుగా ఉంది. విద్యార్థులు,యువకులు అమరులైతే ఆనాడు పార్లమెంట్ సభ్యుడిగా కొట్లాడి ఆర్టికల్ 3 ద్వారా లోకసభ,రాజ్యసభ లో ఆమోదం పొంది ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడింది. బీజేపీ ఎంపీ దుర్మార్గుడు తెలంగాణ విభజన ను భారత్ పాకిస్థాన్ విభజన తో పోల్చి అవమానపరిచే విధంగా మాట్లాడారు. అదే సభలో ఉన్న తెలంగాణ బీజేపీ ఎంపీలకు చీము నెత్తురు లేదా అని నిలదీసారు. బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు,కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కాకినాడ తీర్మానం లో ఒక ఓటు రెండు రాష్ట్రాలు అన్నది ఎవరు. మీ వల్లే తెలంగాణ ఆలస్యం అయింది.మాంధ్రులు తెలంగాణ విభజన ను వ్యతిరేకించిన స్వయంగా అద్వానీ తో చర్చించి సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పరిచారు. తెలంగాణ రాష్ట్ర కోసం రాజీనామా చేయమని అంటే పారిపోయిన వ్యక్తి కిషన్ రెడ్డి తేజస్వి సూర్య తప్పుయింది అని ఒప్పుకున్నారు అని అంటున్నారు. తేజస్వి మాటలు రికార్డుల నుండి తొలగించకపోతే కిషన్ రెడ్డి,బండి సంజయ్,స్థానిక ఎంపీ డీకే అరుణ మీరు తెలంగాణ ద్రోహులుగా మిగులుతారు.

## సంపాదకీయం

# మహిళా రిజర్వేషన్లు.. చరిత్రలో మరో కీలక మలుపు

లోకసభలో మహిళా రిజర్వేషన్ల బిల్లు వీగిపోవడం దేశ రాజకీయాలలో మరో కీలక మలుపుగా నిలిచింది. రాజ్యాంగ సవరణ స్థాయి బిల్లులు సాధారణ చట్టాల కంటే విభిన్నమైన ప్రామాణికతను, విస్తృత రాజకీయ సమ్మతిని కోరుకుంటాయి. 131వ రాజ్యాంగ సవరణగా ప్రతిపాదించ బడిన ఈ బిల్లుతో పాటు నియోజకవర్గాల పునర్విభజన, కేంద్ర పాలిత ప్రాంతాల సీట్ల పెంపు వంటి కీలక ప్రతిపాదనలు ఒకేసారి లోకసభ ముందుకు రావడం రాజకీయంగా ఆసక్తికరమైనా, వ్యూహాత్మకంగా ప్రమాదకర నిర్ణయంగా మారింది. 528 మంది సభ్యులు పాల్గొన్న ఓటింగ్‌లో 298 అనుకూల ఓట్లు, 230 వ్యతిరేక ఓట్లు రావడం గణాంక పరంగా మెజార్టీలా కనిపించినా, రాజ్యాంగ సవరణకు అవసరమైన రెండు-మూడవ వంతు మెజార్టీ సాధించడంలో ప్రభుత్వం విఫలమైంది. ఇదే ఈ పరిణామానికి మూల కారణం. ఈ పరిణామాన్ని అర్థం చేసుకోవాలంటే ముందుగా మహిళా రిజర్వేషన్ల చరిత్రను పరిశీలించాల్సి ఉంటుంది. 1990ల నుంచే మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించాలనే ఆలోచన రాజకీయ చర్చల్లో నిలిచింది. 1996లో మొదటిసారి ఈ బిల్లు ప్రవేశపెట్ట బడినా, అప్పటి నుండి అనేకసార్లు అది పార్లమెంట్‌లో ప్రవేశించి నిలిచి పోయింది. 2010లో రాజ్యసభలో ఆమోదం పొందినా, లోకసభలో ఆమోదం పొందకపోవడం వల్ల చట్టరూపం దాల్చలేదు. అంటే, మహిళా రిజర్వేషన్లు భారత రాజకీయాల్లో ఒక ‘అసంపూర్తి వాగ్దానం’గా మిగిలి పోయాయి. ప్రస్తుత సందర్భంలో కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును మళ్లీ తీసుకురావడం వెనుక రాజకీయ, సామాజిక రెండు కోణాలు ఉన్నాయి. ఒకవైపు మహిళా సాధికారతకు కట్టుబడి ఉన్నామని చెప్పుకోవడం, మరోవైపు ఎన్నికల ముందు మహిళా ఓటర్లను ఆకర్షించడమే లక్ష్యంగా కనిపించింది. అయితే, ఈ బిల్లును ఇతర రెండు కీలక బిల్లులతో కలిపి ఒకేసారి ప్రవేశ పెట్టడం ప్రభుత్వ వ్యూహంపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. నియోజకవర్గాల పునర్విభజన అనేది అత్యంత సున్నితమైన అంశం. జనాభా ప్రాతిపదికన సీట్ల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరుగుతుందనే భయం చాలా కాలంగా ఉంది. ఇదే సమయంలో కేంద్ర పాలిత ప్రాంతాల సీట్ల పెంపు ప్రతిపాదన కూడా రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేసే అంశంగా నిలిచింది. ఈ రెండు అంశాలు ప్రాంతీయ అసమానతలు, రాజకీయ ప్రయోజనాల చుట్టూ తిరుగుతుండగా, మహిళా రిజర్వేషన్ అనే సర్వసాధారణంగా అంగీకరించ దగిన అంశాన్ని కూడా వివాదంలోకి లాగినట్లైంది. లోకసభలో జరిగిన ఓటింగ్ గణాంకాలను పరిశీలిస్తే, ప్రభుత్వం సాధారణ మెజార్టీని సాధించినప్పటికీ, రాజ్యాంగ సవరణకు అవసరమైన ప్రత్యేక మెజార్టీ దూరంగా ఉంది. మొత్తం హాజరైన సభ్యులలో కనీసం రెండు మూడవ వంతు అనుకూల ఓట్లు అవసరం. 528 మంది సభ్యులు ఉన్న సందర్భంలో కనీసం 352 ఓట్లు అవసరం కాగా, ప్రభుత్వం 298 ఓట్లకే పరిమితమైంది. అంటే సుమారు 54 ఓట్ల లోటుతో బిల్లు వీగిపోయింది. ఇక్కడ ప్రధాన ప్రశ్న ఏమిటంటే?ఇది ప్రభుత్వ వ్యూహపరమైన పొరపాటా? లేక ఉద్దేశపూర్వక రాజకీయ ప్రణాళికా? విశ్లేషకుల అభిప్రాయాలు ఈ విషయంలో విభిన్నంగా ఉన్నాయి. ఒక వర్గం అభిప్రాయం ప్రకారం, ప్రభుత్వం మూడు బిల్లులను కలిపి ప్రవేశపెట్టడం ద్వారా ప్రతిపక్షాలను చిక్కులో పెట్టాలని భావించింది. మహిళా రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా ఓటు వేస్తే మహిళా వ్యతిరేకులుగా ముద్ర పడుతుంది; మిగతా బిల్లులకు అనుకూలంగా ఓటు వేస్తే తమ రాజకీయ ప్రయోజనాలు దెబ్బతింటాయి. ఈ పరిస్థితిలో ప్రతిపక్షాలు విభజిత మవుతాయని ప్రభుత్వం అంచనా వేసి ఉండవచ్చు. అయితే వాస్తవ ఫలితం వ్యతిరేకంగా వచ్చింది. ప్రతిపక్షాలు ఈ మూడు బిల్లులను వేర్వేరుగా పరిశీలించాలని డిమాండ్ చేశాయి. ముఖ్యంగా పునర్విభజన అంశంపై స్పష్టత లేకపోవడం, మహిళా రిజర్వేషన్ అమలు ఎప్పటి నుంచి అనేది తెలియక పోవడం, కొన్ని వర్గాలకు ఉప-రిజర్వేషన్ల అంశం స్పష్టంగా లేకపోవడం వంటి కారణాలు ప్రతిపక్షాలను ఒక్కటిగా నిలబెట్టాయి. ఫలితంగా వారు బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసే నిర్ణయం తీసుకున్నారు. ఇక్కడ మరో కీలక అంశం ప్రాంతీయ పార్టీల వైఖరి. కొన్ని ప్రాంతీయ పార్టీలు మహిళా రిజర్వేషన్‌కు మౌలికంగా అనుకూలంగానే ఉన్నప్పటికీ, పునర్విభజనతో తమ రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గుతుందనే భయంతో బిల్లును వ్యతిరేకించాయి. అంటే, మహిళా సాధికారత అనే అంశం ప్రాంతీయ రాజకీయాల కంటే తక్కువ ప్రాధాన్యత పొందినట్లు కనిపించింది. కేంద్ర ప్రభుత్వానికి ఇది రాజకీయంగా కూడా ఒక హెచ్చరికగా భావించవచ్చు. రాజ్యాంగ సవరణలు కేవలం సంఖ్యలతో కాదు, విశ్వాసంతో ఆమోదం పొందాలి. ప్రతిపక్షాలను సంప్రదించకుండా, విస్తృత చర్చలు లేకుండా, కీలక బిల్లులను ఒకేసారి ప్రవేశపెట్టడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. దీనిని వ్యూహాత్మక పొరపాటు అని చెప్పడం అతిశయోక్తి కాదు. అయితే మరో కోణంలో చూస్తే, ఇది ఒక రాజకీయ ప్రయోగంగా కూడా భావించవచ్చు. ప్రభుత్వం ఈ బిల్లులను ప్రవేశపెట్టి, ప్రతిపక్షాల అసలు వైఖరిని ప్రజల ముందు ఉంచాలని భావించి ఉండవచ్చు. మహిళా రిజర్వేషన్‌కు మద్దతు ఇస్తున్నామని చెప్పుకునే పార్టీలే చివరకు వ్యతిరేకంగా ఓటు వేసిన పరిస్థితి ప్రజల్లో చర్చకు దారి తీస్తుంది. ఎన్నికల సమయంలో ఇది ఒక ప్రధాన ప్రచార అంశంగా మారే అవకాశం ఉంది. మొత్తానికి, లోకసభలో ఈ మూడు బిల్లులు వీగిపోవడం ఒకే సమయంలో రాజకీయ వ్యూహం, లెక్కచేసిన రిస్క్, అలాగే అమలు లోపం? కలయికగా కనిపిస్తుంది. మహిళా రిజర్వేషన్ వంటి కీలక సామాజిక సంస్కరణ మరోసారి ఆలస్యమవడం బాధాకరం. అయితే ఈ సంఘటన భవిష్యత్తులో ఇలాంటి బిల్లులను ఎలా ప్రవేశపెట్టాలి, ఎలా సమ్మతి సాధించాలి అనే విషయంలో ఒక పాఠంగా నిలుస్తుంది. దేశ రాజకీయాలలో సంఖ్యల గణితం మాత్రమే కాదు, సమన్వయం, సమ్మతి, సమగ్ర దృక్పథం కూడా అంతే ముఖ్యమని ఈ పరిణామం స్పష్టంగా తెలియ జేస్తోంది. మహిళా రిజర్వేషన్లు అమలు కావాలంటే, అది కేవలం బిల్లుగా కాకుండా, రాజకీయ సంకల్పంగా మారాలి. లేదంటే, అది ప్రతి సారి పార్లమెంట్ గడప దాటక ముందే నిలిచిపోతూనే ఉంటుంది.

## ప్రకాష్ రాజ్‌కు నాగబాబు స్ట్రాంగ్ కౌంటర్

**హైదరాబాద్ :** విలక్షణ నటుడు ప్రకాష్ రాజ్ చేసే వ్యాఖ్యలు, వేసే ట్వీట్లు ఎంతటి వివాదాలకు దారి తీస్తుంటాయో అందరికీ తెలిసిందే. తాను నాస్తికుడిని అని చెబుతూ హిందూ మతం మీద, రామాయణం మీద ఆయన చేసిన కామెంట్స్ పట్ల ఇప్పుడు దేశ వ్యాప్తంగా దుమారం రేగుతోంది. రాముడిది నార్త్, రావణుడిది సౌత్.... రాముడు పండ్లను దొంగతనం చేయడం వల్లే ఘర్షణ మొదలైంది అంటూ ప్రకాష్ రాజ్ అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీంతో దేశ వ్యాప్తంగా ప్రకాష్ రాజ్ మీద వ్యతిరేకజ్వాలలు మొదలయ్యాయి. చాలా చోట్ల కేసులు కూడా నమోదు చేశారు.ప్రకాష్ రాజ్ వ్యవహారం, వివాదం మీద జనసేన నాయకుడు, ఎమ్మెల్సీ, నటుడు నాగబాబు స్పందించారు. ఇటీవల జరిగిన ప్రకాష్ రాజ్ తల్లి అంత్యక్రియలు కూడా వివాదాస్పద వ్యాఖ్యలకు దారి తీసిన సంగతి తెలిసిందే. వాటిని సైతం మెగా బ్రదర్ ప్రస్తావించారు. "ప్రకాష్ రాజ్ గారూ... మిమ్మల్ని మీరు క్రైస్తవ నాస్తికుడని చెప్పుకున్నప్పటికీ, మీ తల్లిగారి అంత్యక్రియలు జరిగినప్పుడు ఆమె విశ్వాసాన్ని గౌరవించారు. ఒక కొడుకుగా అది మీ కర్తవ్యం. దాన్ని మేం గౌరవిస్తాం. అదే స్ఫూర్తితో మీరు కోట్లాది మంది ప్రజల నమ్మకాలను గౌరవించాలి. నాస్తికత్వం అంటే దేవుళ్ళను గానీ, దేవుని పట్ల విశ్వాసం ఉన్న వారిని గానీ అపహాస్యం చేయడం కాదు. అది ఒక హేతుబద్ధమైన ఆలోచనా విధానం. తన సిద్ధాంతాల ద్వారా నాస్తిక తత్వాన్ని కూడా స్వీకరించిన ఏకైక మతం హిందూమతం మాత్రమే. అటువంటి సంప్రదాయాన్ని తోసిపుచ్చడం హేతుబద్ధం కాదు, అది అగౌరవం" అని నాగబాబు పేర్కొన్నారు.ఇతర దేశాలలో అయితే ఇటువంటి మాటలు మాట్లాడితే ప్రకాష్ రాజ్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు అని నాగబాబు వ్యాఖ్యానించారు. ఇంకా ఆయన మాట్లాడుతూ... "భవిష్యత్తులో మీలాంటి గౌరవహీనమైన వ్యక్తులతో నేను ఎప్పటికీ వాదించను. విభిన్న విశ్వాస వ్యవస్థలను గౌరవించడమే హేతుబద్ధతకు, బాధ్యతకు నిజమైన నిదర్శనం" అని రియాక్ట్ అయ్యారు.పవన్ కళ్యాణ్, నాగబాబు మీద ప్రకాష్ రాజ్ ఎలాంటి సెటైరికల్ కామెంట్స్ చేస్తుంటారో అందరికీ తెలిసిందే. మరి నాగబాబు ఇచ్చిన ఈ కౌంటర్ల మీద ప్రకాష్ రాజ్ ఎలా రియాక్ట్ అవుతాడో చూడాలి. ఇక దేశ వ్యాప్తంగా ప్రకాష్ రాజ్ మీద నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. బ్యాన్ ప్రకాష్ రాజ్ అంటూ ట్వీట్లు వేస్తున్నారు. బహిరంగంగా క్షమాపణ చెప్పాలనే డిమాండ్ కూడా వినిపిస్తోంది. మరి ఈ కాంట్రవర్సీకి ప్రకాష్ రాజ్ ఏ విధంగా ఫుల్ స్టాప్ పెడతారో చూడాలి.

## హర్మూజ్ నిన్న తెరిచారు.. ఇవాళ మూసేశారు

**హైదరాబాద్ :** అంతర్జాతీయ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి కేంద్రంగా పశ్చిమాసియాలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. తమ దేశ ఓడరేవులపై అమెరికా విధిస్తున్న నౌకాదళ దిగ్బంధనం కొనసాగుతుండటంతో, శనివారం నాడు ఈ జలసంధిని మళ్లీ మూసివేస్తున్నట్లు ఇరాన్ సైనిక కమాండ్ ప్రకటించింది. కేవలం కొన్ని గంటల క్రితమే ఈ మార్గాన్ని తెరుస్తున్నట్లు ఇరాన్ విదేశాంగ శాఖ ప్రకటించినప్పటికీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన వైఖరిని మార్చుకోకపోవడంతో ఇరాన్ తిరిగి ఈ కఠిన నిర్ణయం తీసుకుంది.అమెరికా తన నౌకాదళం ద్వారా ఇరాన్ ఓడరేవులకు వచ్చే వాణిజ్య నౌకలను అడ్డుకోవడం సముద్రపు దొంగతనం వంటిదేనని ఇరాన్ అధికారిక మీడియా మండిపడింది. ఇరాన్ ఓడరేవుల నుంచి వచ్చే నౌకలకు సముద్రయాన స్వేచ్ఛను పునరుద్ధరించే వరకు హోర్ముజ్ జలసంధి మా సాయుధ దళాల పూర్తి నియంత్రణలో ఉంటుంది అని ఇరాన్ సైన్యం స్పష్టం చేసింది. ఇరాన్ అణు కార్యక్రమంపై తాము ఆశించిన ఒప్పందం కుదిరే వరకు ఇరాన్ ఓడరేవులపై ఆంక్షలు , దిగ్బంధనం కొనసాగుతాయని ట్రంప్ ప్రకటించడం ఈ ఉద్రిక్తతలకు ఆజ్యం పోసింది. ప్రపంచవ్యాప్తంగా వినియోగించే ముడి చమురు మరియు సహజ వాయువులో దాదాపు 20 శాతం వాటా ఈ హోర్ముజ్ జలసంధి గుండానే రవాణా అవుతుంది. ఇరాన్ తాజా నిర్ణయంతో అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు ఒక్కసారిగా ఆకాశాన్ని తాకే ప్రమాదం ఉందని ఆర్థిక విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్, ఖతార్, ఇరాక్ వంటి దేశాల ఇంధన ఎగుమతులకు ఇది ఏకైక సముద్ర మార్గం కావడంతో, ఈ మూసివేత ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని చూపే అవకాశం ఉంది. ప్రస్తుతం లెబనాన్‌లో కాల్పుల విరమణ అమలులో ఉన్నప్పటికీ, అమెరికా–ఇరాన్ మధ్య నెలకొన్న ఈ ప్రతిష్టంభన ప్రత్యక్ష యుద్ధానికి దారితీసేలా కనిపిస్తోంది. ఇప్పటికే అమెరికా తన బీ–2 బాంబర్ల ద్వారా ఇరాన్ అణు కేంద్రాలను లక్ష్యంగా చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు ఇరాన్ తన క్షిపణి వ్యవస్థలను సిద్ధం చేయడం ఆందోళన కలిగిస్తోంది. హోర్ముజ్ మార్గంలో ప్రయాణిస్తున్న పలు దేశాల వాణిజ్య నౌకలు తమ ప్రయాణాన్ని మధ్యలోనే ఆపేసి వెనక్కి తిరుగుతుండటం అక్కడి యుద్ధ వాతావరణానికి నిదర్శనం. రాబోయే 48 గంటలు పశ్చిమాసియా భవిష్యత్తుకు అత్యంత కీలకంగా మారనున్నాయి.

## రేవంత్ సభను విజయవంతం చేయాలి

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'రైతు భరోసా' నిధుల విడుదల కార్యక్రమాన్ని చారిత్రాత్మక విజయవంతం చేయాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. మంథనిలోని తన క్యాంప్ కార్యాలయంలో మంథని, రామగిరి, కమాన్‌పూర్, ముత్తారం, పాలకుర్తి మండలాల కాంగ్రెస్ ముఖ్య నేతలు, ప్రజా ప్రతినిధులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. సోమవారం కాటారంలో జరగనున్న ఈ భారీ బహిరంగ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేస్తారని, ఆయనతో పాటు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు తదితరులు పాల్గొంటారని వెల్లడించారు.రైతు సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని, దానికి రైతు భరోసా పథకమే నిదర్శనమని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున రైతులు తరలివచ్చేలా చూడాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గాల వారీగా బాధ్యతలను కేటాయించిన ఆయన, ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను, పార్టీ శ్రేణులను కోరారు. కాటారం సభ ద్వారా రైతులకు భరోసా కల్పించడమే కాకుండా, వ్యవసాయ రంగానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను చాటి చెప్పబోతున్నామని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## కేసీఆర్ బయిటకు వస్తున్నారు...

**హైదరాబాద్ :** సింహం బయటకు వస్తుందంటే గుంటనక్కల గుండెల్లో దడ పుడుతుందని, అందుకే కేసీఆర్ జగిత్యాలలో బహిరంగ సభకు వస్తున్నారంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నో కుట్రలకు తెరలేపుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. జగిత్యాలలో మాజీ మంత్రి జీవన్ రెడ్డిని కేటీఆర్, హరీశ్ రావులు కలిశారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ, కేసీఆర్ సభ పెడతానంటే అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు.రేవంత్ రెడ్డి చాలా సిల్లీ పాలిటిక్స్ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ జగిత్యాల సభకు వస్తున్నారంటే రేవంత్ రెడ్డి మేడిగడ్డకు వెళుతున్నారని అన్నారు. రెండున్నరేళ్లలో మేడిగడ్డ వెళ్లేందుకు ముఖ్యమంత్రికి సమయం లేదా అని ప్రశ్నించారు. ఇక్కడ కేసీఆర్ కీలక బహిరంగ సభ జరుగుతుంటే టీవీలల్లో కేసీఆర్‌తో పాటు తన మేడిగడ్డ పర్యటన కూడా చూపించాలని, అలాగే పత్రికల్లో పతాక శీర్షికన కేసీఆర్‌తో పాటు తన వార్త రావాలనే చిల్లర ప్రయత్నం రేవంత్ రెడ్డి చేస్తున్నారని ఆరోపించారు.అలాగే జగిత్యాల వచ్చే రోడ్డు మూడేళ్లలో గుర్తుకు రాలేదు కానీ, ఇప్పుడు కేసీఆర్ సభ అనేసరికి రోడ్డును తవ్విస్తున్నారని మండిపడ్డారు. కోరుట్ల నుంచి ఎవరూ రాకుండా తవ్విస్తున్నారని ఆరోపించారు. గతంలో ఎన్నో బహిరంగ సభలు జరిగాయని, ఇప్పుడు కూడా విజయవంతమవుతుందని ధీమా వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి హైట్ మాత్రమే చిన్నది కాదని మెదడు కూడా చిన్నదేనని ఎద్దేవా చేశారు.

## దక్షిణాది రాష్ట్రాల ద్రోహం

**హైదరాబాద్ :** నియోజకవర్గాల పునర్విభజన నేపథ్యంలో దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడేందుకు కేంద్రం ప్రతిపాదించిన రాజ్యాంగ సవరణ బిల్లును విపక్షాలు అడ్డుకోవడాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్రంగా తప్పుబట్టారు. ఎక్స్ వేదికగా ఆయన స్పందిస్తూ... కాంగ్రెస్, ఇండియా కూటమిపై నిప్పులు చెరిగారు. బయట 'దక్షిణాది గౌరవం' అంటూ డ్రామాలు ఆడే విపక్షాలు, పార్లమెంటులో మాత్రం ఆ ప్రాంత గొంతు నొక్కేలా వ్యవహరించడం వారి ద్వంద్వ నీతికి నిదర్శనమని సంజయ్ మండిపడ్డారు. 2026 తర్వాత జరగబోయే పునర్విభజన వల్ల జనాభా నియంత్రణ పాటించిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు రాజకీయ ప్రాధాన్యత కోల్పోయే ప్రమాదం ఉందని, దానిని అడ్డుకునేందుకే ప్రధాని మోదీ ఈ 'రక్షణ కవచం' లాంటి బిల్లును తెచ్చారని బండి సంజయ్ వివరించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా దక్షిణాది సీట్లను 50 శాతం పెంచేందుకు సిద్ధమని స్పష్టమైన హామీ ఇచ్చినా విపక్షాలు స్పందించకపోవడం దారుణమన్నారు.

## గొల్లప్రోలు లో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం







**కాకినాడ జిల్లా గొల్లప్రోలు (ప్రజా జ్యోతి) ప్రతినిధి. బోర శివారెడ్డి.**రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెల 3వ శనివారం "స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్"కార్యక్రమాలు నిర్వహించారు.దప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, పాఠశాలల లో పాదా పీడీ శివరాం, గొల్లప్రోలు జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు (మామిడాల సూరిబాబు), బలి రెడ్డి గంగబాబు, బసా చిట్టిబాబు, మొగలివీరబాబు, పేకేటి సుబ్రమణ్యం,జనసేన నాయకులు పరిశుభ్రం చేసి మొక్కలు నాతారు. అనంతరం గొల్లప్రోలు పట్టణం లో పర్యటించి స్థినికంగా ఉన్న స్థానిక సమస్యలను తెలుసుకుని ప్రతి సమస్య కి పవన్ కళ్యాణ్ దృష్టిలో పెట్టి ప్రతి సమస్య తీరేలా చేస్తామని ప్రతి ఇంట మొక్కలు నాటమని, అలాగే ఇంటి పరిసరాలలో శుభ్రంగా ఉంచుకోమని. మున్సిపల్ అధికారులకు రెండు రోజులు ఒకసారి డ్రైనేజీలు శుభ్రం చేయాలని జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు మామిడాల సూరిబాబు తెలిపారు. గొల్లప్రోలు గర్ల్స్ హైస్కూల్ లో "స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్" కార్యక్రమం చేపట్టారు. పిల్లలకు స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమం గురించి అవగాహన కల్పించారు. జనసేన పార్టీ నాయకులు, పాడా పిడి శివరాం, పిల్లలతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చెట్లు నాటమని చెట్లు పకృతి మనకిచ్చిన అమూల్యమైన వరం అని చెట్ల లేని భూమిని మనం ఊహించలేము అని అవి భూమికి పచ్చని ఆభరణాలు అని చెట్లు మనకు ప్రాణవాయువు అందించి. మనం వదిలే హానికరమైన కార్బన్ డయాక్సైడ్ నో తీసుకుంటాయని. నేటి ఆధునిక కాలంలో , చెట్లను విచ్చడవిడిగా నరికేస్తున్నారు. దీనివల్ల కాలుష్యం పెరిగిపోయి, వర్షాలు తగ్గిపోతాయని, భూగర్భ జాలలు పడిపోతున్నాయని ఈ ప్రకృతి వైపరీత్యాలను అరికట్టాలంటే మనం తప్పనిసరిగా మొక్కలు నాటాలని. మన మనుగడ కోసం, భావితరాల కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాల్సిన బాధ్యత ఉంది. ఖాళీ ప్రదేశాలలో, ఇంటి ఆవరణలో మొక్కలు నాటాలి. మొక్క నాటడమే కాదు అది చెట్టుగా ఎదిగే వరకు దానికి నీరు పోసి సంరక్షించాలి. పచ్చదనాన్ని పెంచడం గురించి మనం ఇతరులకు చెప్పాలని. చెట్లు లేని భూమి , నీరు లేని ప్రాణం లాంటిది "వృక్షో రక్షతి రక్షితం " అంటే మనం చెట్లను రక్షిస్తే ఆ చెట్లు మనల్ని రక్షిస్తాయి. కాబట్టి పర్యావరణ పరిరక్షణలో భాగంగా నేడే మొక్కలు నాటడం ప్రారంభిద్దాం. మనభూమిని పచ్చగా మారుద్దాం అని జనసేన పార్టీ నాయకులు, పాడాపిటి శివరాం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, గొల్లప్రోలు జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు మామిడార సూరిబాబు, పాడా పిడి శివరాం, బలిరెడ్డి గంగ బాబు, బసా చిట్టిబాబు, మొగలి వీరబాబు, మొగలి రాజా, తలారి శ్రీనివాస్, దండు వీరబాబు, పేకెట్ సుబ్రహ్మణ్యం, తలారి కామరాజు, అరపి శ్రీను, అని శెట్టి నూకరాజు, లోవ రాజు, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ల లాభాల కోసమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయి

**50 లక్షల మంది షెడ్యూల్డ్ రంగాల్లో పనిచేసే కార్మిక వర్గానికి 15సం॥ నుంచి జీతాలు పెరుగుదల లేదు.!**



**మదనపల్లె ఏప్రిల్ 18 ప్రజా జ్యోతి** రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల జీతాలు పెంచం.! జీవితాంతం పనిచేసినా పర్మినెంట్ చేయము,పెన్షన్ ఇవ్వం! ఉన్న జీతాలు తగ్గిస్తాం! ఉద్యోగ భద్రత లేకుండా బానిసల్లాగ పనిచేయించాలనే విధానాన్ని అనుసరిస్తుంది.ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేద్దాం మహాసభల గోడ పత్రికలు విడుదల చేసిన ఏఐటీయూసీ నాయకులు కార్పొరేట్ల లాభాల కోసమే కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని ,50 లక్షల మంది షెడ్యూల్డ్ రంగాల్లో పనిచేసే కార్మిక వర్గానికి 15సం॥ నుంచి జీతాలు పెరుగుదల లేదని,రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల జీతాలు పెంచం.! జీవితాంతం పనిచేసినా పర్మినెంట్ చేయము,పెన్షన్ ఇవ్వం! ఉన్న జీతాలు తగ్గిస్తాం! ఉద్యోగ భద్రత లేకుండా బానిసల్లాగ పనిచేయించాలనే విధానాన్ని అనుసరిస్తుందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ ఆరోపించారు ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేద్దామని శనివారం మదనపల్లి టమోటా మార్కెట్ యార్డు వద్ద మహసభల గోడ పత్రికలు ఏఐటీయూసీ నాయకులు విడుదల చేశారు ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ నేడు కార్మిక వర్గం ఎన్నడూ లేనివిధంగా దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారని కార్మికుల కష్టాలను లోతుగా చర్చించి భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించడానికి ఏఐటీయూసీ 18వ రాష్ట్ర మహాసభలు ఏప్రిల్ 26 నుంచి 28 వరకు తిరుపతిలో జరుగుతున్నాయన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికవర్గంపై తీవ్రమైన దాడిని కొనసాగిస్తున్నాయి. లేబర్‌కోడ్స్ పేరుతో కార్మికవర్గం వందేళ్ల కిందట సాధించుకున్న హక్కులన్నింటిని కాలరాస్తున్నాయని,కార్మికవర్గాన్ని కట్టు బానిసలుగా మార్చి కార్పొరేట్లకు అధిక లాభాలు చేకూరుస్తున్నాయని,కేంద్ర ప్రభుత్వం శ్రమశక్తి నీతి–2005 అనే డాక్యుమెంటును విడుదల చేసిందన్నారు .దీని ద్వారా 'శ్రమ చేయడమే కార్మికుల బాధ్యత. ప్రతిఫలం ఆశించరాదు' అనే కర్మ సిద్ధాంతాన్ని తమ నినాదంగా ప్రకటించిందని తెలిపారు.కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, డైలీ వేజ్, పీస్ రేటు తదితర రేట్ల పేరుతో కార్మికవర్గాన్ని కార్పొరేట్లు దోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఎన్.జి.వో లు, టీచర్లతో సహా అందరూ పి.ఆర్.సి. కోసం పడిగాపులు పడుతున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్ కుమార్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి దేవా, ఏఐటీయూసీ మదనపల్లి పట్టణ కార్యదర్శి తిరమల,ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు ఖాదర్ భాషా, హుస్సేన్, సివిల్ సప్లయిస్ హమలీలు నర్సింహులు, వెంకటరమణ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు

# లివర్ సమస్యలకు ఆల్కహాల్ ఒక్కటే కారణం కాదు

### లివర్ డే సందర్భంగా మెడికవర్లో అవగాహన సదస్సు




**కరీంనగర్ :** లివర్ సమస్యలు కేవలం ఆల్కహాల్‌తోనే వస్తాయనే అపోహ ప్రజల్లో ఉందని ఆల్కహాల్ ఒక్కటే కారణం కాదని అనేక కారణాలతో లివర్ డ్యామేజ్ అవుతుందని మెడికవర్ వైద్యులు అన్నారు.వరల్డ్ లివర్ డేను పురస్కరించుకొని శనివారం కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో వైద్యులు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ రెగ్యులర్‌గా ఆల్కహాల్ సేవించడం వల్ల స్లోగా లివర్ డ్యామేజ్ అయ్యే ప్రమాదం ఉందన్నారు.కల్తీ ఆహారం,కల్తీ నూనెల కారణంగా కూడా లివర్ డ్యామేజ్ అయ్యే అవకాశం ఎక్కువగా ఉందన్నారు.కోవిడ్ తర్వాత శరీరంలో ఏ చిన్న సమస్య వచ్చినా చాలా మంది వెంటనే పారాసిటమాల్ మాత్రలను ఆశ్రయిస్తున్నారని.తాత్కాలిక ఉపశమనం ఇచ్చే ఈ మందులు,చాలా మందికి రోజువారీ అలవాటుగా మారిపోతున్నాయన్నారు.పారాసిటామల్ డోస్ ఎక్కువైనా లివర్‌పై ప్రభావం చూపుతుందన్నారు. అయితే, వైద్యుల పర్యవేక్షణ లేకుండా దీర్ఘకాలంగా ఏ మందులు వాడినా ఆరోగ్యానికి హానికరమేనని సూచించారు. నిరంతర అలసట,కండరాల క్రాంప్స్,తల తిరగడం,గుండె దడ,చేతులు లేదా కాళ్లలో మొద్దుబారటం,జుట్టు రాలడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు.కడుపు ఆరోగ్యాన్ని కాపాడితే.లివర్ ఆరోగ్యాన్ని కూడా కాపాడినట్లే అన్నారు.కొన్ని క్యాన్సర్ల వల్ల కూడా లివర్ డ్యామేజి అయ్యే ప్రమాదం ఉందని,చెట్ల మందులు,పసర్లను నమ్ముకొని ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని పిలుపునిచ్చారు.వ్యాధిని ముందుగా గుర్తిస్తే నివారణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో ఒబెసిటీ కారణంగా ఫ్యాటిలివర్ సమస్యలు ఎక్కువగా పెరుగుతున్నాయని,ఫ్యాటి లివర్‌కు చికిత్స సాధ్యమేనని వెల్లడించారు. శరీరంలో అత్యంత కీలకమైన అవయవముగా లివర్ పనిచేస్తుందని. లివర్‌ను కాపాడుకుంటేనే ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చన్నారు. మెడికవర్ ఆసుపత్రి సెంటర్‌హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన.ఈ అవగాహన సదస్సులో ఆసుపత్రి మెడికల్ గ్యాస్ట్రో డాక్టర్ ప్రణీత్,సర్జికల్ గ్యాస్ట్రో డాక్టర్ దిలీప్ రెడ్డి,జనరల్ సర్జన్ డాక్టర్ తాహా,అనెస్తీషియా డాక్టర్ వినయ్,క్రిటికల్ కేర్ డాక్టర్ ఉపేందర్‌రెడ్డి, సూపరింటెండెంట్ డాక్టర్ ప్రియాంక, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ అస్తిత్వాన్ని కించపరిస్తే సహించేది లేదు:

### వనపర్తిలో భగ్గుమన్న నిరసన



**వనపర్తి :** పార్లమెంట్ వేదికగా తెలంగాణ ఏర్పాటును అవమానపరిచేలా బిజెపి ఎంపీ తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ, వనపర్తి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద లక్కాకుల సతీష్ నేతృత్వంలో భారీ నిరసన కార్యక్రమం జరిగింది.తేజస్వీ సూర్యతో పాటు, తెలంగాణ ప్రయోజనాలను కాపాడటంలో విఫలమైన రాష్ట్ర బిజెపి ఎంపీల దిష్టిబొమ్మలను నిరసనకారులు దహనం చేశారు.ఈ సందర్భంగా లక్కాకుల సతీష్ గారు మాట్లాడుతూ, 60 ఏళ్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను గుర్తించి, ప్రాణ త్యాగాలను గౌరవిస్తూ శ్రీమతి సోనియా గాంధీ సాహసోపేతమైన నిర్ణయం తీసుకోవడం వల్లే తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందని గుర్తుచేశారు. అవమానకర పోలిక: దేశ విభజన నాటి రక్తపాతంతో, ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పడిన తెలంగాణను పోల్చడం కోట్లాది మంది తెలంగాణ బిడ్డల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని మండిపడ్డారు."తెలంగాణ రాష్ట్రం అనేది అమరవీరుల త్యాగాల ఫలం. అటువంటి పవిత్రమైన పోరాటాన్ని భారత విభజనతో పోల్చడం తేజస్వీ సూర్య అజ్ఞానానికి నిదర్శనం. వెంటనే ఆయన తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి."?లక్కాకుల సతీష్ 1.×బహిరంగ క్షమాపణ: తెలంగాణ సమాజానికి తేజస్వీ సూర్య వెంటనే క్షమాపణ చెప్పాలి. 2. ×బిజెపి ఎంపీల మౌనం: పార్లమెంట్‌లో తెలంగాణను అవమానిస్తుంటే నోరు మెదపని రాష్ట్ర బిజెపి ఎంపీలు రాజీనామా చేయాలి. ఈ కార్యక్రమం లో లక్కాకుల సతీష్ , బాపంపల్లి వెంకటేష్ బోయ మురళి ,రాజా నర్సింహ జిల్లా ఆర్టీఏ సభ్యులు జహాంగీర్, మార్కెట్ డైరెక్టర్ లతీఫ్ సూరి అయూబ్ ఖాన్ , వసీం ఇర్ఫాన్ పాషా ,యదిగిరి జయానంద్ తిరుపతి మతీన్ ,రాజు అశోక్ అమర్ యాసిన్ శరత్ తదితరులు పాల్గొన్నారు.

# సిహెచ్ సి చింతూరు ఎస్ ఎన్ సి యు (నవ జాతా శిశు కేంద్రం) లో అత్యల్ప బరువుతో పుట్టిన శిశువు విజయవంతంగా చికిత్స





**చింతూరు ఏప్రిల్ 18 ప్రజాజ్యోతి** చింతూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ( సిహెచ్ సి ) లోని ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ విభాగం ( ఎస్ ఎన్ సి యు )లో అత్యల్ప బరువుతో (1 కిలో కంటే తక్కువ) పుట్టిన శిశువుకు విజయవంతంగా చికిత్స అందించి, ఆరోగ్యంగా డిశ్చార్జ్ చేయడం జరిగింది. ఈ శిశువు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, పొడియా మండలం, పుట్టంపల్లి గ్రామానికి చెందిన శ్రీమతి మడకం కాంతి, శ్రీ మల్లా దంపతులకు పూర్వకాల ప్రసవం ( ప్రి మెచ్యూర్ డెలివరీ ) ద్వారా కుంట సిహెచ్ సి లో జన్మించింది. పుట్టిన వెంటనే శిశువు అత్యంత సీరియస్ పరిస్థితిలో ఉండటంతో కుంట ప్రభుత్వ ఆసుపత్రి నుండి చింతూరు ఆసుపత్రి కి రిఫర్ చేశారు. చింతూరు ఎస్ ఎన్ సి యు లో చేర్పించారు. డాక్టర్ బి. మహేష్, పిల్లల వైద్య నిపుణుడు (పిడియాట్రిషన్) ఆధ్వర్యంలో, మెడికల్ సూపరింటెండెంట్ డా. ఎం.వి. కోటిరెడ్డి పర్యవేక్షణలో శిశువుకు 80 రోజుల పాటు నిరంతర వైద్య చికిత్స, ప్రత్యేక సంరక్షణ అందించారు. శిశువు బరువు 1 కిలో కంటే తక్కువ నుండి 1.5 కిలోల వరకు పెరిగి ఆరోగ్యంగా మారింది. ఆసుపత్రి సిబ్బంది 24 గంటలు శ్రద్ధగా సేవలు అందిస్తూ, నవజాత శిశు సంరక్షణ విధానాలను కచ్చితంగా పాటించడం ద్వారా శిశువు కోలుకోవడంలో కీలక పాత్ర పోషించారు. ఇలాంటి చికిత్సను ప్రైవేట్ ఆసుపత్రుల్లో పొందాలంటే సుమారు రూ. 5 నుండి 7 లక్షల వరకు ఖర్చు అవుతుంది. అయితే సిహెచ్ సి చింతూరులో ఈ సేవలను పూర్తిగా ఉచితంగా అందించడం ప్రభుత్వ వైద్య సేవల నిబద్ధతను చూపిస్తుంది. ప్రస్తుతం శిశువు సురక్షితంగా, ఆరోగ్యంగా డిశ్చార్జ్ చేయబడింది. ఇది తల్లిదండ్రులకు ఎంతో ఆనందాన్ని కలిగించింది. ఈ కార్యక్రమంలో డా ఎం వి కోటిరెడ్డి సూపరింటెండెంట్, డా బి మహేష్ పీడియాట్రీషన్ , హెడ్ నర్స్ కుమారి, సిబ్బంది సుహాసిని, సౌందర్య, దుర్గా, స్వాతీ, శిరీష పాల్గొన్నారు.

## వజ్ర ప్రహార్ ఆపరేషన్ లో భాగంగా పోలీసుల తనిఖీలు



**కోవెలకుంట్ల ఎప్రిల్ = 18 ప్రజాజ్యోతి**జిల్లా ఎస్పీ ఆదేశానుసారం సిఐ హనుమంతు నాయక్ ఎస్సై మల్లికార్జున రెడ్డి పోలీసుల బృందంతో కోయిలకుంట్ల పట్టణంలోని ముదిగేడు సర్కిల్ నందు శనివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు సిఐ హనుమంత నాయక్ తెలిపారు. మరియు మండల పరిధిలోని కంపమల్లమెట్ట కంపమల్ల గ్రామంలో ఆపరేషన్ వజ్రప్రహార్ లో భాగంగా పోలీసు బృందం ఇండ్ల నందు, గడ్డివాముల యందు విస్తృతంగా తనిఖీలు చేశారు. అనంతరం ఎస్సీ కాలనీలో ప్రజలందరినీ సమావేశపరిచి డ్రగ్స్, గంజాయి, సారాకు బానిస కాకుండా దూరంగా ఉండాలని ముఖ్యంగా యువత డ్రగ్స్ మత్తుకు దూరంగా ఉండాలని మీ బంగారు భవిష్యత్తు పాడు చేసుకోవద్దని అందరితో ప్రతిజ్ఞ చేయించారు డ్రగ్స్ సారా సప్లై చేసే వాళ్ళు ఉంటే పోలీసు వారికి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ హనుమంత్ నాయక్, ఎస్సై మల్లికార్జునరెడ్డి, సంజామల ఎస్ఐ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## దువ్వూరు లో... స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర



**దువ్వూరు, ఏప్రిల్ 18 ( ప్రజా జ్యోతి )** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛ ఆంధ్ర -స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం దువ్వూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయ ఆవరణంలో స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం ఎంపీడీఓ సుబ్బారెడ్డి నిర్వహించారు. ఈ సంధర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ జల వనరుల సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, సాగునీటి వసతుల కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంజీవ రెడ్డి,డిప్యూటీ ఎంపీడీఓ హరికృష్ణ మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# పాతకొండపల్లిలో నేడు ‘బాల వికాస్’ వార్షికోత్సవం

సంస్కృతి--సంప్రదాయాలకు ప్రతిబింబంగా వేడుకలు

పిల్లల్లో దైవభక్తితో పాటు దేశభక్తి పెంపొందించడమే లక్ష్యం





**ఎటపాక, ఏప్రిల్ 18 (ప్రజాజ్యోతి):**పోలవరం జిల్లా ఎటపాక మండలంలో నేడు ఆధ్యాత్మిక వాతావరణం నెలకొననుంది. రాయణపేట పంచాయతీ పరిధిలోని పాతకొండపల్లి గ్రామంలోని శ్రీ కోదండ రామాలయ ప్రాంగణంలో ఈ నెల 19న (ఆదివారం) ‘బాల వికాస్’ కేంద్రం వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) శ్రీ వాణి ట్రస్ట్ ఆర్థిక సహకారంతో, సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుంది. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే వేడుకలు మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగనున్నాయి. గత ఏడాది కాలంగా బాల వికాస్ కేంద్రంలో మాతాజీ పర్యవేక్షణలో పిల్లలు అభ్యసించిన పాఠాలు, కళలను ఈ వేదికపై ప్రదర్శించనున్నారు. మన సనాతన ధర్మం భారతీయ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా విభిన్న కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. భజన కీర్తనలు, పద్య పఠనం సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు, పాటలు, విజ్ఞాన ప్రదర్శనలు ,తల్లిదండ్రులు, గురువులు, పెద్దల పట్ల గౌరవం, సమాజం పట్ల బాధ్యతపై విలువల ప్రదర్శనలు కేవలం అక్షర జ్ఞానం మాత్రమే కాకుండా పిల్లల్లో దైవభక్తి, దేశభక్తి పెంపొందించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే బాల వికాస్ కేంద్రాల ముఖ్య లక్ష్యమని సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. గ్రామ పెద్దలు, భక్తులు, పరిసర ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో హాజరై చిన్నారులను ఆశీర్వదించాలని మండల సమరసత సేవా ఫౌండేషన్ కమిటీ కోరింది.

## శరవేగంగా సాగుతున్న అడ్డవాగు వంతెన పనులు..

జెసిబి తో వంతెన పనులు చేస్తున్న దృశ్యం .......



**చాగలమర్రి , ఏప్రిల్ 18( ప్రజాజ్యోతి న్యూస్ ) ;** మండల కేంద్రమైన చాగలమర్రి సమీపంలో గల పాత గోపాయ పల్లె వస్తాలోని అడ్డవాగు వంతెన నిర్మాణపు పనులు శనివారం నుండి శరవేగంగా సాగుతున్నాయి. రైతులకు అనుకూలంగా ఉండేందుకు, వర్షపు నీరు వృధాగా వెళ్లకుండా వంతెన కింద వెళ్లేందుకు వీలుగా ఉండేందుకు ఆళ్లగడ్డ శాసన సభ్యులు అఖిలప్రియ కు తెలియజేయగా స్పందించిన ఎమ్మెల్యే ప్రణాళికలు సిద్ధం చేయించి పనులు చేసేందుకు నిధులు మంజూరు విషయమై రాష్ట్ర మైనారిటీ ఉపాధ్యక్షులు ఎంఎస్‌అన్సర్ భాష కృషి చేయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో వర్షపు నీరు వృధా పోకుండా వంతెన ద్వారా వెళ్లేందుకు వీలుగా ఉంటుందని ఆన్సర్ భాషా తెలిపారు. రైతు, కార్మిక, కర్షక, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన అన్నారు.

## స్వరాంధ్ర - స్వచ్ఛంద్రా. ఆళ్లగడ్డ



**ఆళ్లగడ్డ (ప్రతినిధి) ప్రజాజ్యోతి న్యూస్ మార్చి.18** ఆళ్లగడ్డ మున్సిపల్ కార్యాలయంలో 3 వ శనివారం సందర్భంగా స్వరాంధ్ర స్వచ్ఛంద్రా కార్యక్రమం చేపట్టడం జరిగింది. చీపుర్లు చెత్తపట్టి పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం స్థానిక వక్కిలేరులో ప్లాస్టిక్ వ్యర్థాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో కమిషనర్ కిషోర్. తహసీల్దార్ జ్యోతిరత్న. శానిటర్ ఇన్స్పెక్టర్ బాలస్వామి. తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన జనగణన శిక్షణ కార్యక్రమం



**దువ్వూరు, ఏప్రిల్ 18 ( ప్రజా జ్యోతి )** మే ఒకటి 2026 లో ప్రారంభమగు ఇండ్ల జాబితా మరియు ఇండ్ల గణన లో డేటా సేకరణకు సంబంధించిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమాలను దువ్వూరు మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్ తహసీల్దార్ మరియు సెన్సెస్ ఛార్జ్ ఆఫీసర్ సంజీవరెడ్డి, ఎంపీడీవో మరియు సహాయ సెన్సెస్ చార్జ్ ఆఫీసర్ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో మొదటి బ్యాచ్ ఏప్రిల్ 16 నుండి ఏప్రిల్ 18 వరకు నిర్వహించిన సూపర్వైజర్లు మరియు ఎన్యూమరేటర్లు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం శనివారం విజయవంతంగా ముగిసిందని తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి ఒక్క ఎన్యుమరేటర్ సమర్థవంతంగానూ మరియు ఖచ్చితత్వంతోను ఇచ్చిన సమయంలో ఇండ్ల జాబితా మరియు ఇండ్ల గణనను (ఫేజ్1) పూర్తి చేయవలెనని కోరారు. మే నెల ఒకటో తేదీ నుండి మే నెల 30వ తేదీ వరకు జరిగే ఈ ఫేజ్ లో ప్రజలు కూడా ఎన్యుమరేటర్లకు మరియు సూపర్వైజర్లకు సహకరించాలని మరియు సరైన సమాచారాన్ని ప్రజలు ఖచ్చితంగా ఇవ్వాలని కోరారు. ఏప్రిల్ 16 నుండి 30 వరకు నిర్వహించే స్వీయ గణన కార్యక్రమాన్ని ప్రజలందరూ కూడా వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్ వేణు, మండల వ్యవసాయ అధికారి అమర్నాథ్ రెడ్డి మరియు సూపర్వైజర్లు,ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

## ఇళ్లులేని నిరుపేదలకు తొరలోనే ఇళ్ల పట్టాలు మంత్రి బీసీ జనార్దనరెడ్డి



**బనగానపల్లె ఎప్రిల్ = 18 ప్రజాజ్యోతి** బనగానపల్లె నియోజకవర్గంలోని ఎస్సార్‌బీసీ కాలనీలో ఇళ్ల పట్టాల పంపిణీ కోసం నిర్ణయించిన భూములను నేడు స్వయంగా పరిశీలించాను. ఇల్లు లేని అర్హులైన నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలనే మా ప్రభుత్వ సంకల్పంతో ఈ అభివృద్ధి పనులు చేపడుతున్నాం. జంగిల్ క్లియరెన్స్ పనుల్లో భాగంగా ఈద్గా విషయంపై ముస్లిం మత పెద్దలతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించి, వారికి అన్ని వివరాలు తెలియజేశాను. అనువైన స్థలంలో అన్ని వసతులతో కూడిన సురక్షిత కొత్త ఈద్గాను నిర్మించి అధికారికంగా అందిస్తామని వారికి హామీ ఇవ్వడం జరిగింది.

## బడి పిలుస్తుంది...

ప్రతి బిడ్డకు విద్య మన అందరి బాధ్యత పచ్చారపల్లి గ్రామం



**హాలహర్వి ఏప్రిల్ 18 ప్రజా జ్యోతి న్యూస్:-**బడి పిలుస్తోంది కార్యక్రమం ద్వారా 2026-27 విద్యా సంవత్సరానికిగాను పాఠశాలల్లో ఎన్ రోల్ మెంట్ డ్రైవ్ నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు హాలహర్వి మండలం పచ్చారపల్లి గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి శంకర్ అలాగే మేదహాల్ ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమామహేశ్వర్, విద్యా కమిటీ చైర్మన్, పచ్చారపల్లి భగత్ సింగ్ యూత్ , విద్యార్థులు తో కలిసి గ్రామంలో వీధి ,వీధి తిరుగుతూ పిల్లలను ప్రభుత్వ బడి లో చేర్పించాలని, ప్రతి బిడ్డకు విద్య మన అందరి బాధ్యత అని గ్రామ పెద్దలకు, ప్రజలకు, పిల్లల తల్లిదండ్రులకు తెలియజేయడం జరిగింది. ఇంటర్ ఫలితాలు అందరిని ఆశ్చర్యం కలిగించాయి. ప్రైవేటు కాలేజీలకు ధీటుగా ప్రభుత్వం కాలేజీల్లో చదివే విద్యార్థులు మంచి ఫలితాలను సాధించారు. ఒత్తిడి లేని నాణ్యమైన విద్యా, అలాగే ఇంగ్లీష్ మీడియం, విద్యార్థులకు ఉచిత బట్టలు, బూట్లు, బెల్టు, బ్యాగ్, బుక్స్, నోట్ బుక్స్, డిక్షణరీ ,డొక్కా సీతమ్మ గారి మధ్యాహ్న భోజన పథకం ఇంకా మరెన్నో సౌకర్యాలను కల్పిస్తుందని అన్నారు. మన ప్రభుత్వ పాఠశాలలోనే మీ పిల్లలను చేర్పించాలని గ్రామంలో అందరికి చెపుతు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

# అంగన్వాడి టీచర్ పద్మ మృతి బాధాకరం



**ఏఐటీయూసీ, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ స్టేట్ కౌన్సిల్ మెంబర్ చంద్రకళ..**

**మృతి చెందిన అంగన్వాడి టీచర్ పద్మ .....**

**చాగలమర్రి , ఏప్రిల్ 18( ప్రజాజ్యోతి న్యూస్ ) ;** మండల కేంద్రమైన చాగలమర్రిలోని బుగ్గరస్తా వీధి 5 వ అంగన్వాడి కేంద్రం అంగన్వాడి టీచర్ పద్మ మృతి బాధాకరమని ఏఐటియుసి అనుబంధ సంస్థ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ చంద్రకళ అన్నారు. శనివారం మృతి చెందిన పద్మ ఇంటికి చేరుకుని నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడి టీచర్ పద్మ 24 సంవత్సరాల నుండి టీచరుగా విధులు నిర్వహిస్తూ లబ్ధిదారుల పట్ల ఓర్పు సహనం కలిగి పౌష్టికాహారం, ఆరోగ్య సలహాలు, పలు సూచనలు ఇవ్వడంలో ఆసక్తి కలిగి విధుల పట్ల అంకిత భావం కలిగి ఉండేదన్నారు.



పద్మావతి పట్ల ఆళ్లగడ్డ ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిని తేజేశ్వరి, సంతాపం తెలుపుతూ ప్రభుత్వం నుండి మంజూరయ్యే నిధులను మంజూరు చేస్తామని కుటుంబ సభ్యులకు తెలిపారు. సూపర్వైజర్ సుశీల, అంగన్వాడి టీచర్లు హసీనా వహీదా, ఇందుమతి, మై మూన్, రహమత్, మండల కేంద్రంలోని పలువురు టీచర్లు, వివిధ గ్రామాల అంగన్వాడి టీచర్లు

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య..

ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు ........



**చాగలమర్రి , ఏప్రిల్ 18 ( ప్రజాజ్యోతి న్యూస్ ) ;** మండల పరిధిలోని మద్దూరు గ్రామంలో బడి పిలుస్తోంది’కార్యక్రమంలో భాగంగా శనివారం గ్రామ పురవీధులలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి శేషశైనా రెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడం జరుగుతోందని విద్యార్థినీ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని గ్రామస్తులను కోరారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల యొక్క ప్రత్యేకతలను వివరించే కరపత్రములను పిల్లల తల్లిదండ్రులకు ఇంటింటా పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ ర్యాలీలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహబూబ్ బాషా, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయులు రవిశంకర్ రెడ్డి, మౌలాలి, షరీఫ్, సురేష్ బాబు, శ్రీనివాసమూర్తి, సుధా కుమారి, కవిత తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## అంబానీని మించిన అదానీ సంపద



అదానీ గ్రూపు ఛైర్మన్ గౌతం అదానీ సంపదలో ముకేష్ అంబానీని దాటేశారు. ఇటీవల అదానీ గ్రూప్ షేర్లు మార్కెట్‌లో దూసుకుపో వడంతో గౌతమ్ అదానీ తన చిరకాల ప్రత్యర్థి ముకేష్ అంబానీని వెనక్కి నెట్టి ఆసియాలోనే అత్యంత ధనవంతుడిగా అవతరించారని బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ వెల్లడించింది. ఈ రిపోర్ట్ ప్రకారం.. అదానీ నికర విలువ 92.6 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.8.5లక్షల కోట్లు)కు చేరుకోగా.. అంబానీ 90.8 బిలియన్ డాలర్ల (8.40 లక్షల కోట్లు)తో తర్వాతి స్థానానికి పడిపోయారు. కేవలం ఒక్క రోజులోనే అదానీ తన సంపదకు 3.56 బిలియన్లు (రూ.33వేల కోట్లు) జోడించుకోవడం గమనార్హం. అంతర్జాతీయంగా అదానీ ర్యాంక్ 19గా, అంబానీ ర్యాంక్ 20గా ఉంది. టాప్ 500లో 23 మంది భారతీయ పెట్టుబడిదారులున్నారు. అధిక ధరలతో సామాన్యుడి జేబు ఖాళీ అవుతున్న వేళ.. బిలియనీర్ల ఆస్తుల పెరుగుదలపై జరుగుతున్న చర్చ ఆర్థిక నిపుణుల్లో ఆలోచన రేకెత్తిస్తోంది. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, చమురు ధరల అస్థిరత, తగ్గుతున్న కొనుగోలు శక్తి కారణంగా సామాన్యుల పొదుపు హరించుకుపోతోంది. సగటు భారతీయుడి వాస్తవ ఆదాయం మాత్రం ఆశించిన స్థాయిలో వృద్ధి చెందక పోవడం గమనార్హం. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు అదానీ సంపద 8.1 బిలియన్ డాలర్లు పెంచుకున్నారు.

## వేదాంత గ్రూప్ చైర్మెన్‌పై ఎఫ్ఐఆర్ నమోదు




శక్తి జిల్లాలోని వేదాంత పవర్ ప్లాం ట్‌లో జరిగిన పేలుడులో 20 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయిన కేసులో ఛత్తీస్‌గఢ్ పోలీసులు గురువారం వేదాంత గ్రూప్ చైర్మెన్ అనిల్ అగర్వాల్, ఇతరులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్టు ఓ అధికారి తెలిపారు. సింగితరారు గ్రామంలోని వేదాంత ప్లాంట్‌లో ఏప్రిల్ 14న బాయిలర్ నుంచి టర్బైన్‌కు అధిక పీడనంతో కూడిన ఆవిరిని తీసుకు వెళ్తున్న స్టీల్ ట్యూబ్ పగిలి పేలుడు సంభవించిన విషయం విదితమే. ఈ ఘటనలో 20 మంది ప్రాణాలు కోల్పోయారు. 16 మంది గాయపడ్డారు. దీనిపై భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ల కింద దాభ్రా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్టు శక్తి సూపరిం టెండెంట్ ఆఫ్ పోలీస్ ప్రఫుల్ ఠాకూర్ తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగు తోందని, మతుల పోస్ట్‌మార్టం నివేదికలు, ఫోరెన్సిక్ సైన్స్ ప్రయోగశాల , పారిశ్రామిక ఆరోగ్య, భద్రతా విభాగం నుంచి పలు నివేదికలు రావాల్సి ఉందని ఆయన చెప్పారు.

## మళ్లీ 700 బి.డాలర్ల ఎగువకు విదేశీ మారకపు నిల్వలు

భారత విదేశీ మారకపు నిల్వలు మళ్లీ 700 బిలియన్ డాలర్ల(సుమారు రూ.63 లక్షల కోట్లు) ఎగువకు వెళ్లాయి. ఏప్రిల్ 10తో ముగిసిన వారంలో 3.825 బిలియన్ డాలర్లు పెరిగి 700.946 బిలియన్ డాలర్లకు చేరాయి. అంతకుముందు ఏప్రిల్ 3తో ముగిసిన వారంలోనూ 9.063 బిలియన్ డాలర్లు పెరిగి 697.121 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. ఏప్రిల్ 10తో ముగిసిన వారంలో విదేశీ మారకపు నిల్వల్లో కీలకమైన విదేశీ కరెన్సీ ఆస్తులు 3.127 బిలియన్ డాలర్లు అధికమై 555.983 బిలియన్ డాలర్లకు చేరాయి. పసిడి నిల్వల విలువ కూడా 601 మిలియన్ డాలర్లు పెరిగి 121.343 బి.డాలర్లుగా నమోదైంది. స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ కూడా 56 మిలియన్ డాలర్లు పెరిగి 18.763 బిలియన్ డాలర్లకు చేరాయి. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) వద్ద భారత నిల్వల స్థితి 41 మిలియన్ డాలర్లు అధికమై 4.857 బి.డాలర్లుగా నమోదైంది. ఏడు రోజుల వేరియబుల్ రేట్ రివర్స్ రెపో వేలం ద్వారా బ్యాంకింగ్ వ్యవస్థలో నుంచి

# దిగొచ్చిన బంగారం ధరలు

శనివారం పూట పసిడి ప్రియులకు ఒక తీపి కబురు అందింది. గత కొంతకాలంగా ఆకాశమే హద్దుగా పెరుగుతూ, సామాన్యుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన బంగారం ధరలు ఎట్టకేలకు కాస్త శాంతించాయి. అంతర్జాతీయ మార్కెట్లో చోటుచేసుకున్న సానుకూల పరిణామాల వల్ల దేశీయంగా ధరలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. ముఖ్యంగా పెళ్లిళ్ల సీజన్ జోరుగా సాగుతున్న తరుణంలో, ఈ చిన్నపాటి తగ్గుదల కూడా కొనుగోలుదారులకు పెద్ద ఊరటనిస్తోంది. భాగ్యనగరం హైదరాబాద్‌లో పసిడి ధరల సరళిని పరిశీలిస్తే, 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర శనివారం రూ.10 మేర తగ్గింది. దీంతో ప్రస్తుతం తులం బంగారం ధర రూ.1,54,190 వద్ద కొనసాగుతోంది. ఇక సామాన్యులు ఆభరణాల తయారీ కోసం ఎక్కువగా ఆశ్రయించే 22 క్యారెట్ల బంగారం ధర కూడా అంతే స్థాయిలో తగ్గి రూ.1,41,340 వద్ద స్థిరపడింది. తెలుగు రాష్ట్రాల్లోని విజయవాడ, విశాఖపట్నం వంటి ప్రధాన నగరాల్లోనూ ఇవే ధరలు కొనసాగుతున్నాయి. గత కొన్ని రోజులుగా అప్రతిహతంగా సాగుతున్న ధరల పరుగుకు బ్రేక్ పడటమే ఇప్పుడు బులియన్ మార్కెట్లో హాట్ టాపిక్ గా మారింది. బంగారంతో పోటీ పడుతూ దూసుకుపోతున్న వెండి కూడా శనివారం ఒకడుగు వెనక్కి వేసింది. హైదరాబాద్ మార్కెట్‌లో కిలో వెండి ధరపై



రూ.100 తగ్గి, ప్రస్తుతం రూ.2,74,900 వద్ద విక్రయించబడుతోంది. పారిశ్రామిక రంగంలో వెండికి విపరీతమైన డిమాండ్ ఉన్నప్పటికీ, గ్లోబల్ మార్కెట్ ఒత్తిడి కారణంగా స్థానిక ధరలు దిగివచ్చాయి. ఏపీలోని ప్రధాన పట్టణాల్లో కూడా వెండి ఇదే బాటలో పయనిస్తోంది. దేశంలోని ఇతర మెట్రో నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లో బంగారం ధరలు కాస్త ఆశాజనకంగానే ఉన్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,54, 340గా నమోదు కాగా, 22 క్యారెట్ల ధర రూ.1,41,490 వద్ద ఉంది. అయితే ఇక్కడ విశేషమేమిటంటే, హైదరాబాద్‌తో పోలిస్తే ఢిల్లీలో వెండి ధర భారీగా తక్కువగా ఉండటం. అక్కడ కిలో వెండి రూ.2,64,900గా ఉంది. ఇక దక్షిణాదిలోని మరో ప్రధాన నగరం చెన్నైలో పసిడి ధరలు దేశంలోనే అత్యధికంగా ఉన్నాయి. అక్కడ 24 క్యారెట్ల బంగారం రూ.1,55,010 దాటగా, 22 క్యారెట్ల బంగారం రూ.1,42,090 వద్ద కొనసాగుతోంది. ముంబై, బెంగళూరు నగరాల్లో మాత్రం హైదరాబాద్‌తో సమానంగా ధరలు స్థిరంగా ఉన్నాయి. స్థానిక పన్నులు, రవాణా ఖర్చుల వల్ల నగరాల మధ్య ఈ చిన్నపాటి వ్యత్యాసాలు ఉన్నప్పటికీ, పెళ్లిళ్ల సందడిలో ఉన్న కుటుంబాలకు ఈ ధరల తగ్గుదల ఒక శుభపరిణామం. పెరగడం ఆగి తగ్గిందన్న వార్త బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి కొత్త ఉత్సాహాన్ని ఇస్తోంది.

# డాలర్‌పై రూపాయి పైచేయి

## ఆర్‌బీఐ కీలక నిర్ణయంతో పెరిగిన విలువ

అంతర్జాతీయ ఫారెక్స్ మార్కెట్‌లో అమెరికన్ డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి శుక్రవారం ట్రేడింగ్‌లో గణనీయమైన బలాన్ని చాటింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఖీఃఎ) తీసుకున్న ఒక వ్యూహాత్మక చర్య రూపాయి విలువ పెరగడానికి ప్రధాన కారణమైంది.సాధారణంగా ప్రభుత్వ రంగ చమురు శుద్ధి సంస్థలు తమ దిగుమతుల కోసం మార్కెట్ నుండి నేరుగా డాలర్లను కొనుగోలు చేస్తుంటాయి. దీనివల్ల డాలర్‌కు డిమాండ్ పెరిగి రూపాయిపై ఒత్తిడి పెరు గుతుంది. అయితే.. ఈసారి అలా కాకుండా ఒక ప్రత్యేక క్రెడిట్ లైన్‌ను ఉపయోగించుకోవాలని ఆర్‌బీఐ ఆదేశించడం తో, బహిరంగ మార్కెట్‌లో డాలర్లకు డిమాండ్ తగ్గి రూపాయి విలువ 25 పైసలు లాభపడి 92.95 వద్ద స్థిరపడింది. మరోవైపు.. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ పరిణామాలు కూడా రూపాయికి అనుకూలంగా మారాయి. ముఖ్యంగా పశ్చిమ ఆసియాలో ఇజ్రాయెల్ - లెబనాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందన్న వార్తలు, అలాగే అమెరికా-ఇరాన్ చర్చలలో పురోగతి కనిపిస్తుందన్న అంచ నాలు ప్రపంచవ్యాప్తంగా మదుపర్లలో నమ్మకాన్ని నింపాయి. దీనికి తోడు దేశీయ ఈక్విటీ మార్కెట్లు సానుకూలంగా ప్రారంభం కావడంతో రూపాయికి మరింత మద్దతు లభిం చింది. అయితే.. గ్లోబల్ మార్కెట్‌లో డాలర్ ఇండెక్స్ ఇప్పటికీ బలంగానే ఉండటంతో రూపాయి లాభాలు కొంతమేర పరిమితమయ్యాయి. ఇక కమోడిటీ మార్కెట్ విషయానికి వస్తే.. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పతనమవ్వడం భారత్ వంటి దిగుమతి చేసుకునే దేశాలకు ఊరటనిస్తోంది. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్‌కు ఒక శాతం తగ్గి 97.99 డాలర్ల వద్ద, యూఎస్ డబ్ల్యూటీఐ దాదాపు రెండు శాతం తగ్గి 92.91 డాలర్ల వద్ద ట్రేడవుతున్నాయి. ఇదే సమయంలో విలువైన లోహాలైన బంగారం, వెండి ధరల్లో మాత్రం తీవ్ర ఒడిదుడుకులు కనిపిస్తున్నాయి. జూన్ 5 నాటి గోల్డ్ ఫ్యూచర్స్



రూ.1,53,250 వద్ద కొనసాగుతుండగా, మే 5 నాటి వెండి ధరలు ఏకంగా 0.83 శాతం పెరిగి రూ. 2,50,716 గరిష్ట స్థాయిని తాకడం విశేషం. మార్కెట్ నిపుణుల విశ్లేషణ ప్రకారం, ధరలు మరింత పుంజుకోవా లంటే కీలకమైన

# సన్‌రైజర్స్ స్క్వాడ్‌లో సఫారీ పేసర్.. పటిష్టంగా బౌలింగ్ దళం..!

పంతొమ్మిదో సీజన్‌లో బ్యాటర్లే కాదు బౌలర్ల ప్రదర్శనతోనూ విజయాలు సాధిస్తున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ (రాబఅతీఅంవతీం ఎఎఎవతీఝఝఱ స్క్వాడ్‌లోకి కొత్త పేసర్ వచ్చాడు. గాయంతో టోర్నీకి దూరమైన డేవిడ్ పైన్ స్థానంలో గెరాల్డ్ కొయెట్జీ(+వతీఝశ్రీఱ జశీవ్ఓవవ)ని సన్‌రైజర్స్ తీసుకుంది. పొట్టి ఫార్మాట్‌లో రాణిస్తున్న ఈ సఫారీ పేసర్‌కు స్వాగతం పలుకుతూ ఎక్స్‌లో పోస్ట్ పెట్టింది యాజమాన్యం. గతంలో ముంబై ఇండియన్స్, గుజరాత్ టైటాన్స్ జట్లకు ఆడిన కొయేట్జీ ఈసారి ఆరెంజ్ ఆర్మీ జెర్సీతో నిప్పులు చెరిగేందుకు సిద్ధమవుతున్నాడు. ఐపీఎల్-19లో సన్‌రైజర్స్ హైదరాబాద్ కుర్ర బౌలర్లు దుమ్మురేపుతున్నారు. సీనియర్లు హర్షల్ పటేల్, జయదేవ్ ఉనాద్కాట్‌లు విఫలమవుతున్నా.. మేమున్నామంటూ రాజస్థాన్ రాయల్స్‌పై మ్యాచ్ విజేతలుగా అవతరించారు ప్రఫుల్ హింగే, షకీబ్ హుస్సేన్. ఇప్పుడు వీరికి తోడుగా రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ కూడా చేయి వేయబోతున్నాడు. ఫిట్‌నెస్ సాధించిన ప్యాటీ సన్‌రైజర్స్ స్క్వాడ్‌లో చేరడం ఖాయమైన వేళ.. గాయపడిన పైన్ స్థానంలో గెరాల్డ్ కొయెట్జీతో ఒప్పందం చేసుకుంది ఫ్రాంఛైజీ. ఇదివరకూ ముంబై, గుజరాత్ జట్లకు ఆడిన అనుభవమున్న కొయేట్జీ రాకతో హైదరాబాద్ పేస్ దళం మరింత పటిష్టంగా మారింది. రాజస్థాన్‌పై అదిరే విజయంతో జోష్ మీదున్న ఇషాన్ కిషన్ బృందం శనివారం ఉప్పల్ మైదానంలోనే చెన్నై




సూపర్ కింగ్స్‌ను ఢీ కొట్టనుంది. ప్రస్తుతం రెండు విజయాలతో ఐదో స్థానంలో కొనసాగుతున్న హైదరాబాద్ ఈ మ్యాచ్లో భారీ తేడాతో గెలిస్తే గుజరాత్ టైటాన్స్‌ను దాటేసే అవకాశముంది.

## పాకిస్థాన్ క్రికెట్‌లో భారీ మార్పులు.. ప్రధాన కోచ్‌గా మాజీ కెప్టెన్..!




ఈమధ్య కాలంలో అంతర్జాతీయ క్రికెట్‌లో ఘోరంగా విఫలవుతున్న పాకిస్థాన్ జట్టును గాడీలో పెట్టేందుకు ఆ దేశ బోర్డు భారీ మార్పులు చేసింది. బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్‌తో టీమ్‌కు పూర్వవైభవం తీసుకురావాలనే ఉద్దేశంతో కొత్త కోచింగ్ సిబ్బందిని నియమించింది. జూనియర్ స్థాయిలో కోచ్‌గా విజయవంతమైన మాజీ కెప్టెన్ సర్ఫరాజ్ అహ్మద్ (ఝతీఫుఝతీఝఓ-ాష్ట్రఎవఎ)ను హెడ్‌కోచ్‌గా తీసుకుంది. ఇక బౌలింగ్ కోచ్‌గా మాజీ పేసర్ ఉమర్ గుల్, బ్యాటింగ్ యూనిట్‌కు శిక్షకుడిగా అసద్ షఫిక్‌లకు బాధ్యతలు అప్పగించింది. పాకిస్థాన్ జట్టు రెండు టెస్టుల కోసం మే నెలలో బంగ్లాదేశ్ వెళ్లనుంది. ఈ పర్యటనతో టీమ్‌ను బలోపేతం చేయాలనే లక్ష్యంతో కోచింగ్ యూనిట్‌ను మాజీ ఆటగాళ్లతో నింపేసింది పాకిస్థాన్ క్రికెట్ బోర్డు. అలాఅనీ ఈసారి విదేశీయులకు అవకాశమివ్వలేదు. మూడుకు మూడు స్థానాలను తమ జట్టు మాజీ క్రికెటర్లకే పాక్ బోర్డు కట్టబెట్టింది. ఛాంపియన్స్ ట్రో2017ఫీ కట్టబెట్టిన, అనుభవజ్ఞుడైన సర్ఫరాజ్ అహ్మద్‌ను ప్రధాన కోచ్‌గా నియమించింది పీసీబీ. అతడికి సహాయకులుగా.. అఫ్గనిస్థాన్ బౌలర్లకు మెలకువలు నేర్పిన ఉమర్ గుల్ (బౌలింగ్ కోచ్), అసద్ షఫిక్(బ్యాటింగ్ కోచ్)లు నియమితులయ్యారు. ఒకప్పుడు సీనియర్ జట్టుకు కలిసి ఆడిన ఈ ముగ్గురు ఇప్పుడు కోచ్‌లుగా ఆటగాళ్లను సానబెట్టేందుకు సిద్ధమవుతున్నారు. బంగ్లాదేశ్ సిరీస్‌తోనే వీళ్లకు తొలి పరీక్ష ఎదురవ్వనుంది. సొంతగడ్డపై బెబ్బులిలా గర్జించే బంగ్లాను ఓడించడమే సర్ఫరాజ్, అసద్, ఉమర్ గుల్ వ్యూహాలు సిద్ధం చేయనున్నారు. ఈ సిరీస్‌తో నలుగురు కుర్రాళ్లు సుదీర్ఘ ఫార్మాట్‌లో అరంగేట్రం చేయబోతున్నారు. పాకిస్థాన్ టెస్టు స్క్వాడ్ : షాన్ మసూద్(కెప్టెన్), అబ్దుల్లా ఫజల్, అమద్ బట్,అజాన్ అవైస్, బాబర్ ఆజాం, హసన్ అలీ, ఇమామ్ ఉల్ హక్, ఖుర్రం షహజాద్, మొహమ్మద్ అబ్బాస్, మొహమ్మద్ రిజ్వాన్(వికెట్ కీపర్), ముహమ్మద్ ఘాజీ ఘోరీ(వికెట్ కీపర్), నొమన్ అలీ, సాజిద్ ఖాన్, సల్మాన్ అఘా, సాద్ షకీల్, షాహీన్ అఫ్రిది.

# స్పోర్ట్స్

## చరిత్ర సృష్టించిన ఆర్సీబీ.. తొలి జట్టుగా రికార్డు




ఐపీఎల్-2026లో భాగంగా చిన్నస్వామి స్టేడియం వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో రాయల్స్ ఛాలెంజర్స్ బెంగళూరు అరుదైన మైలు రాయిని అందుకుంది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఆర్సీబీకి ఇది వందో మ్యాచ్. తద్వారా ఐపీఎల్ చరిత్రలో ఒకే వేదికపై 100 మ్యాచ్‌లు ఆడిన తొలి జట్టుగా బెంగళూరు రికార్డులకెక్కింది. ఐపీఎల్ తొట్ట తొలి సీజన్(2008) ఆర్సీబీ హోం గ్రౌండ్‌గా చిన్నస్వామి స్టేడియం ఉంది. ఇప్పటివరకు ఈ మైదానంలో బెంగళూరు జట్టు ఇప్పటివరకు 48 మ్యాచ్‌ల్లో విజయం సాధించగా.. 46 మ్యాచ్‌ల్లో ఓటమి పాలైంది. ఓ మ్యాచ్ టై కాగా.. మరో నాలుగు మ్యాచ్‌లు వర్షం కారణంగా రద్దు అయ్యాయి. ఈ మైదానంలో ఆర్సీబీకి అద్భుతమైన రికార్డు ఉంది. 2013 సీజన్‌లో ఇదే స్టేడియంలో పూణే వారియర్స్‌పై ఆర్సీబీ 263 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఇక ఆర్సీబీ తర్వాత స్థానంలో కోల్‌కతా నైట్‌రైడర్స్ ఉంది. కేకేఆర్ ఈడెన్ గార్డెన్స్‌లో ఇప్పటివరకు 98 మ్యాచ్‌లు ఆడింది. ఇక ఈ ఏడాది సీజన్ విషయానికి వస్తే.. ఆర్సీబీ వరుస విజయాలతో దూసుకుపోతుంది. ఇప్పటివరకు 5 మ్యాచ్‌లు ఆడిన ఆర్సీబీ నాలుగింట విజయాలు సాధించగా, ఓ మ్యాచ్‌లో ఓటమి పాలైంది. బెంగళూరు జట్టు ప్రస్తుతం పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో కొనసాగుతోంది.

## రవిబాబు 'రేజర్' ట్రైలర్ విడుదల..

**మే 8న థియేటర్లలోకి రానున్న యాక్షన్ థ్రిల్లర్!**

టాలీవుడ్ విలక్షణ నటుడు, దర్శకుడు రవిబాబు స్వీయ దర్శకత్వంలో ప్రధాన పాత్ర పోషిస్తూ రూపొందించిన చిత్రం 'రేజర్' ఈ సినిమా మే 8న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. క్రైమ్ మరియు యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమా ట్రైలర్‌ను చూస్తుంటే.. ఈ చిత్ర కథాంశం ఒక చిన్నారి ప్రాణాలను కాపాడేందుకు ఓ వ్యక్తి శక్తివంతమైన రాజకీయ మరియు నేర వ్యవస్థతో చేసే పోరాటం చుట్టూ తిరుగుతుంది. తాజాగా విడుదలైన ట్రైలర్‌లో రవిబాబు అత్యంత భయంకరంగా, రా అండ్ రస్టిక్ లుక్‌లో కనిపిస్తూ సినిమాపై అంచనాలను పెంచేశారు. 'జీబర్‌ఉఎవ ఙఅశ్రీశ్రీ ఎవ ఎతీఝశ్రీ' అనే ట్యాగ్‌లైన్‌కు తగ్గట్టుగా ట్రైలర్‌లోని యాక్షన్ సన్నివేశాలు చాలా ఉద్వేగభరితంగా మరియు హింసాత్మకంగా ఉండబోతున్నాయని స్పష్టమవుతోంది. గతంలో 'అవును', 'నచ్చావులే' వంటి వైవిధ్యమైన చిత్రాలను అందించిన రవిబాబు, ఈసారి కూడా ఒక సరికొత్త ప్రయోగానికి సిద్ధమయ్యారు. మరోవైపు ఈ చిత్రం విడుదల తేదీకి ఒక ప్రత్యేకత ఉంది. మే 8వ తేదీ రవిబాబు తండ్రి, దివంగత ప్రముఖ నటుడు చలపతిరావు గారి జయంతి కావడంతో, ఆయన జ్ఞాపకార్థం అదే రోజున సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్ణయించారు. ఈ చిత్రాన్ని సురేష్ బాబు సమర్పణలో ఫ్లయింగ్ ఫ్రాగ్స్ మరియు సురేష్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మించాయి. రవిబాబు దర్శకత్వం వహించడమే కాకుండా కథను కూడా ఆయనే అందించారు. ఈ చిత్రానికి ఎస్.ఎస్. రాజేష్ సంగీతం అందించగా, చరణ్ మాధవనేని ఛాయాగ్రాహకుడిగా, సతీష్ పొలోజు యాక్షన్ కొరియోగ్రఫర్‌గా వ్యవహరించారు. వేసవి కానుకగా విడుదలవుతున్న ఈ 'రేజర్' బాక్సాఫీస్ వద్ద ఏ మేరకు ప్రభావం చూపుతుందో చూడాలి.




## హిట్ దర్శకుడితో విజయ్ దేవరకొండ కొత్త సినిమా ప్రకటన




టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ మరో సినిమాను తాజాగా ప్రకటించారు. ప్రస్తుతం రణబాలి, రౌడీ జనార్దన ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్న ఆయన మరో సినిమా ప్రకటించి జోరు పెంచాడు. 'హాయ్ నాన్న' ఫేం శౌర్యువ్ దర్శకత్వంలో సినిమా చేస్తున్నట్లు విజయ్ దేవరకొండ తాజాగా ప్రకటిస్తూ తన టీమ్‌తో ఒక పోస్టర్‌ను విడుదల చేశారు. రష్మిక మందన్నతో పెళ్లి తర్వాత దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ తెరకెక్కిస్తున్న 'రణబాలి' షూటింగ్‌లో విజయ్ దేవరకొండి బిజీ అయిపోయాడు. మరోవైపు రెండోది రవికిరణ్ కోలా దర్శకత్వంలో 'రౌడీ జనార్దన' కోసం పనిచేస్తున్నాడు. ఇప్పుడు శౌర్యువ్ దర్శకత్వంలో మరో సినిమా ప్రకటించి ఆశ్చర్యపరిచాడు. ఈ మూవీకి సంగీత దర్శకుడిగా హషీమ్ అబ్దుల్ వాహబ్ పనిచేయనున్నారు. ఆయన గతంలో ఖుషి, హాయ్ నాన్న, 8వసంతాలు, ది గర్ల్‌ఫ్రెండ్ సినిమాలకు సంగీతం అందించిన విషయం తెలిసిందే. ఈ మూవీని వైరా ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మించనుంది. నానితో 'హాయ్ నాన్న' వంటి లవ్‌స్టోరీతో భారీ హిట్ కొట్టిన దర్శకుడు శౌర్యువ్– వైరా ఎంటర్‌టైన్‌మెంట్స్.. ఇప్పుడు విజయ్‌తో పాన్ ఇండియా ప్రాజెక్ట్ చేయనున్నారు. 'హాయ్ నాన్న' తర్వాత ఎన్టీఆర్ కోసం శౌర్యవ్ ఒక కథ రాసుకున్నాడని ప్రచారం జరిగింది. హీరోగా జూనియర్ ఎన్టీఆర్ అనుకున్నారట. కానీ, తారక్‌కు ఉన్న కమిట్‌మెంట్స్ వల్ల కుదరకపోవడంతో అదే స్టోరీని విజయ్‌కి చెబితే నచ్చడంతో గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాడని ప్రచారంలో ఉంది.

## తిరువీర్ ఖాతాలో మరో హిట్ పడినట్టేనా?



ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని నటుడిగా తనకంటూ తెలుగు సినీ పరిశ్రమలో మంచి గుర్తింపును సంపాదించుకున్న వారిలో తిరువీర్ ఒకరు. తాజాగా ఆయన హీరోగా నటించిన చిత్రం పాపం ప్రతాప్. ఈ సినిమాలో పాయల్ రాధాకృష్ణ హీరోయిన్‌గా నటించగా, అజయ్ ఘోష్ కీలక పాత్రలో కనిపించారు. ఎస్.పి. దుర్గా నగేష్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని మిత్రవింద మూవీస్ బ్యానర్‌పై నిర్మించారు. కె.ఎమ్. రాధాకృష్ణన్ ఈ సినిమాకు సంగీతం అందించారు. ఈ మూవీ ఈరోజు భారీ స్థాయిలో థియేటర్లలో విడుదలైంది. ఈ సినిమాపై తిరువీర్ భారీ అంచనాలు పెట్టుకున్నారు. మరి ఆయన అంచనాలను ఈ చిత్రం అందుకుందా? ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంది? ఇప్పుడు తెలుసుకుందాం. ఈ చిత్రంలో ప్రతాప్ (తిరువీర్) ఆర్థికంగా మంచి స్థితిలో ఉన్న వ్యక్తిగా కనిపిస్తాడు. తన తండ్రి (అజయ్ ఘోష్)కు ఇష్టం లేకపోయినా, తాను ప్రేమించిన అమ్మాయి బుజ్జమ్మ (పాయల్ రాధాకృష్ణ)ను పెళ్లి చేసుకుంటాడు. పెళ్లి తర్వాత కొంతకాలం పాటు వీరి వైవాహిక జీవితం సాఫీగా సాగుతుంది. అయితే ఒక సమయంలో ప్రతాప్ నిద్రలో ఒక వింత ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నాడని బుజ్జమ్మకు తెలుస్తుంది. ఆ సమస్య కారణంగా ఆమె అతన్ని వదిలి వెళ్లిపోతుంది. అంతగా ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్య వదిలి వెళ్లిపోయేంత తీవ్రమైన ఆరోగ్య సమస్య ఏమిటి? ప్రేమ వివాహం చేసుకున్నందుకు ముందే అసంతృప్తిగా ఉన్న ప్రతాప్ తండ్రి ఆ తర్వాత ఎలా స్పందించాడు? అనే ప్రశ్నలకు సమాధానం తెలుసుకోవాలంటే ఈ సినిమా చూడాల్సిందే. ఈ సినిమాలో ముఖ్యంగా చెప్పుకోవాల్సిన నటులు ఇద్దరు తిరువీర్ మరియు అజయ్ ఘోష్. వీరిద్దరూ ఒకరితో ఒకరు పోటీపడి నటించినట్లు అనిపిస్తుంది. కథను ముందుకు నడిపించడంలో ఈ ఇద్దరూ రెండు పిల్లర్లలా నిలిచారు. బుజ్జమ్మ పాత్రలో నటించిన పాయల్ రాధాకృష్ణ కూడా తన పాత్ర పరిధిలో ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. ముఖ్యంగా కుటుంబ భావోద్వేగ సన్నివేశాల్లో ఆమె నటన సహజంగా అనిపిస్తుంది. సినిమా మొత్తం పెద్ద పెద్ద సస్పెన్స్ ట్విస్టులు లేకపోయినా, సరదాగా సాగిపోయే కథనంతో ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసే ప్రయత్నం చేసింది. కథనం సింపుల్‌గా ఉండటం వల్ల ప్రేక్షకులకు బోర్ అనిపించకుండా సాఫీగా ముందుకు సాగుతుంది. మొత్తంగా చూసుకుంటే, ఈ చిత్రం భారీ ట్విస్టులు ఆశించే ప్రేక్షకులకు కాకుండా, సరదాగా కుటుంబంతో కలిసి వీకెండ్‌లో చూసే లైట్ ఎంటర్‌టైనర్‌గా అనిపిస్తుంది.

## విడాకులపై ఎలాంటి పశ్చాత్తాపం లేదు



అల్లు అర్జున్ 'దేశముదురు' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైన హన్సిక.. అనతికాలంలోనే హీరోయిన్‌గా మంచి గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం సెకండ్ ఇన్నింగ్స్‌లో కూడా పలు సినిమాలు, షోస్ చేస్తూ బిజీ లైఫ్ లీడ్ చేస్తుంది. ఇక ఇటీవల ఈ బ్యూటీ తన భర్త సొహెల్ కతురియాతో విడాకులు తీసుకున్నట్లు ప్రకటించి వార్తల్లో నిలిచింది. అయితే.. తాజా ఇంటర్వ్యూలో తన విడాకులపై ఆసక్తికర కామెంట్స్ చేసింది. 'విడాకుల విషయంపై నేను ఎప్పుడూ స్పష్టత ఇవ్వలేదు. ఇవ్వాలని కూడా అనుకోవడం లేదు. డివోర్స్ అనేవి పూర్తిగా మా వ్యక్తిగతం. వాటికి సంబంధించిన కారణాలు మా మధ్యే ఉండాలి. అయితే.. విడాకులు తీసుకోవడంపై నాకు ఎలాంటి పశ్చాత్తాపం లేదు. మనం తప్పు ట్రైన్ ఎక్కామని తెలిసినప్పుడు అది దిగిపోవడమే మంచిది. ప్రస్తుతం నేను మానసికంగా బాగానే ఉన్నాను. నా వ్యక్తిగత జీవితంపై ప్రజల అభిప్రాయాల కంటే నాకు నా ఆరోగ్యం, శేయస్సు చాలా ముఖ్యం. ప్రజలకు కావాల్సింది హెడ్ లైన్స్, క్లిక్ బైట్స్ అవి వచ్చాయి. నా కష్టసమయంలో నా ఫ్యామిలీ నాకు ఎంతో అండగా నిలిచింది. విడాకుల తర్వాత కొంచెం ఫ్రెస్ అవ్వడానికి జపాన్ వెళ్లొచ్చాను' అని చెప్పుకొచ్చింది హన్సిక.



## ఓటీటీలోకి బ్యాండ్ మేళం మూవీ

'కోర్ట్' సినిమాతో వెండితెరపై మ్యాజిక్ క్రియేట్ చేసిన క్రేజీ జంట హర్ష రోషన్, శ్రీదేవి కలయికలో వచ్చిన చిత్రం 'బ్యాండ్ మేళం'. సతీష్ జవ్వాజి దర్శకత్వం వహించిన ఈ సినిమాను ప్రముఖ రచయిత కోన వెంకట్ నిర్మించారు.ఈ మూవీ ప్రమోషనల్ కంటెంట్‌తోనే సూపర్ బజ్ క్రియేట్ చేసుకుంది. ఇక భారీ అంచనాల మధ్య మార్చి 26న థియేటర్స్‌లోకి వచ్చి.. పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంది. ఇప్పుడు ఓటీటీ ఆడియన్స్‌ను అలరించేందుకు సిద్ధం అవుతున్నది.బ్యాండ్ మేళం డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ జీ 5 సొంతం చేసుకోగా.. 'మీరు మెచ్చిన జంట మరోసారి దరువేయబోతోంది.. మీరు సిద్ధమా?' అనే క్యాప్షన్ ఇచ్చి ఈనెల 24 నుంచి స్ట్రీమింగ్ కాబోతున్నట్లు ప్రకటించింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్ట్ వైరల్‌గా మారింది.

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,